57366
57367
కథా నిలయం
శ్రీకాకుళం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

అక్టోబర్ 25, 2009

వనం..జనం.. భోజనం

హ్యాపీ బర్త్‌డే

(2009 అక్టోబర్ 25 నుంచి 2009 అక్టోబర్31 వరకు)

కర్నె ఉదయ్‌బాల
అక్టోబర్-2004
సరస్వతి-శ్రీహరి
కొల్లాపూర్-మహబూబ్‌నగర్

ఎ. రమ్య(స్వీటీ)
అక్టోబర్-30
రమణి-రాజేశ్వర్
ఇబ్రహీంపట్నం-రంగారెడ్డి

డి.జ్యోతిసాయి
7సం॥,అక్టోబర్
అంజమ్మ-డి.వై.రాజు
గణపవరం-గుంటూరు

వెంపటి వివేక్
4సం॥,అక్టోబర్-28
రమ-వీరయ్య
జగన్నాథపురం-నల్లగొండ

ఎం. అభినవ్
అక్టోబర్-2008
విమల-యాదయ్య
అంబర్‌పేట్-హైదరాబాద్

పూస దీపిక
2సం॥,అక్టోబర్
శ్రీలత-ప్రభాకర్
ఉప్పల్-హైదరాబాద్

లీలా వైష్ణవి
3సం॥,అక్టోబర్-27
మాధవి-రామిరెడ్డి
మోదుకూరు-గుంటూరు

బి.మేఘన
5సం॥,అక్టోబర్
సీత-రామరాజు
రాజవరం, నల్లగొండ

జీనత్ కౌసర్
10సం॥, అక్టోబర్-27
షమీమున్నిస-ముక్తార్ అహ్మద్
మౌలాలి-హైదరాబాద్

సి. యశశ్రీ
అక్టోబర్
రమేష్ కుమార్

పి. దేవిశ్రీ
అక్టోబర్
ప్రశాంతి-శ్రీనివాస్
గణేష్ నగర్ కాలనీ
ఉప్పల్-హైదరాబాద్

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు, తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

మనలో మాట

ఒక 'దొంగ' నాటకం!

మృత్యువు ఆగమనం గురించి గరుడ పురాణంలో ఒక వర్ణన ఉంది:

అది వస్తున్నప్పుడు- 'ప్రకృతి బీభత్స రూపం దాలచీశీఅవగుస్తుంది. గాలి వెర్రెక్కినట్టు గింగిరాలు కొడుతుంది. చెట్లు 'శవ'తాండవం చేస్తాయి. గాడాంధకారం అలముకుంటుంది. నక్కల ఊలలూ, కుక్కల అరుపులూ భయోత్పాతాన్ని సృష్టిస్తాయి...' ఇది అక్షరాలా 'పురాణమే'! అయినప్పటికీ- ప్రతి పరిణామం ముందూ కొంత 'వాతావరణం' నెలకొంటుందన్నది మాత్రం నిజం! యాక్షను మొదలెట్టాలంటే దానికి ముందు తగిన సీను, రీజను సృష్టించాలి. సినిమాలో కనిపించే ఈ సూత్రం అమెరికా అంకుల్ శామ్‌కి ఎప్పుడో తెలుసు. కాబట్టే- తనకు అవసరం అయినప్పుడు ఇలాంటి వాతావ'రణాలు' సృష్టిస్తాడు.

ఓ గజదొంగ- 'దొంగా దొంగా' అని అరిచి జనాన్ని పక్కదారి పట్టించడం ఈజీ. వాళ్లలో గుబులు పుట్టించి తాను తక్షణం 'రక్షణావతారం' ఎత్తడం మరింత ఈజీ. కాపలా కాసే పోలీసు పోస్టు దక్కించుకుంటే- చల్లగా కొంపలు కొల్లగొట్టడం చాలా చాలా ఈజీ. అంకుల్ శామ్ పాపం.. చాలా కాలంగా ఈ ఉద్యోగం కోసమే ఎదురు చూస్తున్నాడు!

'రెండు పిల్లుల రొట్టె కథ'లో కోతి పాత్ర అంకుల్ శామ్‌కు చాలా ఇష్టం. అక్రమార్గంలో ఇద్దరి మధ్యా గిల్లికజ్జాలు పెట్టి- రాజమార్గంలో తీర్పరిగా చొరబడడమంటే మరీ ఇష్టం. కాశ్మీరం పేరుతో 'పెద్ద' పెత్తనం చేయాలని గెద్దలా వెంపర్లాడాడు. అనువైన ఆవాసం దొరికితే- దక్షిణాకాశం అంతా ఎగిరేయాలని, ఏలేయాలని తెగ ఉవ్విళ్లూరుతున్నాడు. 'అలీనా'న్ని ఆవిరి చేసేసి, తనలో విలీనమయ్యే పాలకులొచ్చాక- అంకుల్ శామ్ ఆశలు అంతంతై.. 'అణు'వంతై... ఆకాశం నిండా పరుచుకున్నాయి. ఆ అత్యానందంవల్లే కాబోలు, అమెరికా విమానాలు చెప్పాచెయ్యకుండా మన గగనతలంలోకి చొరబడుతున్నాయి.

ఇప్పుడు అమెరికా డేగ మన భూభాగంపై వాలడానికి తెగ తొందర పడుతోంది! భారత్‌తో 'అణు'బంధాన్ని పెనుబంధం చేసుకోవాలని ఉబలాటపడుతుంది! విషకౌగిలి బిగిసేముందు, జనబలి కోరేముందు కూడా ఒకలాంటి వాతావ'రణం' నెలకొంటుంది కాబోలు!

అందుకే- చైనాను ఓ భూతంలా చూపిస్తోంది. కట్టు కథలూ, కనికట్టు దృశ్యాలూ వండి వారుస్తోంది. అదిగో దురాక్రమణ... ఇదిగో వ్యతిరేక సంభాషణ... అదిగదుగో ఆయుధం... ఇదిగిదిగో పక్కలో బల్లెం.. ఔరా! ఏమీ అమెరికా అద్భుత అభూత కల్పన! అంకుల్ శామ్! నీ చరిత్ర మాకు తెలుసు.. నీ తోడేలు బుద్ధి మాకు తెలుసు... నీ వేయి నాల్కల విష ప్రచారం, కోటి రూపుల నిజ స్వరూపం మాకు తెలుసు... తగాదాలు రగిలించి చలి కాగాలని చూడకు. అలా చూస్తే... చేతులంటుకుంటాయ్ జాగ్రత్త!

★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	3
న్యాయసలహాలు	...	6
ఆరోగ్యం	...	7
తెల్సా	...	8
రుచి	...	9
సీరియల్	...	10
స్వేచ్ఛా ప్రతిమ	...	13
బంగాళదుంప కబుర్లు	...	16
క్రైమ్ కథ	...	17
అట్టమీది కథ	...	18
కథ	...	24
బాలనేస్తాలు	...	26
కొత్త పుస్తకాలు	...	28

ఇంకా...



స్ఫూర్తి ... 4

కరదీపిక

'కన్యాశుల్కం'

నవ్వుల్ పువ్వుల్ .. 12

అందమైన అబద్ధం

సినిమా కబుర్లు ... 22

మన హీరోలూ మారాలి



'కంజీవరం కథ' చాలా బావుంది

అక్టోబర్ 11 ఆదివారం స్నేహ సంచికలో కవర్ స్టోరీ 'బతుకు వెత... బంగరునేత' బాగా ఆకర్షించింది. కంజీవరం, కంచి, కాశీ, పెద్దాపురం, బందరు గద్వాల వంటి ప్రాంతాలు చీరలకు ప్రసిద్ధి. అయితే నానాటికీ చేనేత కార్మికుల పరిస్థితి దిగజారిపోయి వారికి బంగరు కలలే మిగిలాయి. ఈ అట్టమీది కథ చాలా బాగుంది.

సూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం, హైదరాబాద్.

మంచి చిత్ర పరిచయం

బతుకు వెత... బంగరు నేత... కవర్ స్టోరీ కథ కాదు. చేనేత కార్మికుల జీవన ప్రస్థానం. కంజీవరం చిత్రం గురించి పరిచయం అంటే చేనేత కార్మికుల జీవితాల గురించి తెలియజేయటమే. ఈ చిత్రంలో కథ స్వాతంత్ర్యానికి పూర్వపు ఇతి వృత్తంతో సాగినప్పటికీ నేటికీ చేనేత కార్మికుల పరిస్థితి అంతకన్నా ఘోరంగా వుంది. బతకలేక ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే వుంది. చలన చిత్రాలు ప్రజల జీవితానికి దర్పణం పట్టాలి. ఊహల జీవితాలు, అశాస్త్రీయ భావాలు, కట్టుకథలు, హింస, వికృత చేష్టలతో వస్తున్న సినిమాల నేపథ్యంలో మంచి చలన చిత్రాన్ని ప్రజలకు పరిచయం చేసిన ప్రజాశక్తికి అభినందనలు.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

ఔరంగాబాద్ చూడాలనుకున్నాం

అక్టోబర్ 11 ప్రజాశక్తి ఆదివారం అనుబంధం చదివిన తర్వాత 'చిరునవ్వుల దీపావళికి చిరు జాగ్రత్తలు' ద్వారా మనందరికీ ఇష్టమైన పండుగ దీపాల పండుగ సమయంలో అజాగ్రత్తగా వుండడం మూలంగా ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో, టపాసులు కాల్చేటప్పుడు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో, ఎలాంటి దుస్తులు ధరించాలో సవివరంగా అందించారు. ఆరోగ్యం పేజీలో వినికిడి లోపం గూర్చి కారణాలు, వాటిని ఎలా గుర్తించాలో, చికిత్స విధానం ఏంటో చక్కగా తెలియజేశారు. 'చూద్దామా' శీర్షికలో ఈవారం అందించిన ఔరంగాబాద్ విశేషాలు చదివిన తర్వాత ఈసారి సెలవుల్లో ఆ ప్రదేశాలన్నీ చూడాలనుకుంటున్నాము.

కామిడి సతీష్ రెడ్డి,
పరకాల, వరంగల్.

దీపావళి స్వీట్లు సూపర్

ఈవారం తెలుసుకుందామా శీర్షికలో అందరికీ అందని ఆహారం అంటూ మాకు తెలియని ఎన్నో విషయాలు తెలియజేశారు. ఈ శీర్షిక మాకు బాగా నచ్చింది. బతుకు వెత... బంగరు నేత అంటూ మీరిచ్చిన ఈ శీర్షిక నేటి చేనేత కార్మికుల స్థితి గతులకు అద్దం పడుతున్నట్టుగా వుంది. దీపావళి స్వీట్లు చాలా బాగున్నాయి. వారం వారం నవ్వుల్ పువ్వుల్, సీరియల్, స్ఫూర్తి మమ్మల్నెంతో ఆకట్టుకుంటున్నాయి.

రాణి, కూకట్‌పల్లి.

దీపావళి జాగ్రత్తలు మంచివే

వరదల వలన పేదల దారులు చెదిరాయి. పరిశీలక బృందాలు హడావిడి పడుతున్నాయి. కానీ ఈ నిధులు, కేంద్రం నుండి వచ్చే ఆర్థిక సాయం ప్రభుత్వ అవినీతిపర ఉద్యోగులకు, కాంగ్రెస్ వారికి బాగా అందుతున్నాయి. ఈ వరద ఓ పండుగలా వుంది. 'సి' బ్లాకుకు ఆగమనం రోశయ్యకు ఉపశమనం. బాద్‌షా, దాల్ పాయసం కమ్మగా బాగున్నాయి. దీపావళి జాగ్రత్తలు బాగున్నాయి. బతుకు వెత... బంగరు నేత... సినిమాలో నటించిన ప్రకాష్‌రాజ్ దేశం గర్వించదగ్గ నటుల్లో ఒకరు. ఔరంగాబాద్ శిథిల చిహ్నాలను చక్కగా తెలియజేశారు.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

చక్కటి వివరణ

'ఇది విన్నారా?' చాలా బాగుంది. అందరికీ అవసరమైన విషయాలు తెలియజేశారు. పిల్లలు చిన్నగా వున్నప్పుడు వినికిడి సమస్యను గుర్తించడం కష్టం. మనం కొన్ని జాగ్రత్తలు తీసుకుని ముందుగా గ్రహించి డాక్టర్‌కు చూపిస్తే చాలా వరకు సమస్య పరిష్కారమౌతుందని



తెలియజేశారు. మాటలు రావడానికి కూడా వినికిడి సమస్య లేకపోవడమే కారణం. కొద్దిగా అనుమానం వచ్చిన వెంటనే పరీక్షలు చేయిస్తే ప్రయోజనం వుంటుంది. అవసరమైతే ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ఆపరేషన్ చేయడం వీలౌతుంది. కొన్ని సమస్యలను మందులతోనే తగ్గించవచ్చు. కాని ఇప్పుడు హియరింగ్ ఎయిడ్స్ లభిస్తున్నాయి. డాక్టర్ గారు చాలా చక్కగా వివరించారు. దానివల్ల పట్టణ, పల్లె ప్రాంతాల వారికి కూడా చక్కని అవగాహన కలుగుతుంది. అలాగే మన ఆదివారం అనుబంధం స్నేహలో అందరికీ చాలా తక్కువ ధరలకే లభించే జనరిక్ మందుల గురించి కూడా తెలియజేయగలరు.

మురళీధర్, విజయవాడ.

★

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. ఆకర్షణీయమైన పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

కవిత్వమ్

అపజయాల దండయాత్ర

అడిగోపుల వెంకటరత్నమ్



గడియారం లేని ప్రస్థానానికి
సూర్యుడు చేతి గడియారం
రహదారి లేని గమ్యానికి
పాదం కాలిబాట
నిరాశ కప్పిన నిశ్చలానికి
ఆశ చలనం
నీరు దొరకని తాపానికి
కన్నీరు దాహహరణం
గుడ్డలేని దిసమొలకు
వల్కలం వస్త్రం
కాగితం లేని గంటానికి
తాళపత్రం ధవళపత్రం
రాతియుగం నుండి నేటియుగందాకా
విత్తు వటవృక్షమైన పరిణామ దశలు!
నేను వేటాడిన జింక నా చరాస్తి అయ్యాక
వ్యాఘ్రాలు నన్ను చరాస్తి చేసుకునే యత్నంలో
నేను ఎన్ని యుద్ధాలు చేశాను?
సముద్రాలు దాటే ప్రయత్నంలో
ఆకలిగొన్న తిమింగలాలకు ఆహారం కాకుండా
నేను ఎన్ని ఈతలు నేర్చాను?
పాదాలకు పసరు పూసి
ప్రవరుడిలా ఎగిరిపోతూ
పైబడే పుష్పక విమానాల్ని
నేను ఎన్నిసార్లు తప్పించుకున్నాను?
కళ్ళు చెయ్యలేని కర్తవ్యాలకు
నేను ఎన్నిసార్లు చేతుల్ని వాడుకున్నాను?
క్రియకు స్పందించే ఘటనల్లో
మాటలు చెయ్యలేని కార్యాలకు
నేను ఎన్నిసార్లు చూపులకు పనిపెట్టాను?
తుపానును నిర్జించాను
సునామీని జయించాను
అగ్నిని గెలిచాను
ఆకాశాన్ని అధిరోహించాను!
మానవుడు ఓడిపోతున్నాడు
మనిషి బెబ్బులై మాటు వేసి కొట్టాక
మానవుడు పరాజితుడౌతున్నాడు
మనిషి బడబానలమై బ్రద్దలయ్యాక
మానవుడు అపజయమౌతున్నాడు
మనిషి మారణాయుధమైపేలాక!
ఇప్పుడు నింగికి ఎగరటం కళగాదు
నేలను చుంబించటం కళ!

*

చిటికెడు స్వేచ్ఛ చాలు

- రఘుబాబు

నాకిష్టం వచ్చినప్పుడు తింటానికీ
నాకిష్టం వచ్చినట్లు చదువుకోవటానికీ
నాకిష్టం వచ్చినట్లు ఆడుకోవటానికీ
నాకిష్టం వచ్చినంత సేపు పడుకోవటానికీ
నాకిష్టం వచ్చినట్లు ఏడవటానికీ
స్వేచ్ఛలేదు స్వాతంత్ర్యం లేదు- అందరూ నియంతలే!
మీ ప్రకారంగానే పెరగాలి.... చదవాలి.. ఏడవాలి...
మిమ్మల్ని నేను ఏడిపించరాదు హైరానా పెట్టరాదు టెన్షన్ పెట్టరాదు
మీరు నన్ను ఏడిపించవచ్చు దండించవచ్చు
అప్పుడప్పుడు నన్ను నవ్విస్తారు కానుకలిస్తారు ప్రేమలోలకపోస్తారు
అవన్నీ మీకనుగుణంగా ఉండేంతవరకే
మిమ్మల్ని సంతోషపెడ్తున్నంత కాలమూ నేను గుడ్‌బాయ్‌ని!
మీ కలల ఆదర్శాల ఆశల పల్లకిని మోస్తున్నంత కాలమూ నేను గుడ్‌బాయ్‌ని!
సంప్రదాయాల కొనసాగింపు కోసం మీ వారసత్వ ప్రతినిధినైన గుడ్‌బాయ్‌ని!
మనమొక శాంతి ఒప్పందం చేసుకోవటం మంచిదేమో
ఎందుకంటే
మీ డిసిప్లీన్‌లో అడ్జెస్టు కాలేను- నేనింకా తూనీగనూ లేగదూడనూ కదా
గడియారంతోపాటు పరుగెత్తలేను - నేనింకా సామాజిక యంత్రాన్ని కాలేదుకదా
చిటికెడు స్వేచ్ఛ గుప్పెడు ఆశ ఇవ్వండి చాలు
మీ కోసమే పెరుగుతాను - చదువుకుంటాను
మీలానే సమాజపు యంత్రంలో ఓ శీలనైపోతాను
మీలానే మరో మరబొమ్మనైపోతాను....

*

స్మృతి

కరదీపిక 'కన్యాశుల్కం'

డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
తెలుగు శాఖాధిపతి,
వేమన విశ్వవిద్యాలయం, కడప



నేను 1977 ఆగస్టు చివర్లో అనంతపురం పిజి సెంటర్లో లెక్చరర్‌గా చేరాను. ఆ ఏడాదే అక్కడ సెమిస్టర్ విధానం ప్రారంభమైంది. డిసెంబర్లో మొదలయ్యే రెండో సెమిస్టర్లో మొదటి పేపర్ ఆధునిక సాహిత్యం (వాచకాలు) ఉండేది. అందులో విశ్వనాథ 'కల్పవృక్షం'లో కొంత భాగం, జాషువా 'గబ్బిలం', గురజాడ 'కన్యాశుల్కం' మూడు వాచకాలుండేవి. అప్పటి మా శాఖాధ్యక్షులు ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరావుగారు విశ్వనాథ మార్గేయులు. 'కల్పవృక్షం' తీసుకున్నారు. ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు ఆయన అభిరుచికనుగుణంగా 'గబ్బిలం' తీసుకున్నారు. కన్యాశుల్కం నాటకాన్ని నన్ను బోధించమని ఆదేశించారు మా గురువుగారు. చెప్పను అనడానికి గానీ, చెప్పడానికి వీలు కాదు అనడానికి గానీ అవకాశం లేదు, గురువాజ్ఞ. అప్పటికి నాకు ఆధునిక సాహిత్యంతో పెద్దగా పరిచయం లేదు. ఉన్న పరిచయం పాఠం చెప్పడానికి సరిపోదు. ఎంఏలో మాపాఠ్య ప్రణాళికలో ఆధునిక సాహిత్యానికి అంతగా స్థానం లేదు. నా పరిశోధన కూడా 'ప్రభాత ప్రద్యుమ్నం' అనే ప్రాచీన కావ్యం మీదనే. భావజాలపరంగా కూడా అప్పటికి నేను సంప్రదాయవాదినే. 'ఏమి చెయ్యాల్రా దేవుడా' అని ఒకింత దిగులు కూడా పట్టుకుంది.

సరే ఎమెస్కో వాళ్ళు ప్రచురించిన 'కన్యాశుల్కం' నాటిక ప్రతిని కొనుక్కుని చదివాను. అందులో వున్నది నాకు సంబంధించిన జీవితం కాదు. నాకు పరిచయమున్న జీవితం కాదు. నా ప్రాంతానికి సంబంధించిందీ కాదు. అందులోని భాష నేను మాట్లడే భాషా కాదు. నేను చదువుకున్న భాష కూడా కాదు. ఆ ప్రతిలో ఎస్వీయూనివర్శిటీలో బంగోరేగారు దక్షిణ ఢిల్లీలోని తెలుగు వారు ప్రచురించిన గురజాడ స్మారకసంచిక ఇచ్చారు. భూమన్ కెవి రమణా రెడ్డిగారి 'మహోదయం' చూడమని సూచించారు. అనంతపురంలోని సర్దేశాయి తిరుమల రావుగారు తాను రచించిన 'కన్యాశుల్కం నాటక కళా పుస్తకాన్నిచ్చారు. ఈ మూడు గ్రంథాలను చదివాను. కన్యాశుల్కం నాటకం పుస్తకం కుట్లు విప్పి ఒక్కో కాగితానికి మధ్య రెండేసి తెల్ల కాగితాలు పెట్టి కుట్టుకుని పెద్దల వ్యాఖ్యానాలన్నిటినీ రాసుకున్నాను. తరగతి గదిలో పాఠం చెప్పడం ప్రారంభించాను. ఒక రకంగా నేను, నా విద్యార్థులు ఒకేసారి కన్యాశుల్కం నాటకాన్ని చదవడం ప్రారంభించాం. ఆ నాటకాన్ని నాలుగేళ్ళు పాఠం చెప్పాను. క్రమక్రమంగా నాటకం అర్థం కావడం మొదలైంది. చివరికి నాకు ఒక కొత్త ప్రపంచం కనిపించింది. నేను చదవవలసిన సాహిత్యం వేరే ఉందని బోధపడింది. నాలో కదలిక మొదలైంది. ఆలోచనలు మారనారంభించాయి.

అప్పటి నుంచి మూడు దశాబ్దాలుగా ఆ నాటకం నాకు కరదీపిగా మారిపోయింది. నా ప్రసంగాలలో కన్యాశుల్కం ప్రసక్తి లేకుండా సాగడం అసాధ్యమైంది. నేను అనంతపురం వెళ్లేదాకా సంప్రదాయ వాదినే. వెళ్లాక కూడా అయిదేళ్ల వరకూ అలానే ఉన్నాను. ఆ తర్వాత నాలో అక్కడ హేతువాద సంఘంతోనూ, అక్కడి యువరచయితలతోనూ పరిచయమైంది. 1987 తర్వాత జనవిజ్ఞాన వేదికలో భాగస్వామినయ్యాను. శాస్త్రీయ భావప్రచారం కోసం, అశాస్త్రీయ భావ ఖండనకోసం కన్యాశుల్కం నాటకంలోని సన్నివేశాలు, సంభాషణలు నాకు ఆధారమయ్యేవి. నాగేశ్వరాచారి, ప్రేంచంద్, జూలూరి గౌరీశంకర్ వంటి నా విద్యార్థులు కొందరు గురజాడ పూనకం వచ్చిన వాడిగా నన్ను చమత్కరించేవారు.

కన్యాశుల్కం సమస్య లేకపోయినా ఆ నాటకం ఇంకా ఎందుకు విలువైందిగా ఉంది? కేవలం ఒక భావజాలం గలిగిన వాళ్ళు దానిని వెనకేసుకురావడం వల్లనే అది నిలుచుందా? కాదు. మానవ జీవితాన్ని గురజాడ చిత్రిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు, మానవ స్వభావాన్ని ఆయన పాత్రల ద్వారా ఆవిష్కరించిన తీరు ఇందుకు కారణాలు.

నేను ఉద్యోగంలో చేరింది(1977 ఆగస్టు) ఎమర్జెన్సీ చీకటి రోజుల తర్వాత మళ్లీ రాజకీయ హడావిడి మొదలైన కాలం. బూర్జువా రాజకీయపార్టీల నాయకులు ఆయా రంగాలను వేగవంతం చేస్తున్న సమయం. వెళ్లే వారు, వచ్చేవారు ఆ యా పార్టీల మీద ఏవో రాళ్లువేసి రావడం మామూలే. అప్పటి నుంచీ ఇప్పటిదాకా ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. "అప్పుడప్పుడూ ఒపీనియన్స్ చేంజి చేస్తుంటేగానీ పొలిటీషన్ కానేరడు" అన్న గిరీశం మాట నిబద్ధత లేని రాజకీయాలకు అద్దం పట్టడం లేదా?

సమాజంలోని అన్ని రంగాలలోనూ అవినీతి తాండవం చేస్తున్నది, చాలా కాలంగా. నీతి నియమాలు అరుదైపోతున్న సమయంలో నూరేళ్ల ..... "మగవాడికైనా ఆడదానికైనా నీతి ఉండాలి"

అప్పటి నుంచి మూడు దశాబ్దాలుగా ఆ నాటకం నాకు కరదీపిగా మారిపోయింది. నా ప్రసంగాలలో కన్యాశుల్కం ప్రసక్తి లేకుండా సాగడం అసాధ్యమైంది. నేను అనంతపురం వెళ్లేదాకా సంప్రదాయ వాదినే. వెళ్లాక కూడా అయిదేళ్ల వరకూ అలానే ఉన్నాను. ఆ తర్వాత నాలో అక్కడ హేతువాద సంఘంతోనూ, అక్కడి యువరచయితలతోనూ పరిచయమైంది. 1987 తర్వాత జనవిజ్ఞాన వేదికలో భాగస్వామినయ్యాను. శాస్త్రీయ భావప్రచారం కోసం, అశాస్త్రీయ భావ ఖండనకోసం కన్యాశుల్కం నాటకంలోని సన్నివేశాలు, సంభాషణలు నాకు ఆధారమయ్యేవి. నాగేశ్వరాచారి, ప్రేంచంద్, జూలూరి గౌరీశంకర్ వంటి నా విద్యార్థులు కొందరు గురజాడ పూనకం వచ్చిన వాడిగా నన్ను చమత్కరించేవారు.

అని ప్రబోధించిన మధురవాణి వైతాళిక అనిపిస్తుంది. కన్యాశుల్కం నాటకంలో మంచికి ఏకైక ప్రతినిధి సౌజన్యారావు పంతులు. కొత్త మనిషి (మధుర వాణి) "పరిపూర్ణమైన తమ మంచిలో చెడ్డలేదని వింటున్నాను" అంటే "నా చెడ్డ లోకమేమెరుగును?" అనగలిగిన గుండెనిబ్బరం ఆయనది.

వెంకటేశం ఇంగ్లీషు చదువు గురించి అగ్నిహోత్రావధాని వెంకటమ్మల మధ్య జరిగిన సంఘర్షణ, పాత వ్యవస్థ పోతూ కొత్త వ్యవస్థ వస్తున్న సంధి దశలో మానవ సంబంధాలలో జరిగే సంఘర్షణగా నాకర్థమైంది.

మా సీనియర్ ప్రొఫెసర్ ఒకాయన సంస్కృతాన్ని గొప్పగా చదువుకున్నారు. ఆయన పద్ధతిలో సంస్కృతాన్ని అత్యద్భుతంగా బోధించేవారు. కానీ విద్యార్థులు ఆయన బోధన పట్ల ఆసక్తి చూపేవారుకాదు. బయటికి వెళ్లే వారు. ఆయన క్లాసు కాగానే మళ్లీ వచ్చేవారు. మా ప్రొఫెసర్ బాధపడేవారు. ఆయన వేదన చూసినప్పుడల్లా నాకు కన్యాశుల్కంలో మహేశం పాత్ర సమాధానం చెప్పేది. కాలం చెల్లిన విద్యావ్యవస్థలో కాలం చెల్లిన విద్యనూ, పొట్టకూడు పెట్టని విద్యనూ చదువుకోండని వత్తిడి చేస్తే విద్యార్థులకు దాని మీద ఎంత అలెర్జీ కలుగుతుందో మహేశం పాత్ర ఆవిష్కరించింది.

ఉద్యోగ విరమణ చేసేదాకా అనేక మంది స్వార్థపరులు, సోమరిపోతులు తగిలారు. కొందరు విద్యార్థులకు చదువు చెప్పరు. చెప్పినట్లు నటిస్తారు. విద్యార్థుల్ని విద్యేతర పద్ధతుల్లో ఆకర్షిస్తారు. తమలో ఉండే అవలక్షణాలు ఇతరులలో ఉన్నట్లు విద్యార్థుల్లో ప్రచారం చేస్తారు. చివరకు ఎప్పుడో ఒకప్పుడు చీవాట్లు తింటారు. గిరీశం, కరటకశాస్త్రి వీళ్లకు పితామహులు. ఉపాధ్యాయులు ఎలా ఉండకూడదో, విద్యార్థులు ఎలా ఉండాలో కన్యాశుల్కం నాటకం అద్భుతంగా ప్రదర్శించింది.

'జేబు కత్తిరించిన వాడే దొంగ దొంగ అని అరిచినట్టు' అని సామెత ఉంది. ఒకరు ఒక చెడ్డపని చేసి ఆ చెడ్డపని ఇంకెవరో చేసినట్లు అరవడన్నమాట. ఈ దుష్ట స్వభావానికి మూలపురుషుడు కన్యాశుల్కం నాటకంలో రామప్పంతులు, లుబ్ధావధాన్లు కూతురు మీనాక్షిని తన స్వార్థానికి ఉపయోగించుకొని చెడగొట్టింది రామప్పంతులే. ఆమె ప్రవర్తన బాగాలేదని ప్రచారం చేసిందీ అతనే. పచ్చి కులవాదులు ఇంకా చెప్పాలంటే కులఅహంకారులు సెక్యులరిజం గురించి అంబేద్కర్ గరించి గట్టిగా మాట్లాడేవాళ్ళను నేను చూశాను. వీళ్ళే ఇతరులను కులవాదులని అనడమూ గమనించాను. ఏమిటీ ద్వంద్వ ప్రవృత్తి? రామప్పంతులు వారసత్వమే. గురజాడ నూరేళ్ళ కిందటే ఇలాంటి వాళ్ళను పసిగట్టి ప్రదర్శించారు.

ఒక సామాజిక వర్గం అనుభవించే ఒక సామాజిక సౌకర్యంలోకి మరో సామాజిక వర్గం ప్రవేశించిందంటే ఆ రెండు వర్గాల మధ్య జరిగే సంఘర్షణ మనం చాలా సందర్భాలలో గమనించాం. విద్యా ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు అమలుపరిచే సమయాలలో ఈ సంఘర్షణ మరింత స్పష్టంగా కనిపించింది. మనసమాజంలో అవసరాలు ఎక్కువ, అవకాశాలు తక్కువ. పోటీ సంఘర్షణ అనివార్యం. మెకాలే విద్యావిధానం ఈ పోటీ సంఘర్షణల వ్యవస్థను ప్రారంభించింది. గురజాడ ఇరవయ్యో శతాబ్దం ప్రారంభలోనే ఈ వాస్తవాన్ని గమనించి నాటకంలో చిత్రించారు. "యీ యింగ్లీషు చదువులు లావైన కొద్దీ వైదాదులే అన్న మాటేమిటి. అడ్డమైన జాతుల వాళ్ళవే ఉద్యోగాలవుతున్నాయి" అంటారు రామప్పంతులు, కరటకశాస్త్రి అనే వైదిక బ్రాహ్మణునితో. నియోగ బ్రాహ్మణులు మాత్రమే తరతరాలుగా అనుభవిస్తున్న ఉద్యోగరంగంలోకి ఆధునిక కాలంలో వైదిక బ్రాహ్మణులు, ఆ పైన బ్రాహ్మణేతరులు ప్రవేశిస్తున్న పరిణామం సహించలేని రామప్పంతులు చేసిన వ్యాఖ్య ఈ వాక్యం.

ఏదైనా కొత్తది సంఘంలోకి ప్రవేశించిన మొదట్లో దానిని తీవ్రంగా ప్రతిఘటించడం, ఆ తర్వాత మెల్లగా దానికి అలవాటు పడిపోయి, దానితో సర్దుకుపోవడం మనకు బాగా అలవాటైన విద్య. ఎక్కడిదాకో ఎందుకు? ఇటీవలి ప్రపంచీకరణ విషయమే చాలు. 1990లలో గాట్ ఒప్పందం మీద సంతకం జరిగి, అది ఎల్‌పిజి వ్యవస్థగా రూపొందినప్పుడే తెలుగు మేధావుల ఆందోళన అంతా ఇంతకాదు. అమెరికా సామ్రాజ్యవాదానికి ప్రపంచీకరణ పరాకాష్ట అని అనేకులు చాటారు. ఇవాళ అది మామూలైపోయింది. శుభ్రంగా పిల్లలను అమెరికాకు పంపిస్తున్నారు. పిల్లల పేరు చెప్పి అమెరికాకుపోయి ఉండి వస్తున్నారు. ఈ బాపతుజనానికి మూలపురుషుడు అగ్నిహోత్రావధాని "ఈ వెధవ యింగ్లీషు చదువు వల్ల మంచి బ్రాహ్మణ్యం చెడిపోతుంది" అనేది ఆయన వాదం. ఇలాంటి అగ్నిహోత్రావధాని కొంత కాలానికే "మొత్తమ్మీద మీ యింగ్లీషుచదువు మంచిదిలాగే కనపడుచున్నది" అనే దశకు చేరుకున్నారు. మన సమాజంలో ఇంకోరకం వాళ్లు కూడా ఉన్నారు. నువ్వు ఏదన్నా చెప్పు, అది వెనకటి రోజుల్లోనే ఉంది అంటుంటారు వీళ్లు. "యీ తెల్ల వాళ్లు చేసే విద్యలన్నీ మన గ్రంథాల్లోంచి యెత్తుకెళ్లినవే. యీ రెయిళ్లూ గియిళ్లూ యావత్తు మనవేదంలో ఉన్నాయిష" అని అగ్నిహోత్రావధాని ఏ శుభ ముహూర్తంలో అన్నాడోగానీ ఆ తర్వాత ఆయన వారసులు పుట్టుకొచ్చారు. నేటికీ ఉన్నారు. మొన్నటికి మొన్న

ఒక విద్వాంసుడు కంప్యూటర్ అంటే ఏమోకాదు, మన యోగదృష్టే అని బల్ల గుద్ది చెప్పేశారు ఒక టీవీ చానెల్లో. కార్లమార్క్స్ చెప్పడమేంటి? సమసమాజాన్ని వ్యాసవాల్మీకులే చెప్పేశారు అనేవాళ్లు ఈ బాపతే!

సమస్యలను గుర్తించడం ఒక ఎత్తు. వాటికి పరిష్కారాలను కనుగొనడం మరో ఎత్తు. వాటిని సాధించడం ఇంకో ఎత్తు. జీవిత సమస్యలకు జీవితంలోంచే పరిష్కారాలు రావాలి, ఊహల్లోంచి కాదు. సినిమాలు చాలా ఈజీగా పరిష్కారాలు చూపుతూ ఉంటాయి. దీని వల్ల ఏమౌతుందంటే సమస్యలకు పరిష్కారాలను కనుగొనడం చాలా ఈజీ అనిపిస్తుంది. సమస్యలను సృష్టించినంత సులభంగా కాదు, వాటిని పరిష్కరించడం. ఒక్కోసారి కొబ్బరిని చెయ్యబోయి కోతిని చేసినట్లౌతుంది. గరీబీ హటావో కాస్త గరీబోంకే హటావో అయ్యింది అని ఒకప్పుడు రాజకీయ రంగంలో వినిపించే విమర్శ. సంఘసంస్కరణోద్యమ కాలంలోనే గురజాడ అశాస్త్రీయ, అమానవీయ పరిష్కారాలను చెప్పే మేధావుల పట్ల చురకలేశారు. వేశ్యావృత్తి నిర్మూలన పట్ల, నాటి సంస్కర్తల తీరు పట్ల గురజాడకు అసంతృప్తి ఉండేదని 'రారా' గుర్తించారు. వేశ్యావృత్తి నిర్మూలన కాస్త వేశ్యల నిర్మూలనగా మారుతుందా? అని భావించారు గురజాడ.

వైరుధ్యాలపుట్ట అయిన భారతదేశంలో ప్రజలతో పాటు ప్రజల సమస్యలు కూడా విభజితమై ఉంటాయి. అందరి సమస్యల గురించి అందరూ ఒకే దృష్టితో ఆలోచించడం సాధ్యం కాదు. ఒకరికి సమస్యగా కనిపించింది మరొకరికి సమస్యగా కనిపించదు. ఒకరికి పరిష్కారమైంది. మరొకరికి పరిష్కారం కాదు. ఒకరికి అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం సమస్య అయితే, ఇంకొకరికి ఊళ్లో తాగే నీళ్ల కరువు సమస్య ఇవాళ మనం గమనిస్తున్నాం. "మొన్న మనం వొచ్చిన బండివాడికి నేషనల్ కాంగ్రెస్ విషయమై రెండు ఘంటలు లెక్చరు యిచ్చేసరికి ఆ గాడిద కొడుకు వాళ్లవూరు ..... కానిస్టేబుల్ని కాంగ్రెస్ వారు యెప్పుడు బదిలీ చేస్తారని అడిగారు" అంటారు గిరీశం వెంకటేశంతో. గిరీశం సమస్య వేరు, బండివాడి సమస్య వేరు అని దీనర్థం. ఒకే సమస్య మీద విభిన్న వర్గాల వాళ్లు విభిన్న రకాలుగా ప్రతిస్పందించినప్పుడల్లా కన్యాశుల్కంలోని ఈ సంభాషణ నాకు గుర్తుకొస్తుంది.

అనేక సామాజిక సమస్యలకు, మానవ స్వభావంలోని వైవిధ్యానికి ఇంకా ప్రాతినిధ్యం వహిస్తున్న కన్యాశుల్కం నాటకంలోని పాత్రలను, సంభాషణలను సరికొత్తగా అధ్యయనం చెయ్యడమే నేటి మన కర్తవ్యమనిపిస్తుంది. అందుకే ఇది కరదీపిక.

★

ఇసుక అక్రమ రవాణా అడ్డుకోలేమా!

మాది నల్లగొండ జిల్లా. మా జిల్లాలోని వాగుల వద్ద ఇసుకను లారీల్లో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. దీని ద్వారా కొన్ని కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నారు. దీని వెనుక అన్ని రాజకీయ నాయకులు వున్నారని అనుకుంటున్నారు. అధికారులు చూసీ చూడనట్టుగా వుంటున్నారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇలా ఇసుక మొత్తం తీయడంతో గతంలో మా జిల్లాలోనే అలేరు రైలు వంతెనకు ప్రమాదం ఏర్పడి మరమ్మతులు చేయాల్సివచ్చింది. అప్పటి నుండి అక్కడ ఇసుక తీయడం బంద్ చేశారు. కానీ కొన్ని చోట్ల మూసీ వాగు నుండి తీసుకెళ్తున్నారు. దీన్ని అరికట్టలేమా? ఏ విధంగా అరికట్టవచ్చో తెలియజేయగలరు. రైతుకు న్యాయం చేయగలుగుతాము.

శివాజీ, నకిరేకల్.

మీ సమస్య చాలా ప్రబలమైంది. నిజం కూడా. దీని వెనుక పెద్దలు వుండి నడిపిస్తున్నారన్నది కూడా బహుశా నిజం కావచ్చు. ఇలా ఇష్టానుసారం ఇసుక తరలించకుండా ప్రభుత్వం కొన్ని జీఓలు తీసుకొచ్చింది. హైకోర్టు చాలా చోట్ల జోక్యం చేసుకుని బంద్ చేయించింది. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో మాత్రమే ఇసుక తరలించవచ్చు. సాధారణ వాగుల నుండి ఇసుకను తరలించవద్దని హైకోర్టు తీర్పు చెప్పింది. మీరు మీ దృష్టికి వచ్చిన ఇటువంటి పబ్లిక్ ఇంట్రెస్టెడ్ విషయాలపై హైకోర్టులో న్యాయవాదిని నియమించుకుని కేసు వేయవచ్చు. లేదా చీఫ్ జస్టిస్‌కు ఉత్తరం రాసినా దీనిని పిటిషన్‌గా పరిగణించి స్పందించే అవకాశాలు కూడా వుంటాయి.

జి ఎల్ నరసింహారావు,
అడ్వకేట్,
3-4-778 నుండి 780/1,
బి-002, ప్రసాద్ ఎన్‌క్లేవ్,
బర్కత్‌పురా రోడ్, హై ద రా బా ద్

బయానా తీసుకుంటే అమ్మాల్సిందేనా?

లాయర్‌గారికి నమస్కారములు. మా సమస్య ఏమిటంటే మా నాన్నగారు 1981లో రెండు ఎకరాలు భూమి కొన్నారు. దీనిని 2003లో సంవత్సరం అమ్మాలని 3 లక్షలకు బేరం కుదుర్చుకుని ఒక లక్ష బయానాగా తీసుకున్నారు. కానీ ఇంట్లో అందుకు ఒప్పుకోలేదు. మా అమ్మగారు భూమి అమ్మొద్దని చెప్పడంతో మళ్లీ వెంటనే ఆ డబ్బులు ఇవ్వడానికి వెళ్లాను. అయితే వాటిని తీసుకోవడానికి అతను నిరాకరించాడు. మాకు ఆ భూమి అమ్మాలని లేదు. అందుకే అమ్మలేదు. కానీ అతను మాత్రం ధర ఎక్కువ వస్తుందన్న కారణంగానే భూమిని మేం అమ్మడంలేదని కోర్టులో దావా వేశాడు. ఆ భూమిపై మాకు హక్కు వుంటుందా లేక అతడికి అమ్మవలసిందేనా తెలుపగలరు.

ఓ సోదరుడు.

ఇద్దరి మధ్య కాగితాల మీద ఒప్పందం కుదిరితే కాగితం ప్రకారం నడుచుకోవాల్సి వుంటుంది. అతడికి మీరు తిరిగి డబ్బులు ఇవ్వబోయినట్లు ఎటువంటి ఆధారాలైనా ఉన్నట్లయితే వాటి ఆధారంగా మీరు కేసు వాదించుకోవచ్చు. లేదా బలవంతంగా రాసి ఇవ్వాల్సి వచ్చిందని అలాంటి అవకాశాలు వుండి వుంటే మీ వాదనలతో నిరూపించుకునే ప్రయత్నం చేయండి. నిరూపించుకోలేకపోతే డిక్రీ అయ్యే అవకాశం ఉంటుంది. కోర్టులో కేసు మూడు సంవత్సరాలలో ముగించవలసి వుంటుంది. ఆ సమయం, గడువు దాటాక వేసినా చెల్లదు.

★

5 కే...జీ...ల చింతకాయ

మామూలుగా చింతకాయ పచ్చడి పట్టుకోవాలంటే ఎన్ని చింతకాయలు కావాలి?

ఆ... ఎన్ని! నాలుగైదు కేజీలన్నా కావొద్దూ. ఓ మాదిరిసైజు జాడీలో దీన్ని నింపుకొని ఏడాదంతా ఊరించుకుంటూ తినాలంటే ఆ మాత్రం కావాలికదా.

అంత అవసరం లేదండీ. ఒక్కటంటే ఒక్క చింతకాయ చాలు. జాడీ నిండా పచ్చడి ఐపోతుంది. ఏడాదంతా మీరు కోరుకున్నట్టే లొట్టలేసుకుంటూ తినొచ్చు.

ఏంటీ... ఒక్క చింతకాయతో...జాడీ పచ్చడా! చెవులో చింత పూలు పెడుతున్నారే!

అర్రే! కావాలంటే... ఈ ఇద్దరి చేతుల్లో వున్న చింతకాయ చూడండి.

ఏంటీ! అది చింతకాయా? అంత పెద్దగా వుందేం? సాధారణంగా చింతకాయ నలభయ్యో,యాభయ్యో గ్రాముల బరువుంటుంది. ఇంత పే...ద్ద చింతకాయను మేమెప్పుడూ చూడలేదే! ఇంతకూ ఎంత బరువుంటుందేంటి?

మేంకూడా ఈ సైజు చింతకాయను చూడ్డం ఇదే మొదటిసారిలెండి. ఇక బరువంటారా! ఎంత సింపుల్‌గా 5 కేజీలే.

ఏవన్నారు! 5 కే...జీ...లా! చూస్తుంటేనే నోరూరిపోతోంది. ఇంక ఆగలేకపోతున్నాం... ఇంత భారీ చింతకాయ ఎక్కడ కాచిందంటా...?

ఆయ్! అక్కడికే వత్తన్నావండీ...అయ్ బాబోయ్ ఊరు పేరు కంటే ముందు జిల్లా యాస వచ్చేత్తంది బాబోయ్. పాయింట్‌కొస్తే... తాళ్లపూడి సంతలో కనిపించింది. దీన్ని చింతకాయల వ్యాపారి బాదరాల శ్రీనివాస్ విశాఖ జిల్లా చింతపల్లి గాటీ నుండి కొనుగోలు చేశాడు. అయితే జనాలు మాత్రం గుంపులు గుంపులుగా వచ్చి ఈ భారీ చింతకాయను చూసి వెళ్తున్నారు. చెట్టు నుంచి కోసి మూడు నెలలైనా ఇంకా పచ్చిగానే వుందంట.

★

ఆరోగ్యం

మాటిమాటికీ మూడ్ మారిపోతోందా!



బైపోలార్ మూడ్ డిజార్డర్‌నే మేనిక్ - డిప్రెసివ్ సైకోసిస్ అని కూడా పిలుస్తారు. ఇది వున్న వారికి ఊరకే మూడ్ మారిపోతుంటుంది. ఇది ఒక రకమైన మూడ్ డిజార్డర్. బైపోలార్ మూడ్ డిజార్డర్‌లో మార్పులు అత్యంత తీవ్ర డిప్రెషన్ నుండి మేనియా, హైపర్ యాక్టివిటీ వరకూ ఉంటాయి. అప్పడప్పుడు వాస్తవికతతో సంబంధం కోల్పోతుంటారు. అయితే ఎక్కువ కాలం పూర్తిగా మామూలుగా కూడా వుంటారు. ఈ ఎటాక్‌లు వచ్చినప్పుడు మాత్రం క్లినికల్‌గా జబ్బుతో ఉన్నట్లు పరిగణిస్తారు. బైపోలార్ మూడ్ డిజార్డర్ రోగ నిర్ధారణ చేసే ముందు మేనియా ఎటాక్‌తో పాటు డిప్రెషన్ ఉంటుందా అనే విషయాన్ని డాక్టర్ లేదా సైకియాట్రిస్ట్ చూస్తారు.

డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్
సైకియాట్రిస్ట్
అనంతపురం.
9848316994

బైపోలార్ మూడ్ డిజార్డర్ కలగడానికి గల కారణాలు ఏమిటనే విషయం తెలుసుకునేందుకు పెద్ద ఎత్తున పరిశోధన జరుగుతోంది. కానీ ఇంత వరకూ కచ్చితంగా నిర్ధారణ కాలేదు. జన్యుపరమైన కారణాలుండవచ్చు. ఇలాంటప్పుడు కుటుంబంలోని ఇతర సభ్యులు కూడా ఈ జబ్బుతో బాధపడవచ్చు. తీవ్రమైన ఒత్తిళ్లు లేదా పుట్టుక తర్వాత కలిగే హార్మోనల్ మార్పుల వల్ల కూడా ఇది ప్రేరేపితం కావచ్చు. మూడ్‌లకు బాధ్యత కలిగిన మొదటి ఏరియాను ప్రభావితం చేసే రసాయనిక అసమతుల్యం వల్ల కూడా ఇది కలగవచ్చు. తద్వారా భావనలు మరియు ప్రవర్తనలో మార్పులు కలిగించవచ్చు.

డిప్రెషన్ లక్షణాలు

- ○ జీవితంపై ఆసక్తి కోల్పోవడం, ఆనందం కోల్పోవడం
- ○ చిన్న పనులు, నిర్ణయాలు కూడా కష్టంగా, అసాధ్యంగా అనిపించడం
- ○ తీవ్ర బడలిక
- ○ తీవ్ర ఆందోళన, అశాంతి
- ○ బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం
- ○ నిద్ర పట్టకపోవడం
- ○ ఆప్యాయతను కోల్పోవడం, సెక్స్‌లో కోరిక లేకపోవడం
- ○ పనికిమాలిన వాడినని, తగనివాడినని, చెడ్డవాడినని, నిస్సహాయుడనని, నిరాశావాదినని భావన
- ○ రోజులో నిర్దిష్టమైన సమయంలో పరిస్థితి విషమించిందన్న భావన
- ○ ఆత్మహత్యా ఆలోచనలు డిప్రెషన్‌లో చాలా సామాన్యం. ఇలాంటి సమయాల్లో సహాయం చాలా అవసరం.

మేనియా, హైపో మేనియా లక్షణాలు

- ♦ అసామాన్యమైన చురుకుదనం
- ♦ యాక్టివిటీ, శక్తి పెరగడం
- ♦ నిద్ర లేకపోవడం లేదా నిద్రపోవాలనిపించక పోవడం
- ♦ వేగంగా మాట్లాడటం, చురుకుగా ఉపాయాలు లేదా ఆలోచనలు రావడం
- ♦ లేనిపోని ఆత్మగౌరవం పెంచుకోవడం
- ♦ చికాకు ఎక్కువ అవడం, సహనం లేకపోవడం
- ♦ లైంగిక కోరిక పెరగడం, సభ్యత, సంస్కారం లేక పోవడం
- ♦ జడ్జిమెంట్‌ని కోల్పోవడం, దుడుకుగా నిర్ణయాలు తీసుకోవడం
- ♦ అహేతుకంగా డబ్బు ఖర్చుపెట్టడం
- ♦ ఆడంబరపూర్వక భ్రమలు

బైపోలార్ మూడ్ డిజార్డర్ ప్రారంభ సంకేతం హైపో మేనియా కావచ్చు. ఒక వ్యక్తి తన శక్తిని, ముభావాన్ని, చికాకును, దుడుకు స్వభావాన్ని, నిర్లక్ష్యమైన ప్రవర్తనను అత్యధిక స్థాయిలో ప్రదర్శించే స్థితి ఇది.

అనుభవంతో, వాళ్ళ స్థితిని గుర్తించడం సాధ్యమే. కానీ అనేక సందర్భాల్లో తీవ్ర స్థితిలో, అవగాహన మొత్తాన్ని కోల్పోయిన తర్వాత గుర్తిస్తారు. ఈ సమస్యతో బాధపడుతున్న వాళ్ళు ఊహల్లో విహరించడం, అధికంగా డబ్బు దుబారా చేయడం, మోసం చేయడం లేదా చాలా అరుదుగా శారీరకంగా కొట్టడం వంటివి కూడా జరగవచ్చు.

ఇలా తరచూ జరుగుతోందా!

ఈ ఎటాక్‌లు ఒక్కొక్కరిలో ఒక్కో విధంగా ఉంటాయి. కొంతమందికి క్రమం తప్పకుండా రావచ్చు. అంటే రోజూ నెలకు, సంవత్సరానికి లేదా ప్రతి కొద్ది సంవత్సరాలకు కలుగుతాయి. ఇంకొంతమంది అనేక సంవత్సరాలపాటు ఈ సమస్య లేకుండా ఉంటారు. లేదా అనేక సార్లు యాదృచ్ఛికంగా ఎటాక్‌లు రావచ్చు.

చికిత్స తప్పనిసరి

చికిత్స చేయకుండా వదిలేస్తే, బాధితులు కొంత కాలానికి బహుశా వాళ్ళంతట వాళ్ళు కోలుకోవచ్చు. కానీ తరచుగా వాళ్ళ జీవితాలపైనా, వాళ్ళ కుటుంబాల పైనా దారుణమైన ప్రభావం వుంటుంది. మేనియాకు గానీ లేదా తీవ్ర డిప్రెషన్‌కి గానీ, ప్రారంభంలోనే ఆస్పత్రిలో చేర్చడం వల్ల త్వరగా కోలుకునే అవకాశం వుంది. తీవ్ర డిప్రెషన్‌తో ఆత్మహత్య ప్రయత్నాలు చేయడం, అనాలోచితమైన నిర్ణయాలు తీసుకోవడం నుంచి రోగిని కాపాడటానికి కూడా ఇన్‌పేషెంట్ చికిత్స సహాయపడుతుంది.

అనేక కేసుల్లో (60-80%) మూడ్ మార్పులను మూడ్ స్టెబిలైజర్లు లాంటి మందుల ద్వారా నియంత్రించవచ్చు లేదా తగ్గించవచ్చు. లిథియం కార్బొనేట్స్, కార్బయా జెపైన్, డివాల్‌ప్రోమిక్స్ సోడియంలు అత్యంత తరచుగా ఉపయోగించే మందులు.

కుటుంబసభ్యుల సహకారం తప్పనిసరి

మూడ్‌లో చోటు చేసుకొనే మార్పులు వివాహాలు, పిల్లలపైనా, ఉద్యోగంపైనా, స్నేహితులపైనా అలాగే వ్యక్తిగతంగా చాలా ఇబ్బందులు కలిగిస్తాయి.

ఆ వ్యక్తి సైకియాట్రిస్టుకు చూయించుకునేలా కుటుంబసభ్యులు, మిత్రులు ప్రోత్సహించాలి. వీరు నిరంతరం రోగి పట్ల ప్రేమాభిమానాలను ప్రదర్శించడం వల్ల బాధితునికి కలిగే మేలు ఎక్కువ. ★

ఆతిథ్యాలు

అతిథులను కొందరు తిట్టుకుంటూ స్వాగతం చెబుతారు. మరికొందరు బంధువులు వస్తేనే చాలని ఆనందంగా స్వాగతం చెబుతారు. ఈ అతిథి సత్కారాలలో కూడా ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క రకమైన ఆచారం వుంది.

జావాలోని తేజబూ అనే ఊరు పరమ పవిత్రమైనదని అక్కడివారు భావిస్తారు. అక్కడి జనాభా కేవలం నలభై మంది మాత్రమే. ఈ నలభై సంఖ్య దాటకుండా జాగ్రత్తగా వుంటారు అక్కడి ప్రజలు. వెలుపలి వారు ఎవరూ అవూరికి రావడానికి వీల్లేదు. ఇప్పటి వరకూ ఏ అధికారి కూడా ఆ వూరికి వెళ్లలేదు. 400 సంవత్సరాలనుంచి ఈ నియమాన్ని వారు కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు.

ఇక్కడ ఎంత పని వున్నా బంధువులు రారు. రాకూడదు. జన సంఖ్య పెరిగితే కొత్తగా పుట్టిన పసివాడి ప్రాణం తీసే అధికారం ఆ నలభై మందిలో ఒక ప్రముఖునికి ఉంటుంది.

బ్రెజిల్‌లో నివసించే టుబినానా ఇండియన్స్ అనే జాతి వారు ఇంటికి వచ్చిన బంధువులకు ఏడుస్తూ స్వాగతమిస్తారు. బంధువులు గుమ్మంలో వుండగానే ఇంట్లోని మహిళలందరూ కూర్చుని గట్టిగా ఏడుస్తారు. మధ్యలో బంధువుల పేర్లు పెట్టి ఏడుస్తారు. ఈ కార్యక్రమంలో ఎంత మాత్రం మొహమాటం లేకుండా వచ్చిన వారు కూడా పాల్గొని ఏడవాలి. అది మర్యాద. మరికొంత సేపటికి ఇంట్లో పురుషులు రోదిస్తారు. దగ్గర బంధువులైతే ఈ తంతును చాలాసేపు కొనసాగిస్తారు. దూరపు బంధువులైతే కొద్దిసేపే ఏడుస్తారు.

తెలుసా!

చిక్కుముడి

ఏ ఇబ్బందుల్లో వుండి ఆత్మహత్య చేసుకున్నాడో గానీ ఆ వెయిటర్‌కి వింత కోరిక కల్గింది. తాను ఆత్మహత్య చేసుకొన్నానని, తాను చనిపోవడానికి ఎవరూ కారకులు కాదని తెలియజేసే పత్రాన్ని రాస్తూ దానిని ఒక క్రాస్ వర్డ్ పజిల్ రూపంలో పొందుపరిచాడు. ఈ సంఘటన 1926లో హంగేరీలోని బుడాపెస్ట్‌లో జరిగింది. పోలీసులకు ఆ క్రాస్‌వర్డ్ పజిల్ ఏమిటో, వెయిటర్ ఎలా మరణించాడో అంతుబట్టలేదు. వారు ఆ చిక్కుముడిని విప్పడానికి ప్రజల సాయం కోరాల్సి వచ్చింది.

సాలెపురుగు దారం

పట్టు పురుగుల మాదిరిగానే సాలె పురుగులు కూడా దృఢమైన దారాన్ని తయారు చేస్తాయి. సాలె పురుగుల దారం పట్టు దారం కంటే ఆరు రెట్లు సన్నగా ఉంటుంది. 1920 లో పారిస్‌లో నిర్వహించిన ఓ ప్రదర్శనలో సాలె పురుగు దారంతో తయారు చేసిన ఒక వస్త్రం ప్రదర్శించారు.



వింత చెరువు

గోవా దక్షిణ ప్రాంతంలో కుర్తోరియ్ అనే గ్రామం వుంది. ఆ గ్రామంలో పాతిక ఇళ్ళ కంటే ఎక్కువ లేవు. కుర్తోరియ్ పొలిమేరలో ఓ పక్కగా పది అడుగుల విస్తీర్ణం గల చిన్న చెరువులో తరచూ అలలు లేచి నీళ్ళు పైకి ఉబుకుతూ ఉంటాయి. అక్కడికి 8 కిలో మీటర్ల దూరంలో సముద్రం వుంది. కాని ఆ సముద్రానికి, చెరువుకూ సంబంధం లేదు. పైగా ఆ చెరువులోని నీళ్ళు తియ్యగా కూడా వుంటాయి. నీళ్ళు పైకి ఉబికినప్పుడు గట్లపై ఉప్పు పేరుకుపోవటం విశేషం.

చెరువులోతు ఒక అడుగుకు మించి వుండదు. ఆ చెరువు చుట్టుపక్కల 10 అడుగల లోతు వరకూ తవ్వినా నీటి చుక్కపడదు. నీరు ఊరుతుండటం వల్ల అందులో నీళ్ళు పొంగుతున్నాయని కొంత మంది అనుకున్నారు. కాని అలాంటి చిహ్నాలు కనిపించలేదు. నీళ్ళు పొంగిరావడం మధ్యాహ్నాలు, వెన్నెల రాత్రులలో మరీ ఎక్కువగా ఉంటుంది. ఆ చెరువు దగ్గర్లో రెండు రాళ్ళు ఉన్నాయి. ఆ చుట్టు పక్కల నివసించే గ్రామాలవారు ఆ రాళ్ళను గ్రామ దేవతలుగా భావిస్తారు.



మొక్కజొన్న స్పెషల్స్

మొక్కజొన్న పొత్తుల సీజన్ వచ్చేసింది కదా! అందుకే మొక్కజొన్నతో చేసే వంటకాల గురించి చెప్పుకుందాం. మీరూ ప్రయత్నించి చూడండి.

రొట్టెలు

కావలసిన పదార్థాలు

పచ్చి మొక్కజొన్న గింజలు - 2 కప్పులు, గోధుమపిండి - కప్పు
పసుపు - చిటికెడు, ఉప్పు - తగినంత, కొత్తిమీర కట్టలు -2, పచ్చిమిర్చి - 2
నెయ్యి - 3 టేబుల్ స్పూన్లు, వాము - స్పూన్

తయారుచేసే విధానం

మొక్కజొన్న గింజల్ని మెత్తగా రుబ్బి అందులో గోధుమపిండి, ఉప్పు, పసుపు, వాము, సన్నగా తరిగిన పచ్చిమిర్చి, కొత్తమీర వేసి కలపాలి. అవసరమైతే కొద్దిగా నీళ్లు కూడా వేసి చపాతీ పిండిలా కలుపుకోవాలి. చిన్న చిన్న ఉండలుగా చేసుకొని చపాతీల్లా రొట్టెల పీటపై చేసుకోవాలి. స్టవ్ మీద పెనం పెట్టి కొద్దిగా నెయ్యివేసి రొట్టెలు రెండువైపులా ఎర్రగా కాల్చుకోవాలి. దీనిలో టమాటా సాస్ వేసుకొని తింటే అదుర్స్.

కోఫ్తా

కావలసిన పదార్థాలు

మొక్కజొన్న గింజలు - కప్పు, పన్నీర్ - 1/2 కప్పు, పచ్చిమిర్చి - 4, నిమ్మరసం - 2 స్పూన్లు
జీడిపప్పు - 4 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర - కట్ట, ఉప్పు - తగినంత, నూనె - సరిపడినంత

తయారుచేసే విధానం

మొక్కజొన్న గింజల్ని కచ్చాపచ్చాగా రుబ్బుకోవాలి (మెత్తగా కాకుండా). అందులోనే పన్నీర్ తురుము, పచ్చిమిర్చి ముక్కలు, జీడిపప్పు పలుకులు, తురిమిన కొత్తిమీర, నిమ్మరసం, ఉప్పు వేసి కలిపి ఉండలుగా చేశాక రెండు చేతుల మధ్య పెట్టి పొడుగ్గా కోఫ్తాల్ని తయారుచేయాలి. స్టవ్ మీద బాండీ పెట్టి నూనెపోసి కాగిన తర్వాత కోఫ్తాల్ని దోరగా వేయించుకోవాలి.

పాలక్ కోసం

కావలసిన పదార్థాలు

పాలకూర - 7 కట్టలు (చిన్నవి), ఉల్లిపాయలు - 2, వెల్లుల్లి - 1, పచ్చిమిర్చి - 2, కారం - టీస్పూన్, ఉప్పు - తగినంత, జీలకర్ర పొడి - టీ స్పూను, నూనె - 2 టేబుల్ స్పూన్లు, పసుపు - చిటికెడు,

పాలక్ తయారీ

స్టవ్ మీద అడుగు మందంగా ఉన్న గిన్నె పెట్టి సన్నగా తరిగిన పాలకూర, ఉల్లిపాయ ముక్కలే, పచ్చిమిర్చి ముక్కలు వేసి ఉడికించాలి. అందులో నీటిని ఒక గిన్నెలోకి వార్చి (వంపి) ఉంచుకోవాలి. దాన్ని చల్లారాక మిక్సీలో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. స్టవ్ మీద బాండీ పెట్టి నూనె వేసి కాగాక తరిగిన వెల్లుల్లి ముక్కలు వేసి దోరగా వేయించాలి. తర్వాత కారం, పసుపు, జీలకర్ర పొడి వేసి వేయించాలి. ఇప్పుడు పాలకూర ముద్దను కూడా వేసి నూనె తేలేవరకూ వేయించాలి. తర్వాత సన్న సెగన ఇంతకుముందు తీసిపెట్టుకున్న నీటిని పోసి, వేసి పెట్టుకున్న కోఫ్తాలు వేసి ఉడికించాలి. చిక్కబడ్డాక ఉప్పు సరి చూసి దించితే సరి. దించే ముందు కొద్దిగా వెన్నపూస (కావాలంటేనే) కోఫ్తాలపై వేసి వడ్డిస్తే భలే రుచిగా ఉంటుంది.

హల్వా

కావలసిన పదార్థాలు

మొక్కజొన్న గింజలు - 3 కప్పులు, పంచదార - 1/2 కిలో, యాలకులు - 4
నెయ్యి - 100 గ్రాములు,(పొడిచేసుకోవాలి)
జీడిపప్పు, ఎండుద్రాక్ష - 50 గ్రాములు
(కావాలంటే ఇంకా ఎక్కువకూడా వేసుకోవచ్చు)

తయారుచేసే విధానం

గింజల్ని మెత్తగా రుబ్బి అందులోంచి పాలను పిండాలి. మిగిలిన పొట్టులో కొంచెం నీళ్ళు పోసి మళ్లీ రుబ్బి పిండాలి. ఈ పాలను పక్కన పెట్టుకోవాలి. స్టవ్ మీద చిన్న బాండీ పెట్టి కొద్దిగా నెయ్యి వేసి జీడిపప్పు, ఎండుద్రాక్ష వేయించి పక్కన ఉంచాలి. అడుగు మందంగా ఉన్న గిన్నెను పెట్టి అందులో పంచదార వేసి సరిపడా నీళ్ల పోసి మరిగించాలి. మరిగాక అందులో ముందుగా తయారుచేసి పెట్టుకున్న మొక్కజొన్న పాలను పోసి గరిటెతో తిప్పుతూ ఉండాలి. ఇది చిక్కబడి ముద్దలా తయారువుతుంది. అప్పుడు నెయ్యి వేసి అది తేలే వరకూ తిప్పాలి. చివరగా యాలకులపొడి, జీడిపప్పు, ఎండుద్రాక్ష వేసి బాగా కలపాలి. గిన్నెకు హల్వా అంటుకోకుండా ఉంటే రెడీ అయిపోయినట్లే. దాన్ని స్టవ్ మీద నుంచి దించి ఒక వెడల్పాటి పళ్లానికి నెయ్యి రాసి అందులో హల్వాను వేసి మనకిష్టమైన ఆకారంలో కత్తిరించుకోవాలి. వాటిపైన కావాలంటే జీడిపప్పు పలుకులు, ఎండుద్రాక్ష అందంగా అలంకరించుకోవచ్చు. ఇది పిల్లలు ఎంతో ఇష్టంగా తింటారు. మరి మీరూ ప్రయత్నిస్తారుగా.

కబాబ్

కావలసిన పదార్థాలు

లేత మొక్కజొన్న గింజలు - 2 కప్పులు
పచ్చిమిర్చి - 4, ఉల్లిపాయ - ఒకటి
అల్లం - చిన్నముక్క, ఉప్పు - తగినంత
పెరుగు - అరకప్పు (వడకట్టినది)
గరంమసాలా - చిటికెడు
చాట్ మసాలా - చిటికెడు, కొత్తిమీర - 2 కట్టలు,
పుదీనా - గుప్పెడు ఆకులు,
నిమ్మరసం - 4 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం

మొక్కజొన్న గింజల్ని మిక్సీలో కచ్చాపచ్చాగా రుబ్బాలి (బరకగా). ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, కొత్తిమీర, పుదీనా, అల్లం సన్నగా తరిగి పెట్టుకోవాలి. ఒక గిన్నెలో మొక్కజొన్న పిండిని . వేసి ఉప్పు, గరంమసాలా, చాట్ మసాలా, తరగిపెట్టుకున్న ముక్కలు, పెరుగు వేసి గట్టిగా కలుపుకోవాలి. వేలు మందంగా ఉన్న ఇనుప చువ్వలకు ఈ మిశ్రమాన్ని చుట్టూతా అంటించి మైక్రోవెవెన్‌లోగానీ, నిప్పుల మీదగానీ, గ్యాస్‌స్టవ్ మీద కొద్దిగా పైకి పెట్టి ఎర్రగా కాల్చుకోవాలి. వీటిని వేడివేడిగా టమాటా సాస్‌తో తింటే చాలా బాగుంటాయి.

- జి. కల్పనా కుమారి,
జమిస్తాన్‌పూర్, హైదరాబాద్.



సీరియల్

గని

జరిగినకథ:

గనిలోకి నీళ్లొచ్చి పెద్ద ప్రమాదం జరుగుతుంది. ఎవరికి వారు ప్రాణాలు కాపాడుకోవాలన్న తాపత్రయంతో పరుగులు తీస్తారు. దీంతో తొక్కిసలాట జరుగుతుంది. మోకాళ్లచిప్పలు పగిలినవారూ, తలలు పగిలినవారూ పెట్టిన కేకలు, పెడబొబ్బలతో ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనిస్తుంది. అసలు ప్రమాదం ఏంటో తెలియకపోయినా క్షేమంగా బయటపడాలన్న భావనలో ప్రతి ఒక్కరూ వుంటారు. మృత్యువు తరుముకొస్తుండడంతో వాళ్లలో మానవీయత మాయమౌతుంది. జలఖడ్గం ధాటికి గని లోపలి కార్మికులంతా చెల్లాచెదరౌతారు. విద్యుత్ నిచ్చెన పనిచేయక ఏం చేయాలో పాలుపోక గని గోడలు పగిలిపోయేలాగా కేకలు వేయసాగారు. అలా వెల్లువ దాటికి గనిలోపలి 300 మంది ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోతాయి. గని బయట కార్మికుల కుటుంబీకుల గోడు చెప్పనలవికాకుండా వుంటుంది. ఎవరు ప్రాణాలతో వున్నారో, ఎవరు నిర్జీవంగా పడివున్నారో తెలియని అయోమయ పరిస్థితిలో ఏడుపు లంకించుకుంటారు. భర్తల్ని కోల్పోయిన భార్యలు, తండ్రులను కోల్పోయిన పిల్లల ఆక్రందనలు మిన్నంటుతాయి. గనిలోపలి నీరును తొలగించేందుకు పగలూ రాత్రి అన్న తేడా లేకుండా ప్రయత్నిస్తుంటారు కార్మికుల కుటుంబీకులు. ఆ తర్వాత....

తమిళ మూలం : కె. చిన్నప్పభారతి

అనువాదం : వి. వెంకటేశ్వర

(ముప్పై ఒకటవ భాగం)

నీటి మట్టం తగ్గేకొద్దీ బికాస్ మనసులో తన విశ్వాసంపై విశ్వసనీయత తగ్గిపోసాగింది. సహకార్మికులు బతికి బట్టకడతారా? కళ్లలో నీటిపొర. చూపుల్లో ఏదో తెలియజేయాలన్న ఆరాటం. పెదాలు ఎండి పోతున్నాయి. వాడిన పువ్వులా వాలిపోయిన మొగం. గుండె గబగబా కొట్టుకొంటోంది... అల్లాఉద్దీన్‌కు దొరికినట్టు ఏదైనా అద్భుత దీపం దొరికితే ఎంత బాగుండు! ప్రాణాపాయ స్థితి దాపురించినపుడు మానవుడి ఊహకు రెక్కలు మొలుస్తాయి కాబోలు, పిల్లల ఊహలకు మల్లే!

ఆరు రోజులు గడిచాయి. ఆకలికి తట్టుకోలేక ఎంగిలి పడుతున్న వాళ్ళు "బయట ఉన్న మనం ఆకలికి తట్టుకోలేక పోతున్నామే! లోపల చిక్కుకున్న వాళ్ళు తినడానికి ఏమీ దొరక్క, ఎలా ప్రాణాలతో బయట పడగలరు? లోలోపల ఘాటెక్కే గంధక ధూపం, లావాలా పొంగుతోన్న అపనమ్మకం, అలజడి రేపే ఆలోచనలు. కుదిపేస్తోన్న సహజసంవేదనలు. శక్తి ఉడిగిన శరీరాల్లోంచి పెల్లుబుకుతోన్న శోకధార. కల్పనా శక్తి కుంచించుకు పోతుంటే, మొగాల మీద ఈడ్చి కొడుతోన్న నిష్ఠూర వాస్తవం.

ఏడవ రోజుకు కన్నీళ్ళు కూడా ఇంకిపోయాయి. అప్పటికి తిరిగి పనిచేయడం మొదలెట్టిన నిచ్చెన మీద అందరి కంటేముందు వెళ్లి నిలబడ్డాడు బికాస్. నిపుణుల బృందం ఇంజనీర్లతో, సర్వేయర్లతో కలిసి లోపల దిగింది. బాధ్యతలు తరుముతుంటే భయమూ, దిగులూ నిండిన మనసులతో దేవుడి మీద భారం మోపి లోపలికి వెళ్ళారు. హెడ్‌లైట్ వెలుతుర్ని నలుదిక్కులా ప్రసరింపజేశారు. ఎంత భయానక దృశ్యం! ఎంత ఘోరం! గొర్రెల మందలోకి తోడేలు చొరబడి, వాటిని చీల్చి చెండాడితే ఎలా ఉంటుందో అలా కకావికలైన శరీరాలు, ఉబ్బిన శవాలు. బోర్లా పడుకొనీ, వెల్లకిలా పడుకొనీ, ఒకర్నొకరు కావలించుకొనీ, కాళ్ళూ చేతులూ చాపుకొనీ ఎడ్డీమడ్డీగా పడున్న శవాలు. కుళ్ళిన శవాల దుర్గంధం కడుపులో దేవినట్టయి డోకొస్తోంది. బికాస్‌కు ఏ స్పందనా కలగలేదు. 'సమావేశానికి వెళ్ళకపోయినట్లయితే, నేను కూడా ఇలాగే పడి ఉండేవాణ్ణి' అనుకున్నాడు. సహచరుల్ని కోల్పోయి నేను బతికి ఉండడం ఎంత దారుణం! ఆ కుటుంబాలను ఎలా ఓదార్చగలను? ప్రభుత్వ సహాయం అందడానికి ఏం చెయ్యాలి?

గోడ బలహీనంగా ఉందని యాజమాన్యానికి ఎన్నిసార్లు చెప్పలేదు! రోజువారీ పనివేళల్లోనే దానికి మరమ్మతులు చేయలేదని ఎన్నిసార్లు దండింపబడలేదు! తవ్వి పోయాల్సిన బొగ్గు పరిమాణం తగ్గించరు. అదనంగా ఇలాంటి మరమ్మతు పనులు! మనల్ని మనుషుల్లాగా పరిగణిస్తే కదా! ప్రాణాలు తోడేసారు. తనివితీరని ధనదాహంతో దయాదాక్షిణ్యాలు లేకుండా ప్రాణనష్టం కలిగించారు.

అందరితో పాటు తాను కూడా మృతదేహాల్ని కదిలించాడు. ఎవరైనా ప్రాణాలతో కనిపించకపోతారా అనుకుంటుంటే కుళ్ళిపోయిన జామపండులా మాంసశకలాలు రాలుతున్నాయి. తాకి పైకి లేవనెత్తే ప్రతిభాగమూ కొవ్వొత్తిలా కరిగిపోయి, ఎముకలు మాత్రమే మిగులుతున్నాయి. రోజూ తమతో తమ ఊసులు కలబోసుకొన్న మొగాలు ఆనవాళ్ళయినా కనిపించలేదు. గుర్తింపు కార్డుల ఆధారంగా మాత్రమే కనిపెట్టగలం.

నిచ్చెనతో కట్టబడిన పెద్దతొట్టెలో మృతదేహాల్ని పడేశారు. ఒక్కో గుహలోనూ వెదికి వెదికి మృతదేహాల్ని వెలికితీశారు. ఉబికొచ్చిన కళ్ళు, వెళ్ళుకొచ్చిన నాలుకలు. కొట్టడానికి ఎత్తిన

తానునుకున్నట్టు జరగలేదు. ఇక తాను అట్టే కాలం బతకజాలనని గ్రహించిన దిలీప్ ప్రాణభయంతో బికాస్‌కేసి చూశాడు. అతడి చేతులు మెల్లమెల్లగా బికాస్ చేతుల్ని గట్టిగా పట్టుకున్నాయి. అలాగే మెలమెల్లగా జారిపోయాడు. అతడు విగతజీవు డయ్యాడు.

కుటుంబ సభ్యులందర్ని కోల్పోయిన వ్యక్తి, తన చేతుల్ని పట్టుకుని నిలుచున్న బిడ్డకూడా మరణిస్తే ఎలాంటి మన:స్థితి ఉంటుందో, ప్రస్తుతం బికాస్‌ది అలాంటి మన:స్థితే. చివరగా దిలీప్ పార్థివ శరీరంతో బికాస్, నిపుణుల బృందం వాళ్ళూ జట్లుజట్లుగా బయటికి వచ్చారు.

కట్టెలు పేర్చినట్టు, శవాల్ని ఒకదాని మీద ఒకటిగా పేర్చారు. కార్మిక కుటుంబాల సుదీర్ఘ నిరీక్షణ కాస్తా అద్దం పగిలినట్టు బద్దలైంది. ఏడ్చి ఏడ్చి, వాడిన కళ్ళు దు:ఖాన్ని ప్రతిఫలిస్తున్నాయి.

వార్త తెలియగానే చుట్టుపక్కల ఉన్న గుహల్లోని కార్మికులూ, గ్రామీణ రైంతాంగం, ప్రజలు అందరూ ఆ మృతజీవులకు నివాళులు అర్పించడం కోసం తరలివచ్చారు. ఒక్కో వ్యక్తి ఒక్కో కుటుంబాన్ని దత్తత తీసుకున్నట్టు అక్కున చేర్చుకుని ఊరడించారు.

భంగిమలో చేతులు. తన్నుతున్న భంగిమలో కాళ్ళు. ప్రాణం పోతున్న తరుణంలో ఏమేం చెప్పాలని, ఏయే విషయాలు తెలియజెప్పాలని, ఎవరెవర్ని తన్ని తగలెయ్యాలని మనసులు తహతహలాడాయో! శరీరాంగాలు కుతకుతలాడాయో!

యజమాని పోయి, అతడి స్థానంలో ప్రభుత్వమే యజమానిగా వచ్చినా, స్వరూపం మారిందే తప్ప స్వభావంలో మార్పు రాలేదు. శ్రమైకజీవుల ప్రాణం గురించి అధికార్లకు లవలేశం కూడా శ్రద్ధ లేదు. ఉత్తుంగ తరంగ సదృశంగా ఉద్వేగం. తట్టుకోలేని ఆవేదన, కట్టలు తెంచుకుంటున్న ఆవేశం. బద్దలవడానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతంలా ఉంది అంతరంగం.

సన్నటి గుహల్లోంచి ఏ శవాన్నీ వదిలేయకుండా వెదికితీసి లిఫ్టు ద్వారా పంపిస్తూనే ఉన్నారు. ఇలా అన్ని మృతదేహాలనూ వెలికి తీశారు. అంతలో ఒక గుహలోంచీ సన్నటి మూలుగు వినిపించింది. అందరూ అటుకేసి పరుగెత్తారు. ఆశ్చర్యం! దిలీప్ పాశ్వాన్!!

దక్షిణం వైపు నుంచి ఉత్తరం వైపుకి వెల్లువెత్తిన ప్రవాహపు ఉధృతికి ఒక్కో గుహలోంచి వెలువడిన గాలి చివరికి ఓ గుహలో కేంద్రీకృతమై వరదను అడ్డుకుంది. నీళ్ళు పూర్తి ఉధృతితో ఆ గుహలో ప్రవేశించలేకపోయాయి. ఆకలి దప్పులతో అలమటిస్తూ, నీటి వేగానికి కొట్టుకుపోతూ, ఆ గుహలో సొమ్మసిల్లి పడిపోయాడు పాశ్వాన్. అతణ్ని చూడగానే అప్పటిదాకా అనుభవించిన వేదనను కాసేపు మరిచిపోయాడు బికాస్. పట్టరాని సంతోషంతో పరుగెత్తి వెళ్ళి అతణ్ని తన ఒడిలోకి తీసుకున్నాడు. కొద్దిగా కళ్ళు తెరిచాడు పాశ్వాన్. మెడ వెనుక భాగంలో దెబ్బ తగిలినట్లుంది. గాయంలోంచి జిగురులాంటి ద్రవం కారుతోంది.

మొద్దుబారిన అతడి చెంపల్ని నిమురుతూ 'దిలీప్! నేను బికాస్‌ని, నిన్ను చూడ్డానికి వచ్చాను' అన్నాడు. కలలోంచి హఠాత్తుగా లేచిన వాడల్లే బెదురు చూపులు చూశాడు పాశ్వాన్. విలయతాండవం చేసిన జల ప్రవాహం ఎక్కడికి పోయింది? కొట్టుకు పోయిన జనం ఏమయ్యారు? బికాస్ వచ్చేశాడు. చుట్టూ ఎవరెవరో నిలుచున్నారు. అతడికి ఏదో జ్ఞాపకం వస్తోంది. అంతలో అది మరుగున పడిపోతోంది. గనిలో జరిగిన దుర్ఘటనకు సాక్షీభూతంగా అతడు మిగిలాడు.

తానునుకున్నట్టు జరగలేదు. ఇక తాను అట్టే కాలం బతకజాలనని గ్రహించిన దిలీప్ ప్రాణభయంతో బికాస్‌కేసి చూశాడు. అతడి చేతులు మెల్లమెల్లగా బికాస్ చేతుల్ని గట్టిగా పట్టుకున్నాయి. అలాగే మెల్లమెల్లగా జారిపోయాడు. అతడు విగతజీవుడయ్యాడు.

కుటుంబ సభ్యులందర్నీ కోల్పోయిన వ్యక్తి, తన చేతుల్ని పట్టుకుని నిలుచున్న బిడ్డకూడా మరణిస్తే ఎలాంటి మన:స్దితి ఉంటుందో, ప్రస్తుతం బికాస్‌ది అలాంటి మన:స్దితే. చివరగా దిలీప్ పార్థివ శరీరంతో బికాస్, నిపుణుల బృందం వాళ్ళూ జట్లుజట్లుగా బయటికి వచ్చారు.

కట్టెలు పేర్చినట్టు, శవాల్ని ఒకదాని మీద ఒకటిగా పేర్చారు. కార్మిక కుటుంబాల సుదీర్ఘ నిరీక్షణ కాస్తా అద్దం పగిలినట్టు బద్దలైంది. ఏడ్చి ఏడ్చి, వాడిన కళ్ళు దు:ఖాన్ని ప్రతిఫలిస్తున్నాయి.

వార్త తెలియగానే చుట్టుపక్కల ఉన్న గుహల్లోని కార్మికులూ, గ్రామీణ రైతాంగం, ప్రజలు అందరూ ఆ మృతజీవులకు నివాళులు అర్పించడం కోసం తరలివచ్చారు. ఒక్కో వ్యక్తి ఒక్కో కుటుంబాన్ని దత్తత తీసుకున్నట్టు అక్కున చేర్చుకుని ఊరడించారు.

చివరగా తెచ్చిన శవం దిలీప్ పాశ్వన్‌ది. దాన్ని బికాస్ తన చేతుల మీదుగా మోసుకొచ్చి శవాల గుట్ట మీద ఉంచాడు.

దేశ ప్రగతి కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన త్యాగధనులకు అరుణాభివందనం చేసింది జనసందోహం.

త్రయ్యలైన గుండెల్ని, స్పందనల్ని తన పిడికిట్లో బిగించి పైకెత్తి పట్టుకున్నట్టు చేయి పైకెత్తి త్యాగధనులకు అంజలి ఘటిస్తున్న రీతిలో బికాస్ ఇలా అన్నాడు.

"మనుషులు గతించినా జీవితాలు గతించవు. నరకబడిన చెట్టు మళ్ళీ చిగురించినట్టు మానవ జాతి మళ్ళీ మళ్ళీ అంకురిస్తూనే ఉంటుంది. అది పుష్పిస్తుంది. కాయ కాస్తుంది. ఫలిస్తుంది. జీవిత పరమార్థమేమిటో అవగాహన కలిగిస్తుంది. దానికి మరణం లేదు.

మన జీవితాలు బొగ్గుతో ముడిపడ్డవి. ఈ దేశపు జ్యోతి, బొగ్గుతో మమేకమై పోయింది. ఇది జాతీయ సంపద. దేశమాత గుండె చప్పుడు. సుమధుర స్వాతంత్ర్య సంగీతం. మృతవీరుల కోసం మనం పాడే పాట కూడా ఇదే"

అవును! వాళ్ళ త్యాగం ఈ దేశ ప్రగతి కోసం, సమసమాజం కోసం, వైతాళిక గీతంగా మారవచ్చు. విప్లవంగా రూపు దాల్చవచ్చు.

(అయిపోయింది)

ముదురు

మా ఆవిడకు

ఈ గెటప్ నచ్చిందట.

మరి మీకో...!



నవ్వుల్ - పువ్వుల్

చిల్లర దొంగ

'వంద రూపాయలు పోయాయి. నువ్వు గానీ తీశావా?' అడిగాడు తండ్రి.
'నాకలాంటి బుద్ధులు లేవు. నేనెప్పుడూ చిల్లర పైసలే తీస్తా. అమ్మనడిగి చూడు' అన్నాడు కొడుకు.

లిప్‌స్టిక్

'మొన్నటి దాకా "పప్పా" అనే దానివి, నిన్నటి నుండి "డాడీ" అంటున్నావేమిటి?' అడిగాడు తండ్రి.
'పప్పా అంటే లిప్‌స్టిక్ పోతుంది డాడీ! చెప్పింది కూతురు.

అందమైన అబద్ధం

వేయి అబద్ధాలాడైనా ఓ పెళ్లి చేయమన్నారు. కానీ పెళ్లిళ్ల పేరయ్య ఇంత దారుణమైన అబద్ధం ఆడతారనుకోలేదు ఇంతకీ ఏం అబద్ధం ఆడాడు?
అబ్బాయి ఏరోప్లేన్‌లో కండక్టర్‌గా పని చేస్తున్నాడని చెప్తున్నాడు.

గాడిదల భోజనం

"ఈ భోజనం గాడిదలు కూడా తినవు!" అంటూ సర్వర్ మీద మండిపడుతున్నాడు శ్రీను.
"ఒక్క క్షణం ఆగండి సార్! గాడిదలు తినగలిగే భోజనం పట్టుకొస్తాను!" అన్నాడు సర్వర్.

జోక్స్ పంపాల్సిన మా చిరునామా :
నవ్వుల్ పువ్వుల్ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

పూలు-నీళ్లు

"అదేంటి మీ ఆయన పదినిమిషాలకోసారి నీ నెత్తిమీద నీళ్లు చల్లుతున్నాడు?" అడిగింది లక్ష్మి
"నా నెత్తిమీద కాదు. నేను పెట్టుకున్న పూలమీద. ఆయన పూలకొట్లో పని చేస్తాడులే!" అసలు విషయం చెప్పింది కమల.

లక్కీడిప్



'రాను రాను ఈ ప్రైవేట్ టీవీ ఛానెల్స్ ప్రజలను వెర్రి వెధవలను చేస్తున్నాయి!' వాపోయాడు లక్ష్మయ్య
'ఎలా చెప్పగలవు?' అడిగాడు నారయ్య
'మొన్నొక టీవీ ఛానెల్‌వారు వారానికి ఎన్ని రోజులని అడిగి, వచ్చిన సమాధానాలన్నింటిలో నుండి లక్కీడిప్ ద్వారా కొందరిని ఎంపిక చేసి ప్రైజులిచ్చారు' చెప్పాడు లక్ష్మయ్య.

హెయిర్ టానిక్

"ఈ హెయిర్ టానిక్ మంచిదేనా?" అడిగింది ఉమ.
"మంచిదే మేడమ్.. నిన్న రాత్రి కాస్త దువ్వెనకి రాస్తే ఉదయానికల్లా ఫ్రెష్ అయిపోయింది" చెప్పాడు సేల్స్‌మ్యాన్.

టిప్

"నీకందరూ ఇచ్చిన టిప్‌లతో ఏం చేస్తావోయ్?" భోజనం చేస్తూ సర్వర్‌ను అడిగాడు మధు.
"మంచి హోటల్‌కు వెళ్లి భోజనం చేస్తానండి" వినయంగా చెప్పాడు సర్వర్.

- నారాయణ

స్వేచ్ఛా ప్రతిమ



ప్రపంచ అద్భుత కట్టడాలలో అమెరికాలోని స్వేచ్ఛా విగ్రహం ఒకటి. ఇది న్యూయార్కులో ఉంది. అమెరికాలో అంతర్యుద్ధం ముగిసిన తర్వాత అమెరికాతో తమ స్నేహానికి గుర్తుగా ఫ్రాన్స్ వారు ఈ విగ్రహాన్ని అమెరికాకు బహూకరించారు. దీనిని 'మిస్ లిబర్టీ' అని కూడా అంటారు. న్యూయార్క్ హార్బర్‌లో ఆకాశాన్ని ముద్దాడుతున్నట్లుండే ఈ విగ్రహం పర్యాటకులకు, యాత్రికులకు, ఓడలో అమెరికాకు తిరిగివస్తున్న వారికి స్వాగతం పలుకుతుంటుంది.

పొడవాటి దుస్తులు వేసుకున్న స్త్రీమూర్తి చేతిలో టార్చి పట్టుకుని మెరిసే కిరీటంతో ముక్కలైన ఇనుప గొలుసుపై నిలబడినట్టుంటుంది ఆ విగ్రహం. అమెరికా స్వాతంత్ర్యదినోత్సవ తేదీ (జులై 4, 1776) విగ్రహం ఎడమ చేతిపై రోమన్ అంకెలలో చెక్కి ఉంటుంది. ఫ్రెడరిక్ అగస్తె బార్థోల్డి అనే కళాకారుడు దీనిని సృజించాడు. అంతేకాదు! దీనిపై పేటెంటు కూడా పొందాడు. గాస్తవ్ ఈఫిల్స్ ఇంజనీరింగ్ కంపెనీ ముఖ్య ఇంజనీరు, ఈఫిల్ టవర్ డిజైనర్ ...'మార్సి కోచ్‌లిన్' లిబర్టీ విగ్రహం అంతర్గత నిర్మాణానికి ప్లాన్ గీశాడు. విగ్రహం మొత్తం మేలిమి తామ్రం తోనూ, పైపొరను స్టీలుతోనూ, టార్చి వెలుగును బంగారంతోనూ చేశారు. దీర్ఘచతురస్రాకారపు రాతిమీద ఈ విగ్రహముంది. విగ్రహాన్ని ఫ్రెంచ్ వారు, రాతి ఫలకాన్ని అమెరికా వారు నిర్మించేట్టు రెండు దేశాలవారు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ విగ్రహం 151 అడుగుల ఎత్తుంటుంది. విగ్రహ పీఠంతో కలిపి 305 అడుగుల పొడవుంటుంది. 225 టన్నుల బరువుంటుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన అమెరికా చిహ్నాలలో ఈ విగ్రహం ఒకటి. ఈ జాతీయ స్మారకచిహ్నం నేషనల్ పార్కు సర్వీసు ఆధ్వర్యంలో ఉంది. మొదటిసారిగా లిబర్టీ విగ్రహాన్ని పారిస్‌లోని జార్డిన్‌డు లక్సంబర్గ్‌లో ఉంచారు. కౌంట్ ఫెర్నాండ్ డి లెస్సెప్స్ రూపొందించిన ఈ విగ్రహం నుంచి స్ఫూర్తి పొందిన బర్థోల్డి అమెరికన్ లిబర్టీ విగ్రహాన్ని చేశాడు. దీని నిర్మాణం కోసం ఫ్రాన్స్‌లోనూ, అమెరికాలోనూ డబ్బు సేకరించారు. 1876 జులై 4లోపు దీన్ని నిర్మించి ఇవ్వాలనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల చేయలేకపోయారు. ఆ సమయానికి టార్చి పట్టుకున్న ఒక చేతిని మాత్రమే చేయగలిగారు. అంతవరకు ఫిలడెల్ఫియాలో ప్రదర్శించారు. ఒక్కో సందర్శకుని వద్ద 50 సెంట్ల రుసుము వసూలు చేశారు. అదే విధంగా 1878 జూన్ 30న పూర్తయిన స్వేచ్ఛా విగ్రహం తలను పారిస్‌లోని ట్రాకడరో పాలస్‌లోని గార్డెన్‌లో ప్రదర్శించారు. అమెరికాలోని బెడ్‌లూస్ ద్వీపంలో లెవి.పి.మోర్టన్ దీని నిర్మాణాన్ని ప్రారంభించారు. 1884 జులై వరకు ఫ్రాన్స్‌లో విగ్రహ నిర్మాణం పూర్తయింది. దీనిని 1885 జూన్ 17న న్యూయార్కు హార్బర్‌కు తీసుకువచ్చారు. విగ్రహ పీఠం నిర్మాణం 1886 ఏప్రిల్ 22న పూర్తయింది. 1886 అక్టోబర్ 28న అధ్యక్షుడు గ్రోవర్ క్లీక్‌లాండ్ దాన్ని ఆవిష్కరించారు.

లైట్ హౌస్

1886 నుంచి 1902 వరకు లిబర్టీ విగ్రహం లైట్‌హౌస్ లాగా పనిచేసింది. ఆ సమయంలో లైట్‌హౌస్ బోర్డు సభ్యులు దానికి బాధ్యత వహించారు. ఇందులోని విద్యుత్‌దీపం వెలుగును 39 కిలోమీటర్ల వరకూ చూడొచ్చు. అమెరికాలో మొట్టమొదటి సారిగా విద్యుత్‌ను ఉపయోగించింది ఈ లైట్‌హౌస్‌లోనే కావడంతో దీనికి దగ్గరలో ఒక విద్యుత్ కర్మాగారం ఉండేది. 1909 సెప్టెంబరు 29న మొట్టమొదటి సారిగా విల్‌బర్ రైట్ ఈ లిబర్టీ ప్రతిమ చుట్టూ విమానంలో చక్కర్లు కొట్టాడు. ఇకపోతే 1916లో జరిగిన బ్లాక్ టామ్ విస్ఫోటనం వల్ల 1,00,000 డాలర్ల నష్టం వాటిల్లింది. తర్వాత దానికి మరమ్మతులు చేసినా వర్షపు నీరు, మంచు చేరడం వల్ల తుప్పు పట్టింది.

1956లో బెడ్‌లూ ద్వీపం పేరును లిబర్టీ ద్వీపంగా మార్చారు. ఆ తర్వాత పదేళ్లకు నేషనల్ పార్కు సర్వీసు అధ్వర్యంలో ఉన్న లిబర్టీ విగ్రహంతో పాటు లిబర్టీ ద్వీపాన్ని, ఇల్లీస్ ద్వీపాన్ని చారిత్రక ప్రదేశాల జాబితాలో చేర్చారు. 1984లో లిబర్టీ ద్వీపానికి ప్రపంచ సాంస్కృతిక ప్రదేశాల జాబితాలో చోటు లభించింది. 2007లో ప్రపంచ ఏడు వింతల ఎంపికకుగాను పోటీపడిన 20 నిర్మాణాలలో దీనికి కూడా చోటు లభించింది.

ఈ విగ్రహ నిర్మాణానికి స్ఫూర్తినిచ్చిన అంశాల గురించి అనేక కథనాలు, ప్రచారాలు వున్నాయి. ఇసాబెల్లా యుజిన్ బాయర్ అనే మహిళ కుట్టు మిషన్ల పారిశ్రామిక వేత్త ఇసాక్ సైనర్ భార్య. ఈమె గురించి పారిస్‌లో తెలియని వారుండరట. ఈమె చాలా అందంగా ఉండేది. ఈమెను చూసే బార్థోల్డి లిబర్టీ విగ్రహాన్ని చేశాడని కొందరంటారు. మరి కొందరు ఆయన తల్లి అందమైన ముఖమే ఆయన స్ఫూర్తికి కారణమని అంటారు. ఆ విగ్రహం కుడి కాలు కొంచెం పైకి ఎత్తినట్టుగా ఉంటుంది. ఇది స్వాతంత్ర్యం ఇంకా నిలకడగా లేదు అనే భావాన్ని సూచిస్తుంది. ఎడమ కాలు తెగిపోయిన చైను మీద అడుగు వేసినట్టు ఉంటుంది. ఇది నిర్దాక్షిణ్య పరిపాలన నుండి విముక్తిని కోరడాన్ని సూచిస్తుంది. కిరీటం ఏడు కొనలు ఏడు ఖండాలను సూచిస్తుంది. ఆమె చేతిలోని పుస్తకం జ్ఞానాన్ని సూచిస్తుంది.

సందర్శనాంశాలు

విగ్రహం చివరి వరకు 146 మెట్లు ఉంటాయి. ఒక్కో మెట్టు రెండు మెట్లంత ఎత్తు ఉంటుంది. విగ్రహం లోపల బయటికంటే 15 నుండి 20 డిగ్రీలు ఎక్కువ వేడి ఉంటుంది. గంటకు ముప్ఫైమందిని మూడు గుంపులుగా కిరీటంలోకి పంపిస్తారు. కిరీటంలోని 25 కిటికీల గుండా న్యూయార్కు హార్బరును చూడొచ్చు. కిరీటం ఎడమ పక్కన ఉన్న కిటికీల ద్వారా మాన్‌హట్టన్‌ను చూడొచ్చు. 1986 నుంచి విగ్రహం లోపలికి జనాలను అనుమతిస్తున్నారు. విగ్రహ పీఠం, విగ్రహం లోపలకు 354 మెట్లుంటాయి. టార్చి తుప్పు పట్టడంతో దానిని 1986లో మార్చారు. విగ్రహం, మ్యూజియం, పీఠం ఎప్పుడూ సందర్శకుల కోసం తెరిచే ఉంటుంది. కాకపోతే సందర్శకులు ముందుగానే పాస్ తీసుకోవాలి. ప్రతి రోజు 30,000 పాసులను మాత్రమే ఇస్తారు.

పారదర్శకత కోసం సంక్షేమంలో సాంకేతిక విప్లవాన్ని జొప్పించిన వై.యస్. రాజశేఖరరెడ్డి పాలనాదక్షతకు నిదర్శనం - ఆన్‌లైన్‌లో స్కాలర్‌షిప్‌లు. ఇదివరలో కూడా స్కాలర్‌షిప్‌ల చెల్లింపులు జరిగేవి. అయితే అది ఎంత అన్న విషయం కాని, వస్తుందా లేదా అన్న విషయం కాని, వస్తే ఎప్పుడొస్తుంది అనే విషయం కాని విద్యార్థికి తెలిసేది కాదు. అవసరానికి రాక, ఈ లోపు అవస్థలు పడలేక, మధ్యలోనే చదువును ఆపేసి ఇంటిదారి పట్టిన విద్యార్థులు కోకొల్లలు. ఆ తర్వాతెప్పుడో అతనిపేరున వచ్చిన స్కాలర్‌షిప్ సొమ్ము అక్రమార్కుల జేబుల్లోకి చేరిన ఉదంతాలూ ఉన్నాయి. ఆ పరిస్థితులను దివంగత ముఖ్యమంత్రి వై. యస్. సమూలంగా ప్రక్షాళన చేయగలిగారు.

దళిత సంక్షేమంలో సాంకేతిక విప్లవం... ఏ.టి.యం. కార్డు ద్వారా ఉపకారవేతనం

తన పేరున ఒక బ్యాంకు అకౌంట్. అందులో నెలనెలా వేతనంలా జమయ్యే డబ్బు. ఎప్పుడు కావాలంటే అప్పుడు సొమ్మును డ్రా చేసుకోవడానికి వీలుగా జేబులో ఒక ఏ.టి.యం. కార్డు. ఇదంతా వింటుంటే అతనొక ఉద్యోగి అన్న భావన కలగకపోదు కాని అతనొక విద్యార్థి. ఉన్నతవిద్యను అభ్యసిస్తోన్న ఒక దళితవిద్యార్థి ఇలాంటి వినూత్న పథకం ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతోంది

డా॥ వై.యస్. రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చాక ఎప్పటికప్పుడు సమాజంలోని జీవనవ్యయం భారానికి అనుగుణంగా విద్యార్థులకు ఉపకారవేతనాలను పెంచారు. అంతేకాదు స్కాలర్‌షిప్ పొందడానికి అర్హతగా విద్యార్థి కుటుంబ వార్షికాదాయ పరిమితిని లక్షరూపాయలకు పెంచారు. దాంతో స్కాలర్‌షిప్‌లు పొందే లబ్ధిదారులు మరింతగా పెరిగారు. ఈ విధంగా దళితుల్లో విద్యావ్యాప్తికి, తద్వారా వారిని ఉన్నతవిద్యకు ప్రోత్సహించి ఉన్నత శిఖరాలను అందుకునేలా చేయడానికి మార్గం సుగమం చేశారు వై.యస్. రాజశేఖరరెడ్డి. దానికి కొనసాగింపుగా ఉపకార-వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవడం దగ్గర్నుంచి కేటాయించిన సొమ్మును డ్రా చేసుకోవడం వరకు అంతా ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తూ సంక్షేమంలో అవకతవకలకు తావులేకుండా కూడా చేశారు.

పేదకుటుంబాలనుండి వచ్చిన ఎస్.సి. విద్యార్థులకు నెలనెలా ఉపకారవేతనాలను ఇస్తూ వారిని చదువుకునేందుకు ప్రోత్సహిస్తోంది ప్రభుత్వం. ఈ రకంగా స్కాలర్‌షిప్‌లను అందించడం వల్ల విద్యార్థులు వారి తల్లిదండ్రుల మీద ఆధారపడకుండా చదువుకోగలుగుతున్నారు. అలాగే తల్లిదండ్రులు కూడా తమ మీద ఎలాంటి భారం ఉండకపోవడంతో పిల్లల్ని చదువుకునేందుకు పంపిస్తున్నారు. ఎస్.సి. విద్యార్థుల ఉపకారవేతనాలను తాజాగా 30 శాతానికి పెంచడంతో, హాస్టళ్ళలో ఉంటూ విద్యాభ్యాసం చేసే వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులకు ఇది వరకు నెలకు రూ.740/-లుగా ఉన్న స్కాలర్‌షిప్ ఇప్పుడు రూ.962/-లు అయ్యింది. పి.జి. విద్యార్థులకు రూ.525/-ల నుంచి రూ.682/-లకు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు రూ.400/-ల నుంచి రూ.520/-లకు పెరిగాయి. ఇక డేస్కాలర్‌లలో వృత్తి విద్యాకోర్సులు, పి.జి. కోర్సులు చదివే విద్యార్థులకు నెలకు రూ.330/-ల నుంచి రూ.429/-లకు, డిగ్రీ రెండవ, మూడవ సంవత్సరం వారికి రూ.185/-ల నుండి రూ.240/-లకు, ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం వారికి రూ.140/-ల నుంచి రూ.180/-లకు స్కాలర్‌షిప్‌లు పెరిగాయి. స్కూలు విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల విషయానికొస్తే 8 నుండి 10వ తరగతి చదివే విద్యార్థులకు నెలకు రూ.535/-లు, 5 నుండి 7వ తరగతి చదివే విద్యార్థులకు నెలకు రూ.475/-ల చొప్పున స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారు. ఐదేళ్ళ క్రిందటి ఎస్.సి. విద్యార్థుల ఉపకారవేతనాలతో పోలిస్తే ఇవి దాదాపు రెట్టింపు. గత ఏడాది అనగా 2008-09లో రూ.471.85 కోట్ల నిధులను ఎస్.సి.లలోని పోస్ట్‌మెట్రిక్ విద్యార్థుల ఉపకార వేతనాల కోసం విడుదల చేసింది ప్రభుత్వం. మొత్తం 2,72,749 మంది ఎస్.సి. విద్యార్థులు గత విద్యా సంవత్సరంలో ఉపకార వేతనాలను అందుకోగా వారిలో 1,14,825 మంది విద్యార్థినులు ఉన్నారు. ఈ ఏడాది మొదటి త్రైమాసికం కోసం ఇప్పటికే రూ.102.65 కోట్లను విడుదల చేశారు.

స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయడం దగ్గర్నుంచి, వాటిని అందించడం వరకూ అన్ని పద్ధతులను

పేదరికాన్ని అనుభవిస్తూ కూడా చదువుకునేందుకు ముందుకు రావటం అనేది గొప్ప విషయం. అలా ముందుకు వచ్చిన ఎవరికైనా చదువును కొనసాగించేందుకు పేదరికం అనేది అడ్డంకి కాకూడదు. పేదరికం నుంచి బయటపడేందుకు చదువొక చక్కని మార్గం. అందుకే చదువును ప్రోత్సహించడం అనేది సంక్షేమం అయ్యింది. అలాంటి సంక్షేమాన్ని అందరికీ సమానంగా అందించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రథమ స్థానంలో ఉందని చెప్పొచ్చు.

శ్రీ కె. రోశయ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

సులభతరం చేయడానికి, పారదర్శకతతో సకాలంలో నిర్వహించడానికి ఆన్‌లైన్ స్కాలర్‌షిప్‌ల విధానాన్ని అమలు పరుస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. అర్హత కలిగిన ప్రతి విద్యార్థిచేతా ఒక బ్యాంక్ అకౌంట్‌ను ప్రారంభింపజేసి, మంజూరైన స్కాలర్‌షిప్‌లను నేరుగా ఆ విద్యార్థి ఖాతాలో జమ అయ్యేట్లు చూసే విధానమే 'ఆన్‌లైన్ స్కాలర్‌షిప్'. ఈ విధానాన్ని 5 జాతీయబ్యాంకుల ద్వారా అమలు పరుస్తున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, ఇండియన్ బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్, సిండికేట్ బ్యాంక్‌లు ఈ స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన లావాదేవీలను నిర్వహిస్తున్నాయి. ఈ బ్యాంకులు ఆయా విద్యార్థులకు ఏ.టి.యం. / బయోమెట్రిక్ కార్డులను కూడా అందజేస్తున్నాయి.

ఫీజుల తిరిగి చెల్లింపుతో ఉచితంగా ఉన్నత విద్య :

సమాజంలో ఉన్నత శిఖరాలను అందుకోవాలన్న తపనతో, ఉన్నత విద్యను అభ్యసించాలని అనుకున్న విద్యార్థులకు ఫీజుల్ని కట్టుకోవడం అన్నది తలకు మించిన భారం. అందుకే షెడ్యూల్డు కులాల విద్యార్థుల్లో ఎంతో మంది ప్రతిభ ఉండికూడా హైస్కూలువిద్యతోనే చదువును ఆపేస్తున్నారు. దీంతో వారి కుటుంబాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ప్రగతికి నోచుకోకుండా ఉండి పోతున్నాయి. ఈ పరిస్థితిని నివారించేందుకే ప్రభుత్వం ఫీజుల తిరిగి చెల్లింపు పథకాన్ని ప్రారంభించింది. తాము కట్టాల్సిన ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుండటంతో విద్యార్థులు ఏ ఆటంకం లేకుండా, ఉచితంగా ఎం.బీ.ఏ., ఎం.సి.ఏ., ఇంజనీరింగ్, పీజీ, మెడిసిన్‌వంటి ఉన్నత విద్యాకోర్సులను చదవగలుగుతున్నారు. రాష్ట్రంలో మొత్తం 5,56,000 మంది షెడ్యూల్డు కులాలకు చెందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ సౌకర్యాలను పొందుతున్నారు.

సోషల్ బెనిఫిట్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎస్.బి.యం.ఎస్.)

రాష్ట్రంలోని పేద విద్యార్థులకు ఉపకార-వేతనాలతో పాటు బోధనాఫీజులను కూడా ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ పథకాల క్రింద 2008-09 విద్యాసంవత్సరంలో దాదాపు 24.70 లక్షల మంది

దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హత కలిగిన లబ్దిదారులందరికీ ఉపకారవేతనాలు, ఫీజులు మంజూరు చేసేందుకుగాను గత జూన్ నాటికి రూ. 1600 కోట్ల మేరకు నిధులు విడుదలయ్యాయి. ఈ విద్యా సంవత్సరం మొదటి త్రైమాసికం కేటాయింపులతో కలుపుకుంటే ఈ మొత్తం రూ. 2500 కోట్ల వరకు ఉండవచ్చు. ఇంత భారీ మొత్తంలో కేటాయింపులు జరిగినప్పుడు ఎటువంటి అవకతవకలు జరిగినా అసలైన లబ్దిదారులు నష్టపోతారు. అందుకే ప్రభుత్వం సోషల్ బెనిఫిట్స్ మేనేజ్‌మెంట్ సిస్టం విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానంలో ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ కమిటీ (పి.ఐ.సి.) ఒకటి ఈ పథకాల అమలుతీరును పర్యవేక్షిస్తుంది. ఈ బృందంలో అన్ని సంక్షేమ శాఖల రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి అధికారులు ఉంటారు. వీరు తరచు కళాశాలలకు వెళ్ళి విద్యార్థులకు అందుతున్న ప్రయోజనాల గురించి పరిశీలించాలి. ఇదీ సోషల్ బెనిఫిట్స్ మేనేజ్‌మెంట్ సిస్టం పనితీరు.

ఎస్.బి.ఎం.ఎస్. విధానంలో భాగంగానే స్కాలర్‌షిప్ లలో పారదర్శకత కోసం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది ప్రభుత్వం. అంతేగాకుండా స్కాలర్‌షిప్‌ల కొరకు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కోసం ఒక వెబ్‌సైట్‌ను కూడా రూపొందించింది

www.sbms.ap.gov.in అనే పేరు గల ఈ వెబ్‌సైట్‌లో ఉంచిన దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని తమ కళాశాల ద్వారా లేదా ఈ-సేవ సెంటర్ల ద్వారా లేదా ఆన్‌లైన్ ద్వారా సదరు సంస్థకు పంపవచ్చు. ఈ వెబ్‌సైట్‌లో విద్యార్థుల అప్లికేషన్ నెంబరు నుండి స్టేటస్, విద్యార్థి కళాశాలకు అనుసంధానమై ఉన్న బ్యాంకు వివరాలు, దరఖాస్తు పూర్తి చేయడంలో వచ్చే సందేహాలకు జవాబులు, లబ్దిదారుల వివరాలు.. మొదలైన అంశాల తాజా సమాచారం ఉంటుంది. 2009-10 విద్యాసంవత్సరానికి గాను ఇప్పటివరకు 70,490 మంది విద్యార్థినులతో సహా మొత్తం 1,71,855 మంది ఎస్.సి. విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కొరకు దరఖాస్తు చేసుకున్నారు.

గతంలో తమకు మంజూరైన స్కాలర్‌షిప్‌లు ఎప్పటికి అందేనో తెలిసేది కాదు. ఒకవేళ మంజూరైన స్కాలర్‌షిప్‌లను మధ్యలో ఎవరైనా కైంకర్యం చేసినా అంతేసంగతులు. ఈ అంశాలపై విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో 'సామాజిక తనిఖీలు' నిర్వహించి విద్యార్థులకు ఫీజులు, స్కాలర్‌షిప్‌ల సొమ్ము అందిందీ లేనిదీ తెలుసుకోవలసిందిగా

ప్రభుత్వం ఆదేశించినా ఆయా సంస్థలు అంత చురుకుగా లేకపోవడంతో ఈ తనిఖీలు మూలనపడ్డాయి. అందుకే తిరుగులేని ఈ ఆన్‌లైన్ స్కాలర్‌షిప్‌ల విధానాన్ని ప్రవేశపెట్టింది ప్రభుత్వం. చేసుకున్న దరఖాస్తు పరిస్థితి ఏమిటన్నదాని దగ్గర్నుంచి తనకు స్కాలర్‌షిప్ మంజూరు అయ్యిందీ లేనిదీ, ఎంత మంజూరైంది, ఆ సొమ్ము ఎప్పుడు జమ అయ్యింది.. మొదలైన సకల వివరాలను విద్యార్థి స్వయంగా తెలుసు కునేందుకు వీలుగా చిత్తశుద్ధినీ,

ఉన్నతవిద్యకు ఉపకారవేతనాలు
దళితులకు చేరువలో ఉన్నతశిఖరాలు

- రాష్ట్రంలోని స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ లబ్దిదారుల్లో 5,56,000 మంది ఎస్.సి. విద్యార్థులు
- 2008-09లో పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు విడుదల చేసిన నిధులు రూ. 471.85 కోట్లు
- 2009-10లో మొదటి త్రైమాసికపు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకుగాను విడుదల చేసిన నిధులు రూ. 102.65 కోట్లు
- 2009-10 విద్యాసంవత్సరానికి గాను ఇప్పటివరకూ 70,490 మంది విద్యార్థినులతో సహా మొత్తం 1,71,855 మంది ఎస్.సి. విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కొరకు దరఖాస్తు చేసుకున్నారు.
- ఎస్సీ విద్యార్థుల ఉపకారవేతనాలు తాజాగా 30% పెంపు. గత ఐదేళ్ళలో రెట్టింపయిన స్కాలర్‌షిప్‌లు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి అందించిన విధానం ఆన్‌లైన్ స్కాలర్‌షిప్. ప్రతి ఎస్.సి. విద్యార్థి ఈ రోజు తన దగ్గరున్న ఏ.టి.యం. కార్డును చూసుకుని ఒక భద్రతాభావాన్ని పొందుతున్నాడు. ఎప్పటికప్పుడు తన అవసరాలకు అనుగుణంగా డబ్బును డ్రా చేసుకునే వీలుండటంతో మనీ మేనేజ్‌మెంట్ అన్నది విద్యార్థిదశ నుండే వారికి అలవడుతోంది.

షెడ్యూల్డు కులాల విద్యార్థులు ఏ ఆటంకమూ లేకుండా హాయిగా, సాఫీగా తమ చదువులను కొనసాగించుకునేందుకు వీలుగా ఆన్‌లైన్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్-మెంట్‌లతో సంక్షేమ వెలుగులను పంచుతూ రాష్ట్రప్రభుత్వం వేయి విధాలుగా వారికి సహకరిస్తోంది. ఈ సౌకర్యాలను, చేయూతను ఉపయోగించుకుని ఎస్.సి. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి, సామాజికంగా ఎదగాలని ఆశిద్దాం.

బంగాళదుంప కబుర్లు

బంగాళదుంపలు ఇష్టపడని వారెవరు చెప్పండి! ఆలూ చిప్స్, బంగాళదుంపల ఫ్రై... పేరు చెప్తే చాలు నోరూరిపోతుంది. సినిమా చూస్తూ కూడా చిప్స్ లాగించడం చూస్తున్నాం. అందరూ ఇష్టపడే ఆలూలో పోషక విలువలూ ఎక్కువే. మంచి శక్తినిచ్చే కార్బోహైడ్రేట్లే కాకుండా వీటిలో ప్రొటీన్లు, సి విటమిన్, పోటాషియం కూడా ఉంటాయి. 2008 సంవత్సరాన్ని అంతర్జాతీయ బంగాళదుంపల దినోత్సవంగా కూడా జరుపుకున్నారు. ఇంతటి ప్రాముఖ్యత ఏ ఇతర కూరగాయలకూ లభించలేదు. మరి బంగాళదుంపలకే ఎందుకు లభించింది అంటే... ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా పండే కూరగాయలు బంగాళదుంపలే కావడంవల్ల. ఆ విశేషాలేంటో చెప్పకుందాం.

భారతదేశంలో మొట్టమొదటి సారిగా 1830లో డెహ్రాడున్‌లోని కొండవాలు ప్రదేశాలలో ఆలుగడ్డలను పండించారు. తర్వాత పల్లపు ప్రాంతాలలోనూ పండించే పద్ధతులు కనుగొన్నారు. క్యాబేజీ, క్యాలిఫ్లవర్‌లా కాకుండా చెప్పుకోదగిన విధంగా భారతీయుల వంటింట్లోకి, సాగులోకి ఆలు ప్రవేశించింది.

వరి, గోధుమ వంటి ఆహార పంటలకు పరిశోధనా సంస్థలున్నట్లే బంగాళదుంపలకు సిమ్లాలో కేంద్ర పరిశోధనా సంస్థ ఉంది. ఏడు ప్రాంతీయ కేంద్రాలలో 12,000 రకాల ఆలుగడ్డల జెర్మ్‌ప్లాస్మ్ బ్యాంకు ఉంది. ఆ సంస్థవారు అధిక దిగుబడి గల 40 రకాల బంగాళదుంపలను ఉత్పత్తి చేశారు. అంతే కాదు ముందుగా చీడ గురించి తెలుసుకునే పద్ధతి కూడా ఇక్కడ ఉంది. బంగాళదుంపల విశ్వజన్యురాశిని తెలుసుకుంటున్న ప్రపంచ సంస్థలో ఇండియా ఒక భాగం. ఆ సంస్థ నెదర్లాండ్స్‌లో ఉంది. ఇది ఆలుగడ్డ పుట్టుకలోని జన్యువుల గురించి, వివిధ జాతుల గురించి తెలుసుకోవడానికి కృషి చేస్తోంది. ఆలుగడ్డలో 12 క్రోమోజోములుంటాయి. దాని డిఎన్ఎలో 840 మూలాలుంటాయి.

బంగాళదంపలు ఆకలి తీర్చే మంచి ఆహారం. వీటిని ఎటువంటి పరిస్థితులలోనైనా పండించవచ్చు. పరిమితమైన భూమి, అననుకూల వాతావరణం ఉన్న ప్రదేశాలలోనూ వీటిని పండించవచ్చు. ఈ యేడాది పండించినదానికి రెట్టింపు ఆలూను వచ్చే సంవత్సరం పండించాలన్నదే భారత్ ధ్యేయం. బంగాళదుంపల మొక్కల్లో 85 శాతం తినడానికి ఉపయోగించవచ్చు. కానీ వరి, గోధుమ, జొన్న వంటి ధాన్యాలు 50 శాతం మాత్రమే తినడానికి ఉపయోగపడతాయి.

పెరూ, బొలీవియా దేశాలలో 8000 సంవత్సరాల నుండీ బంగాళదుంపలను సాగు చేస్తున్నారు. వీరి దగ్గర నుండే భారతీయులు అననుకూల వాతావరణ పరిస్థితులలోనూ బంగాళదుంపలను పండించడం నేర్చుకున్నారు. అక్కడి వాతావరణం, నేల పరిస్థితి ప్రతి కొండకూ వేరుగా ఉండడంతో ఒకటి కాదు, రెండు కాదు వందల రకాల బంగాళదుంపలను పండిస్తారు.

ప్రతి ఒక్కరూ రోజుకి 93 గ్రాముల బంగాళదుంపలను ఆహారంలో భాగంగా తీసుకోవాలి. యురోపియన్లు రోజుకు 300 గ్రాముల బంగాళదుంపలను తీసుకుంటారు. కానీ భారతీయులకు మాత్రం 60 గ్రాముల కంటే ఎక్కువ దొరకదు.

బంగాళదుంపలను పండించడంలో చైనా ముందుంది. 3,200 లక్షల టన్నులతో ప్రపంచంలోనే అధిక ఉత్పత్తిని సాధించిన దేశమది. వీటిని పండించడంలో 370 లక్షల టన్నులతో రష్యా రెండవ స్థానంలోనూ, 260 లక్షల టన్నులతో ఇండియా మూడవ స్థానంలోనూ ఉన్నాయి.

జన్యుపరమైన వైవిధ్యం వల్ల బంగాళదుంపలకు ప్రపంచవ్యాప్తంగా పెద్ద చరిత్ర ఉంది. 16వ శతాబ్దంలో మెక్సికో, లాటిన్ అమెరికా దేశాలను దోచుకోవడానికి వెళ్లిన స్పానిష్ వారు బంగారంతో పాటు బంగాళదుంపల మొక్కలను కూడా యూరప్‌కు తీసుకొచ్చారు. అక్కడి నుండి పండ్లు, ఇతర మొక్కలతో పాటు బంగాళదుంపల మొక్కలు మనదేశానికి దిగుమతి అయ్యాయి. మొదట యురోపియన్ల ద్వారా, తర్వాత ముస్లిముల ద్వారా మనదేశానికి బంగాళదుంపలు వచ్చాయంటారు. వ్యాపారం కోసమంటూ మనదేశానికి వచ్చిన డచ్‌వారి దగ్గర వాటిని పండించడం నేర్చుకున్నాం. బ్రిటీష్‌వారుకూడా డచ్‌వారి దగ్గరి నుంచే వివిధ రకాల బంగాళదుంపలను సాగుచేయడం తెలుసుకున్నారు.

క్రైమ్ కథ

ఆ రాత్రి ఏమైంది?

- యర్నాగుల సుధాకరరావు

"చోటాభయ్యా బద్మాష్‌ను మీరేనా చంపండి లేకుంటే మాకు అప్పగించండి మేమే చంపేస్తాం. కాలనీలో జనాలకు రక్షణ లేదు. వాడు ఇప్పటికి రెండు హత్యలు చేస్తే ఇంతవరకు వాడిని మీరు అరెస్టు చేయలేదు. సాక్ష్యాలు లేవంటూ వదిలేసారు. ఇప్పుడు మేమే రెహ్మాన్ హత్యలో ఆబద్మాష్‌ను పట్టుకుని చావగొడ్తుంటే వచ్చి మాకు అడ్డుతగిలారు"

సెల్‌లో రక్తసిక్తమైపడున్న చోటా భయ్యాకు తెలివి వచ్చింది. కళ్లు విప్పాడు. అప్పుడు ఒళ్లంతా సూదులతో పొడుస్తున్నట్టు ఆతరువాత కొద్దిసేపటికి ఏకంగా రంపంతో కోస్తున్నట్టుగా అన్పించి బాధతో మెలి తిరిగిపోయాడు. లేవలేక లేచి కూర్చున్నాడు.

"ఏయ్ ఎవరక్కడ? నన్ను పట్టించుకోకుండా ఇలా సెల్‌లో పడేస్తే నేనేం కావాలి? నన్ను ఆసుపత్రిలో వేయండి. ఈబాధ భరించలేకున్నా" అని అరిచి గీపెట్టాడు.

చోటాభయ్యాకు తెలివి వచ్చింది అని పోలీసులు పైఅధికారికి చెప్పుకున్నారు. అటునుంచి 'వాడు లేచిపోయాడా? వాడు చస్తాడని కదా మనం సెల్‌లో పడేసాం. ఎందుకిలా జరిగింది. వాడిని జనాలు చావచితకతన్నారు. వాడు ఎలా బతికిబట్టకట్టాడు. సరే రాత్రి వరకు వాడిని అలా కనిపెట్టుకుని ఉండండి. బయట జనాల గొంతులు విన్పిస్తున్నాయి ఇంకా ఆందోళన సాగుతోందా?' అని అడిగితెలుసుకున్నాడు.

"రేయ్ నాకు చేయి లేవడం లేదు. దిక్కుమాలిన జనాలు విరిచేశారు. అయ్యో ఎలా వాచిపోయిందో" సెల్ లోంచి అరిచాడు ఛోటాభయ్యా.

పోలీసులు విపరీతంగా రాణా చుట్టు ముహరించారు. మీడియాకు లోపలకి వచ్చేందుకు అనుమతివ్వలా. రణగొణ ధ్వనులతో రాణావద్ద వాతావరణం నెలకొంది. ఇద్దరు పోలీసులు సెల్‌లోకి వెళ్లి తడిగుడ్డలతో ఛోటాభయ్యా ఒంటిమీద రక్తపు మరకలు తుడిచేశారు. టీ ఇచ్చారు. చేయి బాగా వాచి ఉంటే తడిగుడ్డ చుట్టేశారు.

టీ ఒక్క గుక్కలో తాగేసి "ఏయ్! మీరు తప్పు చేస్తున్నారు. నేను ఆ రెహమాన్‌ను చంపలేదు. అతడిని చంపింది వేరే వ్యక్తి. నన్ను ఇరికించాడు. తప్పితే నాకు సంబంధంలేదు. మీరు దర్యాప్తు చేయండి. అప్పుడు ఈప్రజలు నన్ను కొట్టివదిలారు. మీరు నన్ను ఏకంగా ఎన్‌కౌంటర్ చేసేయండి" ఛోటాభయ్యా కోపంతో బాధతో విలవిలలాడుతూ పోలీసులను నిలదీశాడు.

"కొన్ని గంటల్లో మేము చేయాల్సింది అదే. నిన్ను ఎలా చంపాలో అలా చంపేస్తాం. నీవు తాగిన టీలో మత్తుంది. నువ్వు నిద్రపో. మరి లేచేసరికి నీవుండేది పైలోకంలో" చెప్పి తలుపులు వేసుకుని వెళ్లిపోయారు.

ఛోటా భయ్యాకు తల దిమ్మెక్కిపోతోంది. నిజమే తను తాగిన టీలో మత్తుంది. "అయ్యో అకారణంగా నన్ను చంపుతున్నారురా! పోలీసులు రండి నా వాంగ్మూలం తీసుకోండి. రెహ్మాన్‌ను నేను చంపలేదు. నాకళ్లు మత్తుబారిపోతున్నాయి. నా ఒంటిమీద దెబ్బలు నాకు తెలియకుండా అయిపోతున్నాయి" అరిచాడు.

బయట జనాలు పోలీసులతో వాదిస్తున్నారు. "చోటాభయ్యా బద్మాష్‌ను మీరైనా చంపండి లేకుంటే మాకు అప్పగించండి మేమే చంపేస్తాం. కాలనీలో జనాలకు రక్షణ లేదు. వాడు ఇప్పటికి రెండు హత్యలు చేస్తే ఇంతవరకు వాడిని మీరు అరెస్టు చేయలేదు. సాక్ష్యాలు లేవంటూ వదిలేసారు. ఇప్పుడు మేమే రెహ్మాన్ హత్యలో ఆ బద్మాష్‌ను పట్టుకుని చావగొడ్తుంటే వచ్చి మాకు అడ్డుతగిలారు" అని కోపంతో ఊగిపోతూ వాదించారు.

ఆ మాటలు విని ఛోటాభయ్యా పెద్దగా అరిచాడు. బచావ్ బచావ్ అని అరిచి తలవాల్చేశాడు. జనాలమధ్య ఉన్న ఇన్‌స్పెక్టర్‌కు కానిస్టేబుల్ వచ్చి సార్ భయ్యా స్పృహ తప్పాడని చెప్పాడు.

"మీరు చట్టంతో ఆడుకుంటున్నారు. మీలో పదిమందివరకు చోటా భయ్యాను చచ్చేట్టుకొట్టారు. ఆపదిమంది ఈవైపుకు వస్తే కేసు షీట్ తయారు చేయాలి.మీరంతా అందరిపేర్లను రాయమంటున్నారు ఇది విధానం కాదు" ఇన్‌స్పెక్టర్ కోపంతో చివరిసారి అన్నట్టు చెప్పాడు.

"ఆ భయ్యా కోసం మేమంతా ఉరిశిక్షకైనా సిద్ధం. అందరి పేర్లను నమోదు చేయండి"అని మళ్లీ కోరారు. ఆ తరువాత విషయం తెలుసుకున్న పోలీస్‌పెద్దలు వచ్చి చెప్పినా జనాలు ససేమిరా అనడంతో రేపు ఉదయం రమ్మని చెప్పి పంపేసారు. కొన్నిగంటలుగా రాణావద్ద ఉన్నందున జనాలు కూడా వెనుదిరిగిపోయారు.

పోలీసులు ఛోటాభయ్యా బతికున్నాడా చచ్చాడా అని చూసారు. నాడి కొట్టుకుంటోంది. రెహ్మాన్ తోలు వ్యాపారి.వాడిని ఛోటా భయ్యా చంపాడని అక్కడ జనాలు తిరగబడ్డారు. ఇలా ఛోటాభయ్యా మీద మూడో మర్డర్ కేసు నమోదు అయ్యింది కానీ, చంపుతుండగా చూసినది ఎవరూ లేరు. పైఅధికారులు ఎన్‌కౌంటర్ చేసేయమని ఆర్డర్పు. ఇన్‌స్పెక్టర్ ఆలోచిస్తూ కుర్చీలో కూలబడ్డాడు.

రాత్రి 12గంటలు అయ్యింది. రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. జీప్‌లో ఛోటాభయ్యాను తీసుకుపోయి కాల్చేయాలి. కథ మామూలుగా రెహ్మాన్ చంపిన ఆయుధం చూపిస్తానంటే వాడితో వెళ్లిన పోలీసులపై నిర్జనప్రదేశంలో పొదల్లోంచి పిస్తోలు తీసి కాల్చాడు. ఎదురు కాల్పుల్లో చచ్చాడు. ఈకథనం అంతా నమ్ముతారు. వాడి గురించి పోలీసులను ఏ సంఘాలు నిలదీయవు. ఇన్‌స్పెక్టర్ సైగచేసాడు. కానిస్టేబుల్సు సెల్‌లో పడున్న ఛోటాభయ్యాను చేతులుమీద ఎత్తుకుని జీపులో పడేసారు. అప్పటికి చిన్నగా కదులుతున్నాడు.ఇంకా తెలివిలోకి రాలేదు.

జీపు సిటీ దాటుకుని నిర్జనప్రదేశంలో ఆగింది. చలికి వణకాల్సింది పోయి నలుగురు పోలీసులకు చెమటలు పోసాయి. ముఖంలో ఆత్రం కన్పిస్తోంది. ఛోటాభయ్యాను జీపులోంచి కిందకు బూటుకాళ్లతో తోశారు. దబ్‌మని కిందపడి కళ్లువిప్పాడు. క్షణాల్లో అర్థం అయ్యింది. ఏయ్ ఏంచేస్తు న్నారు?నన్ను చంపేస్తున్నారా? ప్లీజ్ నామాటలు విన్నాక కాల్చండి. నేను చచ్చేముందు అబద్ధం చెప్పను. చంపింది నేను కాదు. మరో తోలువ్యాపారి డేవిడ్.వాడే చంపాడు. నేను మర్డర్ కేసును నామీద వేసుకోవడానికి రెండులక్షలకు ఒప్పుకున్నాను. చంపేటంత శక్తి నాకులేదు"

అప్పటికే తుపాకులు రివాల్వర్ ఛోటాభయ్యాకు గురిపెట్టారు. ఇన్‌స్పెక్టర్ రివాల్వర్ లోపలపెట్టేసుకుని "ఇంతవరకు తెస్తేనే నీవు హంతకుడు పేరు చెప్పావు. లేకుంటే చెప్పవు" అని సన్నగా నవ్వాడు. ఛోటా భయ్యాను ఆసుపత్రికి పంపేసి డేవిడ్‌ను ఆ రాత్రే అరెస్టు చేశాడు.

★

వనం.. జనం.. భోజనం!

- పీపీ

కార్తీక మాసం. కలసి విహరించి విందులు ఆరగించే తరుణం. అదే వనభోజనం.

కాస్త కదలిక
కాస్త కలివిడి
కాస్త వినోదం
కాస్త వికాసం

వన భోజనం అన్న రెండు మాటల్లోనూ మూడు అంశాలున్నాయి. వనమూ జనమూ భోజనమూ! పది మంది కలిసిన ప్రతి సందర్భమూ పండగే అవుతుంది. అలాంటిది వారందరూ ప్రకృతి సిద్ధమైన చోట కలిస్తే- దానికి పసందైన విందు భోజనం జోడిస్తే- చెప్పేదేముంది? కాంక్రీటు అరణ్యాల వంటి మహానగరాల్లో, ఇరుకు నివాసాల పట్టణాల్లో కాయకష్టంతో కాలం గడిచిపోయే పల్లెపట్టుల్లో ఒక చోట అని కాదు- ఒక వయస్సు అని కాదు, ఉమ్మడి కుటుంబాలు, నివాస సముదాయాలు మాత్రమే కాదు, రకరకాల బృందాలు, సంఘాలు, సంస్థల్లోని వారందరూ సామూహిక వన భోజనాలు చేసే సందర్భం కార్తీక మాసం.బహుశా మీ కార్యాలయంలోనూ, పరిసరాల్లోనూ ఇందుకు సంబంధించిన హడావుడి చూస్తుంటారేమో! కార్తీక వన సమారాధన, వన భోజనం వంటి పేర్లతో రకరకాల ప్రకటనలూ, పత్రాలు, వాల్ పోస్టర్లు కూడా కనిపిస్తుంటాయి. సాధ్యమైనంత ఎక్కువ మంది పాల్గొంటే వన భోజనం హుషారుగా సాగుతుంది గనకే ఇంత తతంగం జరుగుతుంటుంది. అయితే ప్రతి వన భోజనమూ ఏదో ఒక పరిధిలో వుంటుంది.

అందరూ కలసి చేసే వన భోజనాలు కొన్నయితే ఉప బృందాలుగా ఏర్పాటు చేసుకునేవి మరికొన్ని. అమ్మాయిలు, అబ్బాయిలు, విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు, కళాకారులు, కవులు, రచయితలు, అధ్యాపకులు ఇలా తమ తమ వృత్తి వ్యాపారాలు వ్యాపకాలను బట్టి సామూహిక భోజనాలు పెట్టుకుని సందడిగా గడిపేస్తుంటారు. ఇది గాక ఒక పాఠశాల పూర్వ విద్యార్థులు లేదా ఒక వీధిలోనో పల్లెలోనో వున్నవారు, అదీ ఇదీ కాకపోతే ఒక వంశానికి సంబంధించిన వారు ముందుగా నిర్ణయించుకుని వన భోజనాల ప్రక్రియ సాగిస్తుంటారు. అయితే మామూలుగా వుండే పిక్నిక్‌లకూ వీటికి తేడా ఏమంటే పిక్నిక్‌లలో చూసే ప్రదేశం ముఖ్యం. వన భోజనంలో విందు వినోదాలు ముఖ్యం. అవి సామూహిక భాగస్వామ్యంతో జరగడం ఇంకా కీలకం. ఒక విధంగా మనుషుల సమిష్టితత్వానికి ప్రకృతితో వారి స్వాభావిక అనుబంధానికి సంకేతం ఇవి. అందుకే అన్ని దేశాల రాష్ట్రాల లోనూ ఈ ప్రక్రియ ఏదో ఒక రూపంలో కనిపిస్తుంది. (బాక్సు చూడండి)



కార్తీక మాసం ప్రత్యేకత

వన భోజనాలు ఎప్పుడైనా జరగవచ్చు గాని వైదిక సంప్రదాయంలో కార్తీక మాసాన్ని అందుకు ప్రత్యేకంగా ఎంచుకున్నారు. మత విశ్వాసాల ప్రకారం కార్తీక మాసం చాలా పవిత్రమైందని లెక్క. ఇంగ్లీషు నెలలతో పోల్చి చూసినపుడు అక్టోబరు 23న మొదలై నవంబరు21తో ముగిసే కార్తీక మాసంలో ప్రతి రోజుకూ ఒక పురాణ నమ్మకం జత పడి వుంది. ముఖ్యంగా విష్ణువు అశ్వీజ శుద్ధ ఏకాదశికి నిద్రపోయి కార్తీక శుద్ధ ఏకాదశికి నిద్ర లేస్తాడని పురాణం. అలాగే ఈశ్వరుడు త్రిపురాసుల సంహారం చేసింది కార్తీక పూర్ణిమ రోజునేనంటారు. ఇంక గంగ దేశంలోని అన్ని నదుల్లో ప్రవహాల్లో ప్రవేశించే రోజు ఈ నెలలోనే వుంటుంది.ఇక కార్తీక పౌర్ణమి దానికదే ఒక పెద్ద ఉత్సవం. కార్తికేయుడైన శివుడి పేరు కృతి అన్న స్త్రీ పేరు కలసి రూపొందిన కార్తీక మాసం మహత్యాలన్ని కార్తీక పురాణంలో చూడగలుగుతాము.

దేశంలోని రకరకాల చోట్ల దీన్ని వివిధ రకాలుగా జరుపుతారు. మొత్తంపైన దీపావళి పండుగ ముగిసిన తర్వాత ఇది మొదలవుతుంది.గుజరాత్ నూతన సంవత్సరం కార్తీకంతోనే మొదలు. వారణాసిలోనైతే కార్తీక పౌర్ణిమను శివుడికోసం దీపాలు వెలిగించి గంగలో వదలడం ద్వారా శోభాయమానంగా నిర్వహిస్తారు. "ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం" అన్న దేవులపల్లి కృష్ణశాస్త్రి పాట తెలుగువారికి సుపరిచితమే. ఇంత పౌరాణిక ప్రాధాన్యత గల నెల గనకనే కార్తీక మాసంలో వన భోజనాల తతంగం తరతరాల నుంచి సాగుతూనే వుంది. నమ్మకాల మాట పక్కనపెట్టినా ఇందులో సమిష్టి సంతోషం కూడా దాగి వుండటం వల్ల ఆధునికత జోడించి ఇంకా కొనసాగిస్తున్నారు.

ఉదాహరణకు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేసే విశాఖ పట్టణం వంటి చోట్ల సిఐటియు వంటి సంస్థలు క్రమపద్ధతిలో పెద్ద ఎత్తున వన భోజనాలు ఏర్పాటు చేసి వినోదంతో పాటు విజ్ఞానం కూడా కలిగించే సంప్రదాయం చాలా కాలంగా వుంది. తర్వాత తర్వాత ఇది ఇ తర ప్రాంతాలలోనూ సంఘాలలోనూ అమలులోకి వచ్చింది. దీనివల్ల సంఘ సభ్యులే గాక కుటుంబ సభ్యులు కూడా ఆ వాతావారణం తెలుసుకోవడానికి అవగాహననూ వ్యక్తులను కూడా పరిచయం చేసుకోవడానికి వీలు కలుగుతుంది. అక్కడే ఉమ్మడిగా ఆటపాటలు, భోజనాలతో పాటు కొద్దిసేపు ఏదైనా విషయం చెప్పుకోవడం కద్దు. సాధారణ రాజకీయ తరగతుల తరహాలో గాక సామాజిక కళాత్మక విజ్ఞానదాయకమైన విషయాలను జోడించి వీటిని నిర్వహిస్తుంటారు. ఒకసారి ప్రజాశక్తిలో తెలంగాణా పోరాట యోధులు కె.కృష్ణమూర్తి, మరోసారి విజయవాడలో కీర్తిశేషుడైన రాజకీయ హరి కథకుడు సలాది భాస్కరరావు వంటివారు పాల్గొనడం అందరినీ అమితంగా ఉత్సాహ పర్చింది.

కొన్ని మాసాల కిందట తెరాస నాయకుడు కెసిఆర్ తెలంగాణా వంటల పండుగ పేరిట కూడా రాజకీయ సందడి సాగించడం గుర్తుండే వుంటుంది. ఆహార వ్యవహారాల మేళవింపు అంటే ఇదే!. వన భోజనాల ప్రక్రియను కొంతమంది వ్యక్తిగత ప్రచారం కోసం వాడుకోవడం కనిపిస్తూనే వుంటుంది. అలాగే కొంతమంది కుల సంఘాల పేరిట లేదా వ్యక్తిగత ప్రచారం కోసం కూడా వన భోజనాల వంటివాటిని ఉపయోగించే ఉదాహరణలున్నా ప్రధానంగా ఐచ్చికంగా ప్రజా సంఘాలు సంస్థల ఆధ్వర్యంలో జరగడం ఎక్కువ ప్రయోజనకరమవుతుంది. సహపంక్తి సంప్రదాయం వంటివాటిని పెంచుకోవడానికి ఉద్దేశించిన వన భోజనాలను కూడా సంకుచితం చేయడం వాంఛనీయం కాదు. "ఉర్వివారికి నెల్ల కొక్క కంచము పెట్టి పొత్తు కుడిపి కులము పొలయ జేసి తలను చేయి బెట్టి తగనెమ్మజెప్పరో విశ్వదాభిరామ వినురవేమ" అన్న వేమన ఇక్కడ ఆదర్శం కావాలి.



పిక్నిక్ టెక్నిక్

"పెళ్లిపుస్తకం"లో రాజేంద్ర ప్రసాద్ వన భోజనంలో మహా గలాటా చేసే సన్నివేశం వుంది కదా. కార్తీకం కాదు గాని కృష్ణాష్టమికి బాసు ఏర్పాటు చేసిన వన భోజనంలో చిన్న బాసు ఏవీఎస్‌ను ధర్మవరం కాకా పడుతుంటే అడుగడుక్కు అడ్డుపడే దృశ్యం అదే కదా! నట సార్వభౌమ ఎస్వీరంగారావు- "బాబూ వినరా అన్నా దమ్ముల కథ ఒకటి, కలతలు లేని నలుగురు కలిసి సాగించారు పండంటి కాపురం" అని పాడే పాట కూడా వనభోజనంలోనే.

ఒకప్పుడు వినోదానికి, విజయానికి పర్యాయపదమై వెలుగొందిన ఎస్వీకృష్ణారెడ్డి ఎగిరేపావురమాను తల్చుకోండి. శ్రీకాంత్, లైలాలు సన్నిహితమయ్యేందుకు వనభోజనం ఎలా పనికి వచ్చిందో అక్కడ వైవిజయ వంటివారంతా ఎన్ని చిందులేశారో గుర్తుకు వస్తుంది.

చెప్పొచ్చేదేమంటే మన చిత్రాల్లో వన భోజనాల సన్నివేశం సర్వసాధారణం. కుటుంబాల అనుబంధాలకు ప్రేయసీ ప్రియుల కలయికకు, వైరుధ్యాల పరిష్కారానికి కొన్ని సార్లు సరికొత్త మలుపులకూ దర్శకులు వనభోజనాల సీను పెట్టేస్తుంటారు. అసలు పిక్నిక్‌లన్నీ కూడా అలాంటివే.



వనాలెక్కడ?

ఇంతకూ వన భోజనాలలో ఇమిడి వున్న మూడు అంశాలను చూశాం. ఇవి జయప్రదం కావాలంటే జనాల సమీకరణ, వనాల ఎంపిక కీలకం. దగ్గర్లోని మామిడి తోపులను ఇందుకు ఎక్కువగా వినియోగిస్తుంటారు. ప్రతి వూరికీ అలాంటివి కొన్ని వుంటాయి. ఆనావాయితీగా వివిధ బృందాలు అక్కడికి చేరి భోజనాలారగిస్తుంటారు. సాధారణంగా ఆ తరుణంలో మామిడి కాపు వుండదు గనక పెద్ద సమస్య రాదు. అయితే తోటలు లేకపోతే వేరే చక్కటి ప్రదేశాలను చూసుకోవాల్సిందే. ఉదాహరణకు చెరువులు, నీటి సరఫరా కేంద్రాలు, దగ్గర్లోని గట్లు, పార్కులు, స్మారక చిహ్నాల వంటివి కూడా ఇందుకు వేదికలవుతుంటాయి. కొన్నిసార్లు ఇంకొంత దూరం వెళ్లి విహార యాత్రను కూడా దీనితోపాటే పూర్తి చేస్తుంటారు. పిల్లల మర్రి, యాదగిరి గుట్ట, అమరావతి, జగన్నాథ గట్టు, బొజ్జన కొండ, హార్స్లీ హిల్స్, విజయవాడ భవానీ దీవి వంటివి ఇలాంటి కొన్ని కేంద్రాలు. వాస్తవానికి పెద్ద గుళ్లగోపురాలు వున్న చాలా వూళ్లను ఈ జాబితాలో చెప్పుకోవచ్చు. అయితే మరీ దూరం వెళ్లేట్టయితే అప్పుడు వన భోజనాల వుద్దేశం నెరవేరదు గనక సమీపంలోనే ఏర్పాటు చేసుకుంటారు. ఇదిగాక తీర ప్రాంతాలలోనైతే దీవులు, బీచులు వంటివి కూడా వన భోజనాలకు ఉపయోగిస్తుంటారు. భోజనానికి అనువైన స్థలం లేకపోతే సమీపంలో చూసుకుంటారు. మొత్తానికి వన భోజనం పసందుగా వుండాలంటే మరీ దూరం కాకుండా ఆహ్లాదకరమైన ప్రదేశాన్ని ఎంచుకోవడం కీలకం. కేవలం కలిసి తినడమే ప్రధానమనుకుంటే ఇంట్లోనో డాబామీదనో తినొచ్చు.కాని ఇక్కడ విహార యాత్రానందం కూడా కలగలుస్తుంది.

ఏం చేస్తారు?

వన భోజనాలకు సంబంధించిన ఖర్చు అంచనా వేసుకోవడం. దాన్ని తలకు ఇంతని వసూలు చేయడం నిర్వాహకుల మొదటి పని. పెద్దలకూ, పిల్లలకూ వేర్వేరు రేట్లు నిర్ణయిస్తారు. గరిష్ఠంగా ఎంతమందిని తీసుకురావచ్చో కూడా అనుకోవాల్సిందే. అందరికి అందుబాటులో వుండేవిధంగానూ అదే సమయంలో కాస్త వెరైటీ వుండేట్టుగానూ మెనూ రూపొందించుకుంటారు.ఆ పైన దాన్ని ఎలా వండించాలి, స్వంతంగానా క్యాటరింగా వగైరాలు తేల్చుకుంటారు. కొద్ది మందితో కూడిన బృందమైతే తలా ఒక పదార్థం చేసుకోవాలని పంచుకోవచ్చు. అదే వందల్లో వుంటే సాధ్యం కాకపోవచ్చు. ఖర్చు చాలా ప్రధానాంశం. సరసంగా వుంటేనే పాల్గొనే వారు పెరుగుతారు. లేకపోతే వెనక్కుతగ్గుతారు. లోకోభిన్నరుచి అన్న చందంగా ఇలాంటి విషయాల్లో ముందస్తుగానే తగు నిర్ణయాలు తీసుకుని తదనుగుణంగా వ్యవహరించాలి.లేకపోతే అసంతృప్తులు తప్పవు.

వన భోజనం అన్నప్పటికీ దానికి ముందు వెనక బోలెడు తతంగం.. హంగామా... సామాన్యంగా భోజనం చేయడానికి ముందు గంట లేదా గంటన్నర సమయం వుంటే ఒక రౌండు పూర్తి చేయొచ్చు. భోజనం తర్వాత భుక్తాయాసం ఎలాగూ తప్పదు. తర్వాత చీకటి పడేలోగా మరో దఫా ఆటపాటలు.. అన్ని చాలా పకడ్బందీగానూ పసందుగానూ ప్రణాళిక



పిక్నిక్ పురాణం.....

కార్తీక వన భోజనాలను ఒక విధంగా మనం చిన్న సైజు పిక్నిక్ గానే చూస్తుంటాము. పిక్నిక్ అన్నమాట ఇంగ్లీషు నుంచి వచ్చినా వన విహారం అన్న మాట మనకు ముందు నుంచి పరిచితమే. ఈ మాటకు మూలమైన జర్మన్ పదానికి అర్థం ఆరుబయట భోజనం అనే. అదెంత మధురమో అనుభవించిన వారికే తెలుస్తుంది. అప్రెస్కో అన్న జర్మన్ మాటకు ఇంకా బహిరంగ సమావేశం, సామూహిక విందు అన్న అర్థాలు కూడా వున్నాయి. ఇంగ్లీషులో ఈ మాట 1748లో తొలిసారి అధికారికంగా నిఘంటువులకెక్కింది. ఈ మాట లేకపోయినా దాని భావార్థాన్ని ప్రతిబింబించే సన్నివేశాలు పోతన భాగవతంతో సహా దేశ దేశాల కావ్యాలలో వున్నాయి. పాశ్చాత్య ప్రపంచంలో 1340నుంచి 1800 వరకూ ఇవి పుష్కలంగా కనిపిస్తాయి. చాసర్ కాంటర్‌బరీ టేల్స్‌లో ఇలాంటి వర్ణనే చేశాడు. ఈ కాలంలో ఫ్రాన్స్‌లోనూ వార్షిక సామూహిక భోజనం అన్న మాట కనిపిస్తుంది. ఇక పిక్నిక్ అన్న మాట పుట్టిన తర్వాత ఆలివర్ గోల్డ్‌స్మిత్ వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డులో అలాటి ఘట్టాన్ని సృష్టించాడు. ఆ రోజుల్లోనే బ్రిటన్‌లో పిక్నిక్ సొసైటీ అనేది వుండేదట. వారు మనను రెండొందల సంవత్సరాలు పరిపాలించారు గనక భా రతీయ సంప్రదాయాల్లోనూ అవే చొరబడటం అనూహ్యం కాదు.మనం ఇప్పుడు చూస్తున్న రకరకాల వన భోజన రూపాలు కూడా కాల గతిలో పలు మార్పులకు లోనైనాయి. రూపం ఏదైనా సారం మాత్రం ఒక్కటే- సమిష్టి సంతోషం. సామూహిక భాగస్వామ్యం.

వేసుకోవాలి. అయితే వచ్చేవారిలో లేట్ కమ్మరు, అన్నిటా వెనకబడే స్లో మాస్టర్లూ ఇలాంటి సందర్భాల్లో కాస్త ఇబ్బంది కలిగిస్తుంటారు. పైగా తమను వదిలేశారని ఎదురు దాడి చేస్తుంటారు. అందరూ సవ్యంగా సమిష్టిగా వ్యవహరిస్తేనే సంతోషం పంచుకోవడం సాధ్యం. అయితే ఈ విధంగా ప్రకృతి వడిలోకి వెళ్లినప్పుడు తెలియకుండానే మనుషుల్లో సహజంగా వుండే ఆనందోత్సాహాలు పెల్లుబుకుతాయి. యాంత్రికతకు భిన్నమైన అభిరుచులూ అభిమానాలు వ్యక్తమవుతాయి. నిజానికి వీటి ప్రధానోద్దేశం కూడా అదే. అందుకే వన భోజనాలు విహార యాత్రల్లో వీలైనంతవరకూ వచ్చిన ప్రతివారూ పాల్గొనేలా చూడాలి. మొహమాటంగానో అనాసక్తంగానో వుండేవారిని కూడా స్నేహంగా తీసుకొచ్చి పాల్గొనేలా చేయాలి. అలాగే పిల్లలూ మహిళలూ యువతీయువకులు, పెద్దలు ఇలా అన్ని వయోబృందాల వారినీ దృష్టిలో పెట్టుకోవాలి. పేకాట రాయుళ్లు మందుబాబుల వంటివారిని కచ్చితంగా కట్టడి చేయాలి. అలాగే ఆయా బృందాలలో వున్న ప్రతిభావంతులనూ ఔత్సాహికులను కూడా ఉపయోగించుకునేలా చూడాలి. అంటే పాటలు పాడటం, మిమిక్రీ, ఉపన్యాసం, నృత్యం, కరాటే విన్యాసాలు, క్రీడా పోటీలు వంటివాటికి వీలైనంత అవకాశం కలిగించాలి. పరస్పర పరిచయాలు తప్పని సరిగా జరగాలి. ఒక్క ముక్కలో చెప్పడం, అత్యుత్తమ సూచన, ఆగకుండా మాట్లాడ్డం వంటి వెరైటీ పోటీలను కూడా ఆహ్వానించవచ్చు. అందరినీ అందరూ అన్ని వేళలా కలుసుకోరు గనక ఇలాంటి సమయాల్లో వారిని గురించి తెలుసుకోవడానికి అవకాశం కలుగుతుంది. ఎవరిలో ఎలాటి ప్రతిభ, మంచితనం బహిర్గతమైనా దాన్ని ప్రోత్సహించేందుకు తర్వాత కూడా కృషి కొనసాగించవచ్చు. అప్పుడే వన భోజన కార్యక్రమాల ప్రయోజనం పరిపూర్ణమవుతుంది.



ఖరీదైన ఔటింగ్

ఇటీవలి కాలంలో నగరాలు, పట్టణాలలో ఖరీదైన రెస్టారెంట్లు ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహించి హంగామా చేస్తున్నాయి. ఒకోసారి ఒకో పేరుతో విందు వినోదాలు ప్రత్యేక రేట్లతో ఏర్పాటు చేస్తున్నాయి. ఉన్నత మధ్య తరగతి ఆ పై వర్గాల వారిని ఇవి ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయి. మామూలుగానే ఔటింగ్ పేర బయటికి వెళ్లి తినడం గతంలో కన్నా పెరిగింది. స్టార్ హోటళ్లు కూడా సామాన్యులను ఆకట్టుకోవడానికి ప్యాకేజీలు ప్రకటించి రప్పించుకుంటున్నాయి. ప్రత్యేక బఫేల ప్రకటనలు ప్రతిచోటా కనిపిస్తున్నాయి. హైదరాబాదులోనైతే ఆదిత్య ఇన్, గ్రీన్ పార్క్, సెంట్రల్ కోర్టు, హ్యాంప్‌షైర్ వంటి హోటళ్లు రు.250 నుంచి రు.350 వరకూ వసూలు చేసి అన్‌లిమిటెడ్ ఆఫర్ పేరిట ఏదైనా తినే అవకాశం ఇస్తుంటాయి. పంజాగుట్టలోని బాంబే బ్లూ రెస్టారెంట్ అయితే రు.99కి మెక్సికన్, ఇటాలియన్, ఇండియన్ ఆహారాలను రు.99కి అందించేలా ఫెస్టివల్ నిర్వహించారు. మరో వైపున తాజ్‌కృష్ణా మరింత ఖరీదుతో అక్టోబరు 29 నుంచి ఫెస్ట్ ఏర్పాటు చేసింది. వన భోజనాల సంస్కృతికి మార్కెట్ రూపంగా దీన్ని చెప్పొచ్చునేమో! కొద్దిమంది మిత్రులతో ఈ ఖరీదైన హోటళ్లను సందర్శించి ఆరగించాలన్న కోర్కెను ఇవి పెంచుతున్నాయి. వీకెండ్‌లు ఇందుకు ప్రధాన సందర్భాలవుతుంటాయి. పండగ రోజున తినడం కాకుండా తినడమే పండుగ అన్నది ఈ ఫుడ్‌ఫెస్టివల్స్ తారక మంత్రం.

తరతరాలుగా.......

ఇంతకూ ఈ వన భోజనాల సంప్రదాయం ఇప్పటిది కాదు. భాగవతంలోనే పోతనామాత్యుడు వన భోజన ఘట్టంలో శ్రీకృష్ణుని చిలిపి తనాన్ని వర్ణిస్తాడు. కావడానికి ఉత్తరాది వాసిగా చెప్పబడే కృష్ణుడు అచ్చమైన తెలుగు వంటలను ఆల్లరిగా ఆరగించే తీరు ఇప్పుడు చదివినా లొట్టలేయిస్తుంది. సినిమాల్లోనైతే వనభోజనాల సీను చాలా మలుపులకు కారణమవుతుంటుంది(బాక్సు). అంతెందుకు? ఇలా వన భోజనాల ఆలోచన వుందని చెప్పండి చాలు- ఇళ్లలో పిల్లాపీచు ఎంతగా గంతులేయడం మొదలెడతారో. స్తబ్దుగా వుండేవారిలోనూ ఈ సన్నాహం సంచలనం తీసుకొస్తుంది. కార్తీక పురాణాలు ఎలా వున్నా కదలిక కోసం, కలయిక కోసం, కలివిడి కోసం, వన భోజనాల సంప్రదాయం కొనసాగాలని కోరుకుందాం. దాని పరిధిని విశాలం వినూత్నం చేద్దాం!! ★



మన హీరోలూ మారాలి

తెల్ల లుంగీ, చొక్కా వేసుకొని... నల్లటి చలువద్దాలు పెట్టుకుని... కాస్త ఎత్తు పళ్ళతో... వెటకారపు మాటల్తో... హీరోని సైతం చిన్నపాటి మాటల్తో ఆవేశానికి గురిచేసే... ఆరడుగుల ఆజానుబాహుడైన విలన్‌ను తెలుగు, తమిళ సినిమాల్లో మొన్నమొన్నటిదాకా ఎక్కడా చూసుండం. ఒకే మూసలో పోతున్న విలనిజాన్ని కాస్త స్టైలిష్‌గా పాలిష్ చేశాడు దర్శకుడు శంకర్. అయితే ఆ విలనే సుమన్. ఆ సినిమానే 'శివాజీ'. అప్పటివరకు హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేసిన సుమన్ కెరీర్ గ్రాఫ్ ఆ చిత్రంతో ఒక్కసారిగా మారిపోయింది. కెరీర్‌లో ఇది తానూహించలేదనీ, ఏది ఎప్పుడు ఎలా జరుగుతుందో ఇండస్ట్రీలో మిలియన్ డాలర్ల ప్రశ్నగా వుందని సుమన్ చెబుతున్నారు. పలు భాషల్లో నటించాలనే ఆకాంక్షను వెలిబుచ్చుతున్నారు. తాజాగా 'స్వామి మణికంఠ' చిత్రంలో అయ్యప్ప భక్తునిగా నటిస్తున్నారు. ఈ సందర్భంగా కలిసిన ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఆయన మాటల్లోనే ఆ విశేషాలేంటో తెలుసుకుందామా!

సాధారణంగా తెలుగు నటులకు తమిళ పరిశ్రమ అవార్డులు ఇవ్వడం కద్దు. అలాంటిది రజనీకాంత్ 'శివాజీ'లో నటించినందుకుగాను నన్ను తమిళనాడు ప్రభుత్వం జ్యూరీ కమిటీ ఉత్తమ విలన్‌గా ఎంపిక చేసింది. అదీ దసరానాడు కావడం విశేషం. ఆ తర్వాత దీపావళికి నేను నటించిన మలయాళ చిత్రం 'సిగప్పుమలై' చిత్రం వరల్డ్ రికార్డులకెక్కింది. ఈ చిత్రంలో మంత్రిగా నటించాను. అతి తక్కువ రోజుల్లో షూటింగ్ పూర్తి చేసుకున్నందుకుగాను ఇది గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో పేరు నమోదు చేసుకుంది. ఈ చిత్రంలో నా కూతుర్ని కిడ్నాప్ చేస్తారు. ఆ క్రమంలో కథ సాగుతుంది. ముమ్మట్టి ప్రధాన నటుడు. కృష్ణమూర్తి దర్శకుడు, సురేష్ జోక్యం నిర్మాత. అలాగే ఈ దీపావళి రోజునే నేను నటించిన మలయాళ చిత్రం 'పళసి రాజా' చిత్రం హిట్టయిందన్న శుభవార్త తెల్సి సంతోషించాను. మళయాళీలు కువైట్, ఇరాక్, ఇరాన్‌లలో కూడా వుండడంతో సినిమా ప్రింట్లు అక్కడక్కూడా వెళ్తున్నాయి. అక్కడి అభిమానుల నుంచి ఫోన్లు రావడం నాకు థ్రిల్లింగ్‌గా అనిపించింది.

4 యూనిట్లు- 4 కెమెరాలతో ....

'సిగప్పుమలై' చిత్రాన్ని పూర్తిగా పాండిచ్చేరిలో తీశారు. 11 రోజుల 23 గంటల 40 నిముషాల్లో షూటింగ్ పూర్తిచేశారు. మరోవైపు ఎడిటింగ్, డబ్బింగ్ అంతా రెడీ అయింది. దీనికోసం రాత్రింబవళ్ళు పనిచేశాను. స్టూడియోలో 4 ఫ్లోర్లలో 4 యూనిట్లు ఉన్నాయి. ఇక్కడ హీరోకు షూటింగ్ అయిపోతే వెంటనే మరో ఫ్లోర్‌లో మేకప్ మార్చి చేయాలి. నేను కూడా అంతే. ఒక ప్రణాళికాబద్ధంగా ఈ చిత్రాన్ని దర్శక నిర్మాతలు తీశారు. మాతోపాటు గిన్నిస్‌వరల్డ్ రికార్డ్ జడ్జిలుకూడా దగ్గరుండి పర్యవేక్షించారు. సహజంగా నేను రాత్రి 7 తర్వాత షూటింగ్ చేయను. ఈ సినిమాకోసం రాత్రి 2 గంటలవరకు చేశాను.

సరైన పాత్రలేవీ?

తెలుగులో చేయకపోవడానికి ప్రధాన కారణం సరైన పాత్రలు రాకపోవడమే. శివాజీ తర్వాత తెలుగులో పెద్ద పెద్ద సంస్థలే ఆఫర్లు ఇచ్చాయి. అంతా శివాజీని పోలిన గెటప్‌లే. మొనాటినీ అవుతుందని వద్దన్నాను. చేయనని చెప్పేశానుకూడా. కానీ తమిళంలో మాత్రం నాకు వైవిధ్య భరితమైన పాత్రలు వస్తున్నాయి. ఇప్పటివరకు ఉన్న ఇమేజ్‌ను జాగ్రత్తగా కాపాడుకోవాలంటే వైవిధ్యం చేయాలి. ఇంకా ఎన్నాళ్ళు వేసిన పాత్రలే వేస్తాం. మీకు తెలుసో లేదో... నేను ఒకప్పుడు చేసిన పాత్రలే.. మళ్ళీ మళ్ళీ చేయాల్సి వస్తుంది. మలయాళంలో 'కురవి' అనే సినిమా చేశాను. అందులో మలేషియన్ గెటప్‌లో ఉంటాను. ఆ గెటప్‌కు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటారు. విలనే కానీ.. ట్రీట్‌మెంటే తేడా ఉంటుంది. అది తెలుగులో లేదు.

ఉపయోగించుకునేవారేరీ!

అందరూ కమల్‌హాసన్‌లు కాగలరు. కానీ దాన్ని సరిగ్గా వినియోగించుకొనే నిర్మాత లేడు. అంతా వ్యాపారధోరణిలో పోతున్నారు. తమిళంలో తీసుకుంటే.. విక్రమ్, సూర్య, అజిత్‌లు చూడండి... సినిమా సినిమాకు ఎంత విభిన్నంగా కన్పిస్తారో. ముఖ్యంగా గెటప్‌లు వెరైటీగా ఉంటాయి. అక్కడ దర్శకనిర్మాతలు గెటప్‌కి ప్రత్యేకంగా ఎక్కువ సమయం కేటాయిస్తారు. మన దగ్గర లోపం అదే. శంకర్‌లాంటి మన దగ్గర కూడా తీయొచ్చు. నిర్మాత కూడా ముందుకు రావాలి. తమిళంలో తీసి పరభాషల్లో డబ్బింగ్ చేయడానికి అవకాశాలెక్కువ. దాంతోపాటు ఇక్కడ మన హీరోలూ మారాలి. అంతా ఒకే చట్రంలో ఉన్నట్లు అనిపిస్తుంది. ఒకప్పుడు మేం ఫాంలో ఉన్న రోజుల్లో.. గెటప్‌లకు ప్రాధాన్యత లేదు. అంత ఆలోచన ప్రేక్షకులకు లేదు. కానీ ఆ టైమ్‌లోనే కమల్‌హాసన్ 'ఎర్ర గులాబి' చేశాడు. 'గుణ' చేశాడు. 'దశావతారం' చేశాడు. ఇలా చేస్తే అందరూ కమల్‌హాసన్‌లు కాగలరు.

దర్శకత్వమా... తొందరేముంది

ఆమధ్య కాట్రగడ్డ ప్రసాద్‌గారు నన్ను సినిమా చేయమని అడిగారు. బడ్జెట్ పరిమితులు లేకుండా చూడాలని సూచించాను. నేడు ట్రెండ్ మారింది. అన్నీ సమకూరిస్తే అనుకున్న కమర్షియల్ సినిమా చేస్తా. కానీ నాకు తొందరలేదు. ఏదో కాస్త బడ్జెట్ ఇచ్చి దానిలోనే తీయాలంటే నావల్లకాదు. ఏది తీసినా పాతకథలోనే తీయాలి. కాకపోతే కొత్తదనం చూపాలి. లేదంటే క్రియేటివిటీ దెబ్బతింటుంది. సింపుల్‌గా సినిమాలు తీయాలంటే ఈరోజుల్లో సాధ్యపడేదికాదు.

ఎత్తు పల్లాలు చూశా

జీవితంలో చాలా ఎత్తు పల్లాలు చూశాను. నటుడిగా అప్ అండ్ డౌన్స్ అనుభవించాను. అయినా సరే ఇండస్ట్రీని వదిలి వెళ్ళలేదు. మద్రాసు నుంచి హీరోగా ఉన్నప్పుడే హైదరాబాద్ వచ్చాను. అప్పటినుంచీ ఇక్కడే ఉన్నాను. చిన్నచిన్న పాత్రలు వేశాను. అలా వేయబట్టే శంకర్‌కు నా గురించి తెలిసి అవకాశం ఇచ్చారు. అందుకే వేరే వ్యాపారంలోకి పోదలచుకోలేదు. చాలామందికి ఇతర వ్యాపారాలుండవచ్చు. కానీ నాకు తెలిసిందల్లా సినిమానే.

హిందీలో మిస్ అయింది

ఇప్పటివరకు హిందీలో చేయలేకపోయా. ఒకప్పుడు అవకాశం వచ్చింది. కానీ ఆ టైమ్‌లో తెలుగులో చాలా బిజీగా ఉన్నా. సరైన టైమ్‌లో రాలేదే అని ఆ తర్వాత బాధపడ్డాను. అలాగే బెంగాలీ, ఒరియా, పంజాబీ, మరాఠీ వంటి భాషల్లోనూ నటించాలనే కోరిక ఉంది. అది తీరుతుందనే నమ్మకమూ ఉంది. తెలుగు, తమిళ, హిందీ మాత్రం మాట్లాడగలను. మిగిలిన భాషల్లో అవసరమైతే డబ్బింగ్ కూడా చెప్పడానికి ప్రయత్నిస్తా.

సినిమా గాంబ్లింగ్ లాంటిది

ఎప్పుడు హిట్ వస్తుందో, ఎప్పుడు ఫ్లాప్ వస్తుందో చెప్పలేం. మనం ఈ సినిమా హిట్ అనుకుని ఆ తర్వాత ఆఫర్లు వస్తాయని అనుకుంటే.. అది ధమాల్ కావచ్చు. ఇది ఒక గాంబ్లింగ్ లాంటిది. చాలామంది రియల్ ఎస్టేట్ రంగం నుంచి, సాఫ్ట్‌వేర్ రంగం నుంచి 2,3 సినిమాల వరకు లక్ చూసుకుని రాకపోతే వెళ్ళిపోతుంటారు. వారి వల్ల ప్రయోజనం లేదు. ఏరంగంలోనైనా పూర్తిగా దిగాలి. అలాగే ఒకరికి సక్సెస్ వచ్చింది. మనకు రాలేదని బాధ పడకూడదు. మనకు ఏటైమ్‌లో రావాలో ఆ టైమ్‌లో వస్తుందని ముందుకు సాగాలి. ఇదే నేను ఇన్నాళ్ళూ నేర్చుకుంది.

రాజకీయాలకూ అదే ఫార్ములా...

ఉంటే పూర్తిగా రాజకీయాల్లో ఉండాలి. అప్పుడే దానికి న్యాయం చేస్తాం. అందుకే నేను రాజకీయాల నుంచి వెనక్కు తగ్గాను. చంద్రబాబు పార్టీలోకి వెళ్ళడానికి కారణం.. ఆయనలో డిఫరెంట్ విజన్ ఉంది. భవిష్యత్ రాజకీయాలు మారబోతున్నాయి. అంతా యూత్ రాబోతున్నారు. అప్పుడు వారి ఆలోచనలు గొప్పగా ఉంటాయి. సినిమాల్లో సీనియర్ దర్శకులు ఒకప్పుడు బాగా తీశారు. కానీ నేటి ట్రెండ్‌ను బట్టి తీయాలంటే... యువ దర్శకులు కావాలి. అలాగే రాజకీయాల్లో కూడా.

కామెడీ పాత్రలో...

రాజేంద్రప్రసాద్‌తో కలిసి సెమీ కామెడీ పాత్ర ఒకటి చేస్తున్నా. ఆ తర్వాత వెల్ఫేర్ క్రియేషన్స్ పతాకంపై నితిన్, హన్సిక జంటగా కనిపించనున్న చిత్రంలో పాజిటివ్ పాత్ర పోషిస్తున్నా. రఫ్ అండ్ టఫ్‌గా ఉన్నా పాత్ర పాజిటివ్‌గా ఉంటుంది. ఆ తర్వాత 'లాల్' అనే మాలయాళ చిత్రంలో నటించనున్నా.

వారసురాలి వైద్య సేవ !

నా వారసులెవరూ చిత్రసీమలోకి వచ్చే అవకాశం లేదు. ఎందుకంటే మాకు పాప ఒక్కటే. తను 9వ తరగతి చదువుతోంది. డాక్టర్ చదివి సేవ చేయాలన్నది తన ఆశ. అది నాకు చాలా సంతోషకరమైన విషయం. భవిష్యత్తులో ఎలా వుంటుందో చూడాలి.

- పెండ్యాల మురళి



కథ

> "శ్వేత పక్కవారికి చిన్న సహాయం చేసినా సహించేది కాదు. అలాంటిది తెలియని వ్యక్తికి కిడ్నీ డొనేట్ చేశానంటే ఊరుకుంటుందా? అందుకే ఆఫీస్ పని మీద ఢిల్లీ వెళ్ళానని చెప్పి ఇంట్లో రెస్ట్ తీసుకున్నాను డాక్టర్"

పరోపకారం

-పివికే. సుజిత్ కూమార్ రెడ్డి

సంఘర్ష్ ఉదయాన్నే వాకింగ్‌కు వచ్చాడు. వాకింగ్ చేస్తూ ఉండగా వెనుక నుండి "సంఘర్ష్... సంఘర్ష్..." అన్న పిలుపు వినిపించింది. అతను వెనక్కు తిరిగాడు.

చూస్తే అశోక్. "ఏయ్ అశోక్ ఏంటిరా, ఇంత ఉదయాన్నే ఇక్కడ... అరె మానస కూడాను. ఏంటిరా సంగతి?"

"సంఘర్ష్ నెక్స్ట్ వీక్ మా పెళ్లి. ఇది నువ్వు జరిపిస్తున్న పెళ్లి. నువ్వు లేకుండా మేం ఈ పెళ్లిని ఊహించుకోలేం. కచ్చితంగా మా ఇద్దరినీ ఆశీర్వదించటానికి రావాలి" అంటూ అశోక్ పెళ్లి పత్రికను అందించాడు.

సంఘర్ష్ పెళ్లి పత్రికను తీసుకుంటూ "రేయ్! అంత పెద్ద మాటలు ఏంటిరా? మనం ఎప్పటికైనా ఫ్రెండ్స్. ఇటువంటి మాటలతో నన్ను దూరం చేయొద్దు"

"అశోక్ అన్నది కరెక్టే కదా అన్నయ్యా! నువ్వు లేకుంటే మేం ఇంట్లో పెద్దోళ్లను ఒప్పించగలిగే వాళ్లమా? ఇప్పుడు మాపెళ్లి జరిగేదా?" అంది మానస.

"మన బ్యాచ్‌లో అందరి పెళ్లిళ్లు అయిపోతున్నాయి నీది తప్ప. నీ పెళ్లి ఎప్పుడురా?" అన్నాడు అశోక్.

"నీకు తెలియాదారా! పక్కవారికి చిన్న సాయం చేసినా ఒప్పుకోదు శ్వేత. తన బుద్ధి ఎప్పుడు మారుతుందో అప్పుడు తనూ నేనూ ఒకటౌతాం. అవునూ మీ పెళ్లి విషయం శ్వేతకు చెప్పారా?" అడిగాడు సంఘర్ష్.

"అమ్మో! నువ్వు వచ్చి మాపేరెంట్స్‌తో మాట్లాడావంటేనే కస్సు బుస్సు లాడింది తను. అలాంటిది ఇప్పుడెళ్లి పెళ్లికార్డు ఇస్తే మీదపడి తంతుంది" అంది మానస.

"ఎప్పుడూ తను సుఖంగా వుండాలని కోరుకుంటుందే తప్ప పక్కవారు సుఖంగా వుండాలని కోరుకోదు. తన బిహేవియర్ ఎప్పుడు మారుతుందో ఆ దేవుడికే తెలియాలి" అంటూ బాధపడ్డాడు సంఘర్ష్.

"అప్పుడు ఎవరికో కిడ్నీ డొనేట్ చేశావు కదా! ఆరోగ్యం ఎలా వుంది రా?" అని టాపిక్ డైవర్ట్ చేశాడు అశోక్.

"బాగుంది రా. నా కిడ్నీ వల్ల ఒక మనిషి ప్రాణం నిలబడింది. ఆ సంతోషం చాలురా నాకు"

'ఈ విషయం శ్వేతకు....'

"ఎట్టి పరిస్థితుల్లో శ్వేతకు తెలియనివ్వనురా. ఈ విషయం తెలిస్తే ఇల్లు పీకి పందిరేస్తుంది. ఈ నెల రోజులు జాబ్ పనిమీద ఢిల్లీ వెళ్లానని చెప్పి కవర్ చేశా" అన్నాడు సంఘర్ష్.

అశోక్ వాచీ వైపు చూసి ఇంకా చాలా పనులు వున్నాయంటూ బయల్దేరారు.

◆◆◆

సంఘర్ష్ శ్వేతకు ఫోన్ చేసి ...

"ఎల్లుండి అశోక్, మానసల పెళ్లి. నిన్ను ఇన్వైట్ చేశారా?"అడిగాడు.

"చేశారు. కానీ ఆ పెళ్లికి నేను రాలేను. నాకు కుదరదు సంఘర్ష్"

"శ్వేతా నేను చెప్పేది విను..."

"నాకు ఇష్టంలేదు సంఘర్ష్. నువ్వు వెళ్లాలనుకుంటే వెళ్లిరా. ప్లీజ్.." అంటూ కాల్ కట్ చేసింది శ్వేత.

మరుసటి రోజు సాయంత్రం సంఘర్ష్ బైక్‌మీద వెళ్తుంటే కళామందిర్ దగ్గర శ్వేత కనిపించింది. వెంటనే బైక్ పక్కన పార్క్ చేసి శ్వేత వద్దకు వెళ్లాడు.

"హాయ్ శ్వేతా బట్టలు కొనడానికి వచ్చావా?"

"కాదు వంట చేయడానికి వచ్చాను."

"అదేంటి అలా మాట్లాడతావు."

"మరి ఇక్కడకు ఎందుకు వస్తారు?"

"నువ్వు ఎప్పుడూ తిన్నగా సమాధానం చెప్పవు కదా" అంటూ లోలోన సణుక్కున్నాడు సంఘర్ష్.

"ఏంటి గొణుక్కుంటున్నావ్?" అంది శ్వేత.

"ఆ... నీ సెలక్షన్ అదిరింది అంటున్నాను" అన్నాడు.

"ఈ చీర బాగుందా?" అంటూ శ్వేత ఆకుపచ్చని చీరను చూపించింది.

"చాలా బాగుంది. ఈ చీర నువ్వు కట్టుకుంటే నిండుగా వుంటావు" అన్నాడు సంఘర్ష్ శ్వేతను పొగుడుతూ.

"సరే కానీ, ఇప్పుడు నీకు ఏమైనా పని వుందా?"

"లేదు. ఏం?"

"పిక్చర్‌కు వెళ్దామా" అంటూ గోముగా అడిగింది శ్వేత.

"సరే వెళ్దాం పద. నేనెళ్లి బిల్ పేచేసి వస్తాను. నువ్వు బైక్ దగ్గర వెయిట్ చేస్తూ వుండు."

"నేను పే చేస్తాలే సంఘర్ష్."

"నువ్వు కామ్‌గా వెళ్లి బైక్ దగ్గర వుండు, నేను ఇప్పుడే వస్తాను."

◆◆◆

"అబ్బబ్బ ఏం జనాలు. టికెట్స్ దొరకవేమో అనుకున్నాను. లక్కీగా దొరికాయి" అంటూ సినిమా హాల్లో కూర్చుని సంఘర్ష్‌తో అంటోంది శ్వేత.

"నీకేవమ్మా ఎన్నైనా చెప్తావు. వెళ్లి టికెట్స్ తెచ్చేది నేను. నాకు తెలుస్తుంది ఆబాధ. ఏదో పాత పిక్చర్‌కి అనుకున్నాను కానీ రిలీజ్ పిక్చర్‌కి తీసుకొచ్చావే."

"ఈ పిక్చర్ చాలా బాగుందట. మా ఫ్రెండ్స్ చెప్పారు. పిక్చర్ బిగిన్ అయింది చూడు" అంటూ సినిమా చూడ్డంలో లీనమైంది శ్వేత.

ఇంటర్వెల్లో ఇద్దరూ బయటికి నడిచారు.

ఇంతలో సంఘర్ష్ వద్దకు ఒకామె వచ్చి మీరు బాత్రూమ్ వెళ్తున్నట్టున్నారు. మా బాబుని కూడా తీసుకెళ్తారా? అంటూ ఐదేళ్ల పసివాణ్ణి చూపించింది.

సరేనంటూ బాబును బాత్రూమ్ తీస్కెళ్లి వచ్చాడు. బాబు థాంక్స్ అంకుల్ అన్నాడు. నోమెన్షన్‌రా అంటూ బాబును వాళ్లమ్మ దగ్గరికి తీసుకొచ్చాడు. ఆవిడ చాలా థాంక్సండీ అంటూ బాబును తీసుకెళ్లింది.

పక్కనే వుండి ఇదంతా గమనిస్తున్న శ్వేత కోపోగ్రురాలైంది.

"బెల్ కొట్టారు రా శ్వేతా లోపలికెళ్దాం" అన్నాడు సంఘర్ష్

"నీకు ఎన్ని సార్లు చెప్పాలి సంఘర్ష్! మన పని మనం చూసుకుంటే సరిపోతుంది కదా. పక్కవాళ్ల గురించి మనకెందుకు?" అంది శ్వేత.

"శ్వేతా... అంత పెద్దపని నేనేం చేశాను. నేనూ బాత్రూమ్‌కే కదా వెళ్లేది. చిన్నబాబుని తీసుకెళ్లమంటే తీస్కెళ్లాను దానికి కూడా...."

"ఇంటికి వెళ్దాం పద."

"శ్వేతా నా మాట విను..."

"నువ్వు వస్తున్నావా లేదా?"

ఇద్దరూ హాల్ బయటికి వచ్చారు.

◆◆◆

మరుసటి రోజు అశోక్ మానసల పెళ్లికి సంఘర్ష్ వెళ్లాడు. అక్కడ సంఘర్ష్‌ని ఒక డాక్టర్ చూశాడు.

హాయ్ సంఘర్ష్! అంటూ సంఘర్ష్‌ని ఆ డాక్టర్ పలకరించాడు.

సంఘర్ష్ డాక్టర్ వైపు చూస్తూ "హలో డాక్టర్! మీరు ఇక్కడ?"

"పెళ్లి కొడుకు నాన్న నాకు బాగా తెలుసు. అవునూ నీ ఆరోగ్యం ఎలా వుంది ఇప్పుడు?"

"ఫైన్ డాక్టర్."

"నువ్వు కనుక ఆ రోజు కిడ్నీ డొనేట్ చేయకపోతే ఆ అమ్మాయి చనిపోయి వుండేది. నీ దయవల్ల ఆ అమ్మాయి పునర్జన్మ ఎత్తింది. నీ మనసు చాలా గొప్పది సంఘర్ష్"

"నన్ను చాలా ఎత్తేస్తున్నారు డాక్టర్. ఆ సమయంలో నాకు అలా చేయాలనిపించింది. చేశాను."

"సంఘర్ష్ త్వరగా రా, ఫొటో తీయించుకుందాం" అంటూ అశోక్ కేక వేశాడు.

"మళ్లీ కలుద్దాం బై సంఘర్ష్. ఆ... ఒక్క విషయం మరిచాను. వీలైతే ఒకసారి హాస్పిటల్‌కు రా. చెకప్ చేయించుకుని వెళ్లవుగాని."

"సరే డాక్టర్" అంటూ వెళ్లాడు సంఘర్ష్

◆◆◆

మరుసటి రోజు సాయంత్రం సంఘర్ష్ శ్వేత బైక్ మీద పార్క్‌కు వెళ్తున్నారు. వెళ్తోన్న దారిలో ఒక దగ్గర జనాలు గుమిగూడి ఉన్నారు. సంఘర్ష్ పక్కన బైక్ ఆపి అటువైపు వెళ్తున్నాడు.

"ఆగు సంఘర్ష్, ఏదో యాక్సిడెంట్ అయినట్లుంది. మనకెందుకు" అని శ్వేత చెప్తున్నా వినకుండా అటువైపు వెళ్లాడు. అక్కడ చావు బతుకుల మధ్య రక్తపు మడుగులో ఒక వ్యక్తి కొట్టుమిట్టాడుతున్నాడు. సంఘర్ష్ వెంటనే 108కి ఫోన్ చేశాడు. అంబులెన్స్ వచ్చి ఆ వ్యక్తిని తీసుకెళ్లే వరకూ అక్కడే వుండి వచ్చాడు. బైక్ స్టార్ట్ చేసి శ్వేతను ఎక్కమన్నాడు.

శ్వేత వెంటనే "నీకు ఎప్పుడూ సంఘసేవేనా? నాగురించి పట్టించుకోవా?" అంది.

"ఏ విషయంలో నీగురించి పట్టించుకోలేదు. నువ్వు చిన్నప్పటి నుండి డబ్బు మధ్య పెరిగావు. నీకు కష్టాల గురించి తెలీదు. పక్కవాళ్ల కష్టాల్లో వుంటే ఆదుకోవాలనే విషయం కూడా తెలీదు. నేను చిన్నతనం నుండి పేదరికంలో మగ్గాను. తల్లీ తండ్రీ లేక, ఒకపూట తిని రెండు రోజులు తినక అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చాను. కష్టాల విలువ నాకు తెలుసు. అందుకే ఎవరైనా కష్టాల్లో వుంటే చూస్తూ ఊరుకోలేను. ఎదుటి వ్యక్తి సుఖంగా వుండాలనే కోరుకుంటాను. అందుకోసం ఏం చేయడానికైనా వెనుకాడను. అదే కష్టం నీకు వచ్చినప్పుడు తెలుస్తుంది. నీబుద్ధి మారితే మళ్లీ కలుద్దాం గుడ్‌బై" అంటూ బైక్ స్టార్ట్ చేసి వెళ్లాడు.

శ్వేత కూడా ఆటోలో ఇంటికి వెళ్తూ సంఘర్ష్ అన్న మాటల గురించి ఆలోచించసాగింది.

తర్వాత ఒక రోజు సంఘర్ష్ డాక్టర్ వద్ద చెకప్ చేయించుకోవటానికి హాస్పిటల్‌కు వెళ్ళాడు.

డాక్టర్ చెకప్ చేయటానికి సంఘర్ష్‌ని రూమ్‌లోకి పంపించాడు. డాక్టర్ కూడా లోనికి వెళ్ళబోయాడు. అంతలో అక్కడికి ఒక అమ్మాయి వచ్చింది. డాక్టర్ ఆ అమ్మాయిని చూసి, "అరె నువ్వామ్మా. ఇప్పుడు నీ హెల్త్ ఎలా ఉంది?"

"బాగుంది డాక్టర్ గారు, ఒకసారి హెల్త్ చెకప్ చేయించుకుందామని ఇలా వచ్చాను" అంది అమ్మాయి.

"అలాగే చేస్తాను. కానీ నీకు కిడ్నీ డొనేట్ చేసిన వ్యక్తి రూమ్‌లో ఉన్నాడు. అతనిని చెకప్ చేసి ఆ తరువాత నీకే చెకప్ చేస్తాను" అన్నాడు డాక్టర్.

"నాకు కిడ్నీ డొనేట్ చేసిన వ్యక్తి ఇక్కడే ఉన్నాడా?" అంటూ ముఖంలో ఆనందంతో పాటు ఆశ్చర్యం. "అతనిని నేను కలవాలి డాక్టర్."

"అంటే ఇంత వరకు అతనిని కలవలేదా?"

"నో డాక్టర్ మీరు ఇచ్చిన ఫోన్ నెంబర్ ఎక్కడో మిస్ అయింది. ప్లీజ్ డాక్టర్ అతనిని ఒక్కసారి చూడొచ్చా?"

"సరే, నీవు ఇక్కడే కూర్చో. అతన్ని చెకప్ చేసిన తర్వాత నీకు పరిచయం చేస్తాను" అంటూ డాక్టర్ సంఘర్ష్ ఉన్న రూమ్‌లోకి వెళ్లాడు.

◆◆◆

రూమ్‌లో నుండి బయటకు వస్తూ "ఇతనేనమ్మా నీకు కిడ్నీ డొనేట్ చేసింది. ఇతని పేరు సంఘర్ష్. ఆ అమ్మాయికే నీవు కిడ్నీ డొనేట్ చేసింది. ఈవిడ పేరు అంతగా గుర్తులేదు. నీ పేరు ఏంటమ్మా?" అని ఎదురుగా ఉన్న అమ్మాయిని పేరు అడిగాడు డాక్టర్.

అయితే అక్కడ వున్నది ఎవరో కాదు! శ్వేత. సంఘర్ష్‌ని చూసిన వెంటనే ఆమె మాట్లాడలేకపోయింది. కానీ కంటి నుండి నీరు రాసాగింది. తన మనస్సు ఆగలేదు. వెంటనే పరుగున వచ్చి సంఘర్ష్‌ని గట్టిగా హత్తుకుంది.

"ఐయామ్ సారి సంఘర్ష్ ప్లీజ్ ఆ ఐయామ్ సారీ... నాకు బుద్ధొచ్చింది. ఎదుటివారికి సహాయం చేయవద్దన్నానే కాని, నాకు కష్టం వస్తే ఇతరులు నాకు సహాయం చేస్తారా? అని ఆలోచించలేదు. ఇతరులకు సహాయం చేసినట్లే నీవు నాకూ సహాయం చేశావు. కానీ ఇది సహాయం కాదు. మరుజన్మ...." అంటుండగానే...

"మీ ఇద్దరూ ఇదివరకే ఒకరికొకరు తెలుసా?" అని ఆశ్చర్యంతో అడిగాడు డాక్టర్.

"యస్ డాక్టర్. నా పేరు శ్వేత. నాకు యాక్సిడెంట్ అయిన వెంటనే సర్జరీ చేయించుకొని ముంబయ్‌లోని మా అక్కయ్య దగ్గరకు వెళ్ళాను. అప్పుడు అలా చేసింది ఇతనికోసమే. ఇతను కంగారుపడతాడనే కారణంతో అలా చేశాను"

"పక్కవారికి చిన్న సహాయం చేసినా సహించేది కాదు శ్వేత. అలాంటిది తెలియని వ్యక్తికి కిడ్నీ డొనేట్ చేశానంటే ఊరుకుంటుందా? అందుకే ఆఫీస్ పని మీద ఢిల్లీ వెళ్ళానని చెప్పి ఇంట్లో రెస్ట్ తీసుకున్నాను డాక్టర్" అంటూ సంఘర్ష్ చెప్పడం ముగించాడు.

"తన దాకా వస్తేగాని తెలియదంటే ఇదే. ఏమయితేనేం ఇద్దరూ కలిశారు అదేచాలు" అంటూ డాక్టర్ పక్కకు వెళ్ళాడు.

తర్వాత సంఘర్ష్, శ్వేత పెళ్ళి చేసుకున్నారు.

★

ఒంటరిగా

ప్రపంచాన్నే చుట్టేస్తా...

నేస్తాలూ! మీరు ఒక్కరే ఎప్పుడైనా ఏదైనా ఊరు వెళ్లొచ్చారా! లేదుకదూ. ఓ పిడుగు ఎవ్వరి తోడూ లేకుండా ఒక్కతే ప్రపంచాన్నే చుట్టి రావాలనుకుంటోంది. రికార్డే కదా. అది కూడా.... ఎక్కడా ఆగకుండా, ఎవరి సహాయమూ లేకుండా అంటే చాలా గ్రేట్. ఎంత ధైర్యముండాలో! సరే అసలు విషయానికొచ్చేద్దాం. ఆ పిడుగు పేరు జెస్సికా వాట్సన్. వయసు 16 సంవత్సరాలు. ఆమెది ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరం. జెస్సికా పోయిన ఆదివారం ఉదయం 9 గంటలకు పడవలో సిడ్నీ నుంచి ప్రపంచ యాత్రను ప్రారంభించింది. దక్షిణ అమెరికాలోని న్యూజిలాండ్ నుంచి దక్షిణ అట్లాంటిక్ మహాసముద్రం గుండా తన ప్రయాణం సాగుతుంది. ప్రపంచంలో కొన్ని ముఖ్యమైన ప్రాంతాల గుండా 38,000 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలని జెస్సికా అనుకుంది. తన ఎనిమిది నెలల ప్రయాణంలో తను నిద్ర పోయే సమయం ఎంత తెలుసా? అలసిపోయినప్పుడు 20 నిమిషాలు మాత్రమే. ఆ దేశ ఉపప్రధాని జులియా గిల్లార్డ్ జెస్సికాకు అభినందనలు తెలియచేశారు. 'సముద్ర ప్రయాణం ప్రమాదకరమైనది కావడమే కాక అక్కడ ఎవరూ ఉండరు. ఆస్ట్రేలియా వాసులందరూ జెస్సికా గురించి భయపడతున్నారని నేను అనుకుంటాను. నాకూ చలా భయంగా ఉంది. తను విజయం సాధించాలని కోరుకుందాం' అని ఆయన అన్నారు. 'కానీ భయపడనవసరంలేదు. జె సి ్స కా సముద్ర ప్రయాణం చేయడంలో చాలా నేర్పరి' అంటున్నారు అధికారులు. అయినా ఎవరో ఏంటో తెలియని మనకే ఇంత భయంగా ఉంటే తన స్నేహితులకు భయం ఉండడం సహజమే కదా. ప్రయాణం మొదలెట్టాలంటే అనుకూల వాతావరణం వుండాలి కదా. అందుకోసం సిడ్నీలో రెండు వారాలపాటు వేచిచూసింది. శనివారం రాత్రి కుటుంబ సభ్యులు, స్నేహితులు త ప్రయాణానికి కావలసినవన్నీ సిద్ధం చేశారు. ఆగస నెలలో బ్రిటన్‌కు చెందిన పర్‌హామ్(17) అతి చి వయసులో పడవలో ప్రపంచాన్ని చుట్టి వచ్చి వాడిగా పేరు తెచ్చుకున్నాడు. కాకపోతే చుక్కా పనిచేయకపోవడం వల్లనూ, ఇంకా ఇతర కారణా వల్లనూ నౌకాశ్రయానికి మూడు సార్లు వెళ్లాల్సి వచ్చింది. ఈ పిడుగు 45,000 కిలోమీటర్ల దూరా తొమ్మిది నెలల్లో చుట్టివచ్చాడు. పర్‌హామ్ కంటే కొ నెలలు పెద్ద వాడైన, కాలిఫోర్నియాకు చెందిన జా సుందర్‌లాల్ 13 నెలల్లో ప్రపంచాన్ని చుట్టి వచ్చాడ అయితే వీరిరువురూ ఇతరుల సహాయ తీసుకున్నారు. జస్సికా మాత్రం ఎవరి సహాయమూ తీసుకోకుండా తన ప్రయాణాన్ని పూ చేస్తానంటోంది.

జెస్సికాకు తనకు 11 సంవత్సరాలప్పటి నుంచే ప్రపంచాన్ని చుట్టి రావాలన్న కోరి ఉండేది. నేవిగేషన్, ఎలక్ట్రానిక్స్, నౌకానిర్మాణం గురించి చదివిన ఆమెకు నౌకన నడపడంలో మంచి అనుభవముందని తన కుటుంబసభ్యులు చెప్పారు. ఆమె పడవల ఒంటరిగా వెళ్తున్నప్పటికీ ఇ-మెయిల్, రేడియో ద్వారా ఎప్పటికప్పుడు క్షేమ సమాచారాన్ని చేరవేస్తూనే వుంటుందనుకోండి. జెస్సికా తన కోరికను తీర్చుకోవడానికి చాలా ఎదుర దెబ్బలు తినాల్సి వచ్చింది. గత నెలలో తన ప్రయాణానికి చివరి పరీక్ష సమయంలో సిడ్నీ వెళ్ ్తున్నప్పుడు ఆమె పడవ కార్గో పడవకు ఢీకొంది. దానితో తన ప్రయాణాన్ని ఆపుకోమని చాల మంది ఆమెకు ఫోను చేసి చెప్పారు. గత వారమే తను బయలుదేరాల్సి ఉండగ వాతావరణం అనుకూలించకపోవడంతో వాయిదా పడింది. ముందుగా న్యూజిలాండ్ ఫిజీ నుంచి ప్రయాణం మొదలెట్టి చివరి నెలలో ఆఫ్రికా, దక్షిణ అమెరికా తీ ముగించాలనుకుంది. ఏ ప్రమాదమూ లేకుండా జెస్సికా ఈ రికార్డు సాధించాలని కోరుకుందామా మరి!

తేనెటీగలూ...

ఎక్కడున్నారూ...

పిడుగులూ... ఈ బొమ్మ చూశారుగా. తాబేలు ఎంచక్కా ఉయ్యాల ఊగుతోంటే...నీకంటే నేనేం తక్కువ అన్నట్టు... ఎలుగు బంటి చెట్టు కొమ్మ పట్టుకుని ఊగుతోంది. అయితే ఎలుగుకు తేనె అంటే చాలా ఇష్టం కదా. ఆ తేనెను తయారుచేసే తేనెటీగలు పదిహేను వున్నాయి ఈ బొమ్మలో వాటిని గుర్తించి సున్నా చుట్టండే.

వేలిముద్ర

మార్జాలం

హాయ్ చిన్నారులూ... వేలిముద్రలతో బొమ్మలు ఎలా చేయాలో పోయినవారం నేర్చుకున్నాం కదా. ఇదిగో ఈ వారం మీకోసం మార్జాలం అదే పిల్లిని తీసుకొచ్చాం చూస్తున్నారుగా. దీన్ని కూడా వేలి ముద్రతోనే చేశారు. మీరూ ప్రయత్నించండి. వచ్చేవారం మరో బొమ్మతో కలుద్దాం. మరి ఎదురుచూస్తుంటారుగా.



చెప్పండి చూద్దాం

పిడుగులూ...పైన ఉన్న ముక్కల్లో ఏదో అర్థంకాని ఆకారం వుంది. ముందుగా మీరు వాటికి రంగులు వేయండి. రంగులు వేసిన తర్వాత ఆ బొమ్మేదో తెలుస్తోందా? ఇప్పుడు చెప్పండి అక్కడున్నదేంటో...

బాలస్నేహం

పొడుపు కథలు

1 ఎలగ కాయంత బంగారం, ఏనుగు గూడా మోయదు.

2. ఎర్రని దొరకు నల్లని టోపి

3. ఎదురు గుండా ఉన్నంత సేపూ కనపడుతుంది, పక్కకు జరిగితే మాయమవుతుంది.

4. ఏసే దొకటి, ఎక్కే దొకటి, కట్టే దొకటి, కారే దొకటి.

జవాబులు:-
1.అగ్గి, .2. గురిగింజ, 3. అద్దంలో బమ్మ 4. నిచ్చెన ,మాను దుత్త, కల్లు.

సంతకం



అబ్రహాం లింకన్



బాతు గుడ్డు

జోక్స్

రామ్: ఓరే శీనూ! నేనొకటి అడుగుతాను. జవాబు చెప్పరా!

శీను: అడుక్కో మరి.

రామ్: ఓ బాతు ఆకాశంలో ఎగురుతూ... ఎగురుతూ... గుడ్డు పెట్టింది. కాని అది కిందపడలేదు. ఏమైనట్టు?

శీను: మధ్యలోనే ఎవరైనా పట్టుకుని వుంటారు. అందుకే అది కింద పడలేదు.

రామ్: కాదుగా.

శీను: ఆ...అది కింద పడే లోపే పిల్ల అయి వుంటుంది

రామ్: కాదు...

శీను: ఇంతకీ గుడ్డు కింద ఎందుకు పడదు? నువ్వే చెప్పు!

రామ్: గుడ్డు ఎందుకు కింద పడలేదంటే... బాతు చెడ్డీ వేసుకుంది కాబట్టి.

కె.సాహిల్,
7వ తరగతి, గౌతమ్ మోడల్ స్కూల్, హైదరాబాద్.

మీరూ జోక్స్ చెప్తారా?
అయితే మాకు రాసి పంపండే. మా చిరునామా: బాలజోక్,
ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్ భవన్,
ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500020.

పొద్దుతిరుగుడు పూలు కావాలా

చేసేద్దాం

చిన్నారులూ...ఈ వారం చెప్పకోబోయే క్రాఫ్ట్ ఏంటబ్బా అని తెగ ఆలోచిస్తున్నట్టున్నారే! అందుకే మీకోసం పొద్దు తిరుగుడు పూలు తీసుకొచ్చాం. వీటిని చేస్తుంటే భలే మజాగా వస్తుంది తెల్సా. మొత్తం చేసేశాక బోలెడంత సంతోషం కూడా వస్తుంది. మరి అవన్నీ మీకు సొంతం కావాలంటే ఇవాళ్టి క్రాఫ్ట్ చేసేయాలిమరి. రెడీనా...

<u>కావలసిన వస్తువులు:</u>

పేపరు ప్లేటు, 1.8 మీటర్ల పొడవు, ఒకటిన్నర అంగుళాల వెడల్పున్న పసుపుపచ్చని రిబ్బన్, పాత చెక్క స్కేలు, పొద్దుతిరుగుడు విత్తనాలు లేక చాక్లెట్ రంగు గుండీలు, గమ్, గట్టి అట్ట, చాక్లెట్, ఆకుపచ్చ రంగు పెయింటు, పెయింటు బ్రష్, చిన్న పూల కుండీ లేదా వాడకుండా పక్కన పడేసిన పచ్చడి జాడీ ఏదైనా.

<u>తయారుచేసే విధానం:</u>

ముందుగా పేపర్ ప్లేటును 12.5 సెంటీమీటర్ల వ్యాసంతో వృత్తాకారంలో కత్తిరించుకోవాలి. దానికి చాక్లెట్ రంగు పెయింటు వేసి ఆరనివ్వాలి. రిబ్బనును 12.5 సెంటీమీటర్ల పొడవుతో చిన్న చిన్న ముక్కలు కత్తిరించుకోవాలి. వాటిని వలయాకారంలో రెండు చివర్లను గమ్‌తో అతికించాలి. అవి ఎండిన తర్వాత వాటికి పెయింటు వేసి, పేపరు ప్లేటు చివర చుట్టూ గమ్‌తో అంటించుకోవాలి. ఇప్పుడు మధ్యలో గుండీలు గానీ, పొద్దుతిరుగుడు పువ్వు విత్తనాలు గానీ అతికించుకోవాలి.. తర్వాత దానిని స్కేలు పైభాగాన అతికించాలి. గట్టి అట్టతో రెండు ఆకులను చేసుకోవాలి. తర్వాత కాండానికి ఆకులు అటు ఇటు ఉన్నట్టుగా స్కేలుకు రెండు వైపులా మనం అట్టతో చేసుకున్న ఆకులను అతికించుకోవాలి. ఇప్పుడు ఆకులకు, స్కేలుకు ఆకుపచ్చని పెయింటు వేసుకోవాలి. ఇలా మనకు కావాల్సినన్ని పూలు తయారుచేసుకుని జాడీలో పెట్టేస్తే... వుంటుంది! అదిరిపోతుంది. దీన్ని ఎంచక్కా హాల్లోనో, డ్రాయింగ్ రూమ్‌లోనో పెట్టుకోవచ్చు. చూడముచ్చటగా వుంటుంది.



కొత్త పుస్తకాలు

కృష్ణశాస్త్రి సాహిత్యం
(నాల్గవ సంపుటం)
(అమృత వీణ- మంగళకాహళి)
పేజీలు: 206, వెల: 100/-
ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
4-1-435- బ్యాంక్ స్ట్రీట్-
హైదరాబాద్-1.
విశాలాంధ్ర బుక్ హౌస్ షాపులన్నీ



గుబాళించే గీతాలు

ప్రముఖ కవి కృష్ణశాస్త్రి గారి సాహిత్యాన్ని ఐదు సంపుటాల్లో విశాలాంధ్ర పబ్లికేషన్ వారు ఒక క్రమంలో ప్రచురించడం సాహిత్య ప్రియులకు నిజంగా వరం. కృష్ణ శాస్త్రి సాహిత్యం పాఠకుల పరం. ముఖ్యంగా గేయాలు ఒక సంపుటిగా అందించడం అభినందనీయం. 'అమృతవీణ' అధ్యయంలో కృష్ణ రజని/కన్నీరు /మహతి/ మధుర మురళి / గుడిగంటలు/ ఋతులేఖ/ విరితూపు/భాగాల్లో దాదాపు 177 పాటలుదాకా ప్రచురించాను. "మంగళకాహళి" అధ్యాయంలో విజయభారతి/ ఆంధ్రగేహళి భాగాల్లో 83 పాటలు ప్రచురణ చేశారు. చివరలో పాటల పాద సూచి (పేజీ.198) ప్రచురణ పాఠకులకు ఏ పాట ఏ పేజీలో లభ్యమౌతుందో ఇవ్వడం చాలా బాగుంది. ఈ పాటల్లో జానపద అడుగుల సవ్వడి, భావ కవిత్వం గుబాళింపు, దేశభక్తి, విరహం, ప్రేమ, ప్రణయం... లాంటి అంశాల్లో చక్కటి గీతాలున్నాయి.

1924-1918, 1927, (ప్రాంతాల్లో రాసిన పాటలున్నాయి.

జయ జననీ! జయ జయ జననీ!
ప్రియభారతి ధాత్రీ! నేత్రీ!
జయ జననీ! జయ.. జయ జననీ! (పేజీ. 158)
జయ.. జయ.. మహాంధ్ర జనయిత్రీ!
జయ.. జయ.. మహాంధ్ర జనయిత్రీ!
జయ.. జయ.. ప్రియతమ భారతీ ధాత్రీ...
పుత్రీ! శుభదాత్రీ (పేజీ.163)

తెల్లారక మునుపే మా పల్లియ లేస్తుంది/ పల్లెలోన ప్రతి ఇల్లు కళ్ళు తెరచి చూస్తుంది. (పేజీ 175), చువ్వీ చువ్వన్న లాలో, చువ్వన్న లాలో! చువ్వన్న లాలో! ఊడుపు లూడుద్దాము ఓ లమ్మలాలో, ఓలమ్మలాలో (పేకజీ178), తెలుగు తల్లికి మంగళమ్! మాకల్ప వల్లికి మంగళమ్! (పేజీ.197) లాంటి భావోద్వేగమైన గీతాలెన్నో ఈ సంపుటిలో గుబాళిస్తాయి.

- తంగిరాల

ఉగ్రవ్యాధులపై అక్షరాస్త్రాలు

ప్రపంచ ఎయిడ్స్ దినం డిసెంబర్ 1, 2008- ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ- సప్తగిరి దూరదర్శన్ సంయుక్తంగా ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో కవి సమ్మేళం నిర్వహించాయి. ఆ కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులు, కవయిత్రుల కవితలు, కవి సమ్మేళనంలో పాల్గొనలేక పోయినప్పటికీ రాష్ట్రం నుండి ఎయిడ్స్ సమస్యపై స్పందించి రాసిన కవుల కవితలు, ఈ పుస్తకంలో సంకలనం చేశారు. ప్రముఖ కవి డా॥ జె. బాపురెడ్డి ఐ.ఏ.ఎస్. (రిటైర్ట్). డా॥ ఆర్. వి. చంద్రవదన్ 'ఆముఖం' రాశారు. దాదాపు 29 మంది కవులు, కవయిత్రుల కవితలు 88 పేజీల్లో వున్నాయి. "ఏకపత్నీవ్రతం - పాతివ్రత్యం/ ఎయిడ్స వ్యాధికి చోటు లేని శక్తి క్షేత్రాలుగా అభివర్ణిస్తున్నది" అని సంకలనకర్త -ప్రముఖకవి గా॥ జె. బాపురెడ్డి అంటారు (పేజీ.3). ప్రబంధ కాలం కాదు/ దుర్గంధ కాలం దాపురించింది (పేజీ.6) అంటారు డా॥ ఎండ్లూరి. 'హెచ్చైవి' సూక్ష్మక్రిమి/ తెచ్చిపెట్టు రోగం సుమి/ ఈ ఎయిడ్స్ మందులేని జబ్బు చావుదెబ్బ సుమీ" (పేజీ.11) అంటారు ప్రముఖ పద్యకవి డా॥ తిరుమల శ్రీనివాసాచార్య. "ఏమిస్తారు మా అబ్బాయికి అని నిర్లజ్జగా అడిగే వాళ్ళకి/ హెచ్.ఐ.వి. పరీక్ష చేయిస్తాం అని నిష్కర్షగా చెప్పండి (పేజీ.17) అంటారు శ్రీమతి పాటిబండ్ల రజని.

పరస్త్రీల సంపర్కం/కాబోదు మధురోహల మధుపర్కం" అంటారు జనజాగరణ కవితలో డా॥వడ్డేపల్లికృష్ణ.

కొత్తగ్రంథాలు చదివి మనో వ్యాధులకు గురైన /ఫ్రాయిడ్‌కు కౌన్సిలింగ్

ఉగ్రవ్యాధులపై అక్షరాస్త్రాలు
సంకలనకర్త డా॥జె. బాపురెడ్డి.
పేజీలు : 88, వెల: పేర్కొనలేదు
ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్
నియంత్రణ సంస్థ డి.ఎమ్.హెచ్.ఎస్
-క్యాంపస్ -కోఠి, హైద్రాబాద్
ఫో.నెం 24657221.



చేయిద్దాం! (పేజీ75) అంటారు ఎస్.రఘు. ఇంకా ఈ కవితా సంపుటిలో కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డా॥ దమ్ము శ్రీనివాస్ బాబు, డా॥ వెనిగళ్ళ రాంబాబు, అంబికా అనంత్, డా॥యాకూబ్, డా॥ లంకా శివరామప్రసాద్, అడిగోపుల వెంకటరత్నం, డా॥ ఆర్. సీతారాం, డా॥ రాధశ్రీ శశిశ్రీ, సాధనాల వెంకటస్వామి నాయుడు, శైలజామిత్ర, శాంతలక్ష్మి రేణుక అయోల, నాగటి ప్రసాదరావు, స్వర్ణ, పోతుకూచి పద్మ, నెల్లుట్ల రమాదేవి, వేమూరి, విశ్వనాథ్, బో ప్రభాకర్, దివాకర్ల రాజేశ్వరి లాంటి వారి కవితలున్నాయి.

- చక్రవర్తి



ఈ ఇంటిని తినొచ్చు

'ఇల్లు పీకి పందిరేయడం' అన్న మాట వినే వుంటారు. కానీ 'ఇల్లు పీకి తినడం' అన్న మాట విని వుండరు. కాకపోతే ఈ ఇంటిని మీ ముందు పెడితే మీరు సరిగ్గా అదే పని చేస్తారు. ఎందుకంటే దీన్ని మాంసంతో తయారుచేశారు కనుక.

ఇదంతా చదివాక 'ఈ ఐడియా ఎవరిదబ్బా?' అనుకుంటున్నారుకదూ. జోయల్ రిచర్డ్స్ అనే కుర్రోడికి ఒకానొక క్షణంలో ఈ ఐడియా వచ్చింది. వెంటనే కావాల్సిన మాంసాన్ని సేకరించి ఇలా తయారుచేసి ఓవెన్‌లోకి పంపేశాడు. ఎంచక్కా ఉడికిపోయింది. ఘుమఘుమలాడుతున్న మాంసపు ఇంటిని చూశాక లొట్టలు వేయకుండా...రుచి చూడకుండా ఎలా వుంటాం?! అయితే ఇదే ఐడియాను ఉపయోగించుకొని బ్రెడ్డుతోనో, జున్నుతోనో కూడా తినే ఇంటిని చేసేయొచ్చు. తర్వాత ఊరించుకుంటూ తినేయొచ్చు. ఏమంటారు!









కొంగ జపం

-చూటీ

అనగనగా ఒక కొంగ. ఓ చెరువులో నివసించేది. వయసైపోవడంతో చేపలు పట్టడం కష్టంగా తయారౌతుంది. ఒడ్డున నిలబడి చెరువులో ఈదులాడే చేపలను చూస్తూ లొట్టలు వేసుకునేది. అలా ఎంతకాలం?! అందుకే బాగా ఆలోచించి ఓ పథకం వేస్తుంది. ఎంచక్కా చెరువు మధ్యలో ఒంటి కాలిమీద నిలబడి కదలకుండా మెదలకుండా వుండిపోతుంది. తన చుట్టూ ఎన్ని చేపలు తిరుగుతున్నా పట్టించుకునేదికాదు. చిలిపి చేపపిల్లలు దాని కాలి దగ్గరకెళ్లి ఆడుకున్నా ఏం చేసేదికాదు. ఇదంతా ఓ ఎండ్రకాయ గమనించి..

"కొంగ బావా! కొంగ బావా!! ఇందాకటినుంచి చూస్తున్నాను. అలా జపం చేస్తూ నిలబడ్డావేంటి? మామూలుగా అయితే నీ దగ్గరకొచ్చిన చేపపిల్లను కూడా వదలకుండా గుటకాయ స్వాహా చేస్తావుకదా?" అనడుగుతుంది.

దానికి కొంగ నీరసంగా, జాలిగా ..."ఏం చెప్పమంటావు ఎండ్రి బావా! ఇప్పటికే నేను లెక్కకు మించి చేపలను మింగేసి పాపం చేశాను. ఇంకా నన్ను ఎంత పాపం చేయమంటావు? ఇంక ఈ పాపం చేయడం నావల్లకాదు" అంటుంది.

"ఇవాళేంటి కొంగ బావ చాలా వేదాంతం మాట్లాడుతున్నాడు. ఏంటి సంగతి"

"మరేముంది వేదాంతం కాక. మరో పన్నెండేళ్లపాటు వానలే వుండవంట. ఈ చెరువులూ, సరస్సులూ చుక్క నీరు లేకుండా ఎండిపోతాయి. అప్పుడు చెరువులు, సరస్సుల్లో నివసించే చేపలు, ఇతర జలచరాలు చనిపోతాయి. నేను మాత్రం ఇవేమీ లేకుండా ఒంటరిగా మిగిలిపోతాను. ఆ బతుకు బతికినా ఒకటే. చచ్చినా ఒకటే..అందుకే నేను దిగులుపడి ఇలా తపస్సు చేసుకుంటున్నాను" అంటుంది.

"అయితే ఈ సమస్య నుంచి బయటపడే మార్గమే లేదా?" అనడుగుతుంది ఎండ్రి.

"లేకనే వుంది. కొద్ది దూరంలో పేద్ద చెరువుంది. అది ఎన్నిసార్లు కరువు వచ్చినా ఎండని చెరువు. చుట్టుపక్కల చిన్న చిన్న జలాశయాల్లో నివసించే చేపలన్నీ తమ బంధువులు, స్నేహితుల సాయంతో అక్కడికే చేరుకుంటున్నాయి. కాని మన చెరువులో వుండే చేపలకే ఇంకా ఈ విషయం తెల్సినట్టు లేదు. అదే నాబాధంతా"

"అయితే నేను వెంటనే ఈ విషయం మన వాళ్లందరికీ చెప్పి వస్తాను" అంటూ కంగారుగా వెళ్లిపోతుంది.

విషయం తెల్సిన చేపలన్నీ భయపడిపోతాయి. ఎలాగైనా కొంగ సాయం తీసుకోవాలనుకుంటాయి. కొంగ తమని ముక్కున పట్టుకుని ఆ చేరువులో వదిలేస్తే...జీవితాంతం సుఖంగా బతకొచ్చనుకుంటాయి. దానికి కొంగ కూడా అంగీకరిస్తుంది. ఇక కొంగ ఆ పనిలోనే వుంటుంది. నాలుగైదు చేపలను ముక్కున కరుచుకుని కొండకు ఆవలున్న చెరువుకు తీసుకెళుతుంటుంది. అందుకు చెరువులోని చేపలన్నీ కొంగపట్ల ఎంతో గౌరవంగా వుంటాయి. అయితే అవతల చెరువులో తమ నేస్తాలు ఎలా వున్నాయో చూద్దామని వెళుతుంది ఎండ్రి. అయితే అక్కడ తనకు ఒక్క చేప మిత్రుడు కూడా కనిపించడు. ఆ సంగతి అడుగుదామని తిరిగి తమ చెరువుకు వస్తున్న ఎండ్రికి కొండమీద చేపల ఎముకలు కనిపిస్తాయి. అప్పుడు అర్థమౌతుంది కొంగ చేసిన మోసం. అయితే సరిగ్గా అప్పుడే నోటిలో చేపలను పట్టుకున్న కొంగ అక్కడికి వస్తుంది. దాన్ని అడుగుతుంది ఎండ్రి.

"ఇప్పటి వరకు తీసుకొచ్చిన చేపలను వదిలింది ఈ చెరువులోనేనా?" అని.

విషయం అంతా ఎండ్రికి తెల్సిపోయిందనుకున్న కొంగ "అవును. నేనా! ముసలిదాన్నయ్యాను. వేటాడ్డం కష్టంగా తయారైంది. అందుకే వర్షాలు పడవన్న అబద్ధం చెప్పి ఇలా నా పొట్ట నింపుకున్నాను" అంటుంది. రెంటికీ మాటా మాటా పెరిగి కొట్లాడుకునే వరకు వెళుతుంది. ఎండ్రి కొంగ మీదకెక్కి మెల్లిగా మెడ పట్టుకుని కొరికి చంపేస్తుంది. తర్వాత జరిగిన మోసాన్ని చేపలకు వివరించి...

"మన శత్రువైన కొంగ చనిపోయింది. ఇంక మనం ఎవరికీ భయపడకుండా హాయిగా బతకొచ్చు ఈ చెరువులో" అంటుంది. కొంగ మోసాన్ని కనిపెట్టి, దాన్ని మట్టుపెట్టినందుకు చేపలన్నీ ఎండ్రిని అభినందిస్తాయి.